ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698



తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శనివారం 20.06.2026 | సంపుటి :12 సంచిక : 331 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370






హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్


# విద్యార్థులు మత్తుకు బానిసలు కావొద్దు

## తెలంగాణ విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులు

### విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వసతి సౌకర్యాలు

తెలంగాణ భాషా ప్రయుక్తరాష్ట్రంగానో, పాలనా సౌలభ్యం కోసమో ఏర్పడింది కాదు. 60 ఏళ్ల సుదీర్ఘ పోరాటం, విద్యార్థుల ఆత్మ బలిదానాలతో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైంది. తెలంగాణ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు, ఉపాధి కోసం ఎంతోమంది త్యాగాలు చేశారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో ఉంది.. వాటిని పునరుద్ధరించాలి. విద్యాశాఖను గతంలో విధ్వంసం చేశారు. గత పాలకుల అరాచకంతో రాష్ట్రానికి వందేళ్ల నష్టం జరిగింది. తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ రూపొందించి ప్రక్షాళన చేపట్టాం. విధ్వంసమైన విద్యాశాఖను వికాసం వైపు నడిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం బడ్జెట్‌లో 8.5 శాతం నిధులు కేటాయించాం.

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- ప్రైవేటుకు దీటుగా తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి
- నేనే స్వయంగా విద్యామంత్రిగా ఉండి నిరంతరం పర్యవేక్షిస్తున్నా..
- ఎల్బీ స్టేడియం కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో కలిసి విద్యార్థులకు యంగ్ ఇండియా స్కూల్ కిట్స్ అందచేసిన సీఎం




నగరంలోని ఎల్బీ స్టేడియంలో విద్యార్థులకు యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్లను పంపిణీ చేస్తున్న రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా, సీఎం రేవంత్ రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు అజారుద్దీన్, అడ్లూరి, పొన్నం, కె.కేశవరావు తదితరులు

హైదరాబాద్(జనంసాక్షి): దేశ బవిష్యత్ పాఠశాలల్లోనే ఉందని గ్రహించి, అందుకు అనుగుణంగా తెలంగాణ విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కార్పోరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్దుతున్నామని అన్నారు. పేదలు ఆత్మన్యూనతకు లోనుకకాకుండా వారి పిల్లలకు కూడా ప్రైవేట్ తరహా విద్యను అందిస్తున్నామని అన్నారు. అందుకోసం విద్యార్థులు ఆత్మగౌరవంతో పాఠశాలకు వెళ్లేందుకు ఎడ్యుకేషన్ కిట్లను పంపిణీ చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యపై నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామని చెప్పారు. అందుకోసం విద్యాశాఖను తానే స్వయంగా నిర్వహిస్తున్నానని చెప్పారు. నగరంలోని ఎల్బీ స్టేడియంలో యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్ల పంపిణీని గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో కలిసి సీఎం ప్రారంభించారు. గురుకుల పాఠశాల విద్యార్థులకు 22 వస్తువులతో కిట్లు అందించారు. వసతి గృహ విద్యార్థులకు 10, పాఠశాల విద్యార్థులకు 7 వస్తువులతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణ భాషా ప్రయుక్తరాష్ట్రంగానో, పాలనా సౌలభ్యం కోసమో ఏర్పడింది కాదని మిగతా 2లో..

### వాట్సాప్‌లో పాఠశాల విద్యా సేవలు 3లో..

- 18 లక్షల మందికి పైగా విద్యార్థులు, తల్లిదండ్రులకు సమాచారం
- విద్యాశాఖ, మీసేవ నేతృత్వంలో ప్రభుత్వం వినూత్న కార్యక్రమం

## గాంధీ సరోవర్‌కు రక్షణశాఖ అనుమతులు

మూసీరివర్‌ఫ్రంట్ అభివృద్ధికి కీలక ముందడుగు

రూ.533.42 కోట్ల విలువైన 83.81 ఎకరాల డిఫెన్స్ భూమి అప్పగింత



- అనుమతులు ఇస్తూ రక్షణ శాఖ ఉత్తర్వులు
- అప్పగింతపై ముఖ్యమంత్రి రేవంత్ హర్షం
- కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌కు సీఎం కృతజ్ఞతలు

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి కీలక ముందడుగు పడింది. గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ అమలుకు కేంద్రం నుంచి అధికారిక అనుమతి లభించింది. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్ట్‌కు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బాపూఘాట్‌ను 'గాంధీ సరోవర్'గా అభివృద్ధి చేయడానికి వర్కింగ్ పర్మిషన్‌ను మంజూరు చేసింది. రూ.533.42 కోట్ల విలువైన 83.81 ఎకరాల డిఫెన్స్ భూమి వినియోగానికి అనుమతిచ్చింది. ఆర్టిలరీ సెంటర్ గోల్కొండ పరిధిలోని భూమిలో అభివృద్ధి పనులకు కేంద్రం క్లియరెన్స్ ఇచ్చింది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్ట్‌కు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ నుండి కీలక అనుమతులు లభించాయి. హైదరాబాద్‌లోని బాపు ఘాట్ వద్ద నిర్మించతలపెట్టిన గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ పనులకు మిగతా 2లో..

## అల్లు అర్జున్‌కు సమన్లు

సంధ్య థియేటర్ ఘటనలో జారీ చేసిన నాంపల్లి కోర్టు



2లో..

## నీట్ రీ టెస్ట్‌కు ఓకే

- పరీక్షను నిలిపివేసేందుకు సుప్రీం నిరాకరణ
- నీట్ రీ-టెస్టు పేపర్ లీక్ ప్రచారం నిజం కాదు
- పుకార్లను కొట్టిపారేసిన కేంద్రం ప్రభుత్వం



న్యూఢిల్లీ(జనంసాక్షి):నీట్ యూజీ రీ-ఎగ్జామ్‌కు లైన్ క్లియర్ అయ్యింది. ఈ పరీక్షను నిలిపివేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. దీంతో జూన్ 21న పరీక్ష యథాతథంగా కొనసాగనుంది.పరీక్ష ను నిలిపివేయాలంటూ పలువురు అభ్యర్థులు సుప్రీంను ఆశ్రయించారు. దీనిపై శుక్రవారం విచారణ మిగతా 9లో..

## రాష్ట్రంలో దశల వారీగా భూముల రీసర్వే

### భూవివాదాలు లేని తెలంగాణ నిర్మాణమే లక్ష్యం

తొలిదశలో వచ్చేనెల నుంచి రాష్ట్రంలోని 2240 గ్రామాల్లో ప్రారంభం : మంత్రి పొంగులేటి



హైదరాబాద్(జనంసాక్షి):భూ సమస్యలు, భూవివాదాలు లేని తెలంగాణను నిర్మించాలనే లక్ష్యంతో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో భూ సర్వే నిర్వహించాలని కీలక నిర్ణయం తీసుకుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా భూముల రీసర్వే కార్యక్రమాన్ని వచ్చే నెల నుంచి దశల వారీగా ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. శుక్రవారం నాడు రెవెన్యూ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 10,954 రెవెన్యూ గ్రామాలుండగా తొలి దశలో హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాల నుంచి 70 గ్రామాల చొప్పున మొత్తం 2240 గ్రామాలను ఎంపిక చేసి రీసర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని.. అది అతని జీవనాధారమని ప్రతి అంగుళం భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు భూదార్, ప్రతి రైతుకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణను భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ఈ రీ-సర్వే కార్యక్రమం చారిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుందని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో 1936 నాటి నిజాం కాలం సర్వే రికార్డులే ప్రధాన ఆధారంగా ఉన్నాయని, కాలక్రమేణా భూముల విభజనలు, ఉపసంఖ్యలు పెరగడం, మిగతా 2లో..



## ధాన్యం నిల్వ వ్యవస్థ ఆధునీకరణకు ప్రణాళికలు

### రాష్ట్రవ్యాప్తంగా 20 ప్రాంతాల్లో ఆధునిక ధాన్య సైలోల ఏర్పాటు

- ప్రస్తుత కొనుగోలు వ్యవస్థ కొనసాగుతుంది.
- ఎస్‌హెచ్‌జీలు, పీఏసీఎస్‌ల పాత్ర యథాతథం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్రంలో ధాన్యం నిల్వ వ్యవస్థను మరింత శాస్త్రీయంగా, ఆధునికంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రధాన వరి ఉత్పత్తి జిల్లాల్లో 20 ప్రాంతాల్లో అత్యాధునిక సైలోల ఏర్పాటుపై ప్రభుత్వం పరిశీలన చేస్తున్నట్లు వెల్లడించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో శుక్రవారం ధాన్య నిల్వ, రవాణా రంగానికి చెందిన ప్రముఖ సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో వరి ఉత్పత్తి, ధాన్యం కొనుగోళ్లు ప్రతి ఏడాది పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిల్వ సామర్థ్యాలను కూడా పెంచాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. అందులో భాగంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సైలోల ఏర్పాటును ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. ప్రారంభ దశలో 50 వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యంతో సైలోల నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసే అవకాశాలను అధ్యయనం మిగతా 2లో..

## ఫుట్‌పాత్‌పై నడవడం ప్రాథమిక హక్కు

- సుప్రీం కోర్టు కీలక తీర్పు
- పాదచారుల భద్రతకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్రానికి సూచన



న్యూఢిల్లీ(జనంసాక్షి):పాదచారుల భద్రతకు సంబంధించి సుప్రీం కోర్టు కీలక తీర్పు వెలువరించింది. నిర్దేశించిన ఫుట్‌పాత్‌పై నడవడం పౌరులందరికీ రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని పేర్కొంది. వాహనాల రాకపోకల కన్నా ఫుట్‌పాత్‌లపై నడిచే వారికే అధిక ప్రాధాన్యత ఉంటుందని జస్టిస్ పీఎస్ నరసింహా, జస్టిస్ ఏఎస్ చందూకర్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. పాదచారుల భద్రతకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్రానికి సూచించింది. రహదారులు ఉన్నచోట కాలిబాటను గుర్తించి.. మౌలిక సదుపాయాల కల్పన, వాటి నిర్వహణ చూసుకోవాల్సిన బాధ్యత మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, పంచాయతీలపై మిగతా 9లో..

## స్టార్‌లింక్‌కు పోటీగా శాట్‌కామ్ రంగంలోకి జియో

సంస్థ ఏజీఎంలో ప్రకటించిన మేనేజింగ్ డైరెక్టర్ ఆకాశ్ అంబానీ 2లో..

## రాహుల్ జన్మదినం రోజే రైతు డిక్లరేషన్‌కు చెల్లుచీటీ

- కాంగ్రెస్ ప్రభుత్వానిది విశ్వాసఘాతుకం
- కేంద్రం నిర్ణయం మేరకే కొంటే మీరేందుకు?
- రైతులపై విషం కక్కిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- మీడియా సమావేశంలో ప్రభుత్వంపై హరీశ్ విమర్శలు

సిద్దిపేట(జనంసాక్షి): కేంద్రం కనీస మద్దతు ధర నిర్ణయించిన పంటలను మాత్రమే కొంటామంటే ఇక మీరెందుకని అధికార కాంగ్రెస్ పార్టీ నేతలను బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు సూటిగా ప్రశ్నించారు. పేపర్‌లెస్ కేబినెట్ అన్నారని.. కానీ మిగతా 2లో..

## ఎన్నికల హామీలు బుట్టదాఖిలు

- ప్రజల సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్ పార్టీ
- కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పాలన సాగిస్తున్నారు
- మాఫియా నాయకుడిగా రేవంత్ వ్యవహార శైలి
- మల్కాజిగిరి కార్యకర్తల సమావేశంలో కేటీఆర్



హైదరాబాద్(జనంసాక్షి): రేవంత్ రెడ్డి అబద్దాలు చెప్పి, మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మిగతా 2లో..



## వాయుస్థావరాలపై ఉగ్రపంజా

నైజర్‌లో అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు సైనిక వైమానిక స్థావరాలపై ఉగ్రదాడి

### 13 మంది మృతి.. పలువురికి తీవ్రగాయాలు

నియామే(జనంసాక్షి):నైజర్‌లో ఘోరం జరిగింది. గురువారం (స్థానిక కాలమానం ప్రకారం) రాజధాని నియామేలోని దియోరి హమాని అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు సైనిక వైమానిక స్థావరాలపై ఉగ్రదాడి జరిగింది. ఈ ఘటనలో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడిని తామే చేశామని అల్‌ఖైదా అనుబంధ సంస్థ జమాత్ నుస్రత్ అల్- ఇస్లాం వల్ ముస్లిమిన్ ప్రకటించింది. స్థానిక కాలమానం ప్రకారం.. ఉదయం 6 గంటల సమయంలో మొదలైన మిగతా 2లో..

## ఆదిలోనే హంసపాదు

### ట్రంప్‌కు షాకిచ్చిన ఇజ్రాయెల్ • లెబనాన్‌పై మళ్లీ దాడులు



బీరూట్(జనంసాక్షి):పశ్చిమాసియాలో యుద్ధం ముగింపునకు అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందంపై సంతకాలు జరిగిన మరుసటి రోజే అగ్రరాజ్యానికి ఇజ్రాయెల్ షాకిచ్చింది. లెబనాన్‌పై బాంబులతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో 16 మంది మృతి చెందినట్లు ఇజ్రాయెల్ మిలిటరీ వెల్లడించింది. దీంతో పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.దక్షిణ లెబనాన్‌లోని హెజ్‌బొల్లా స్థావరాలే లక్ష్యంగా దాడులు చేశామని ఇజ్రాయెల్ మిలిటరీ వెల్లడించింది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని పేర్కొంది. మిగతా 2లో..

## చర్చలు వాయిదా

లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో అమెరికాతో చర్చలకు బ్రేక్

తాత్కాలికంగా దూరంగా ఉండాలని ఇరాన్ నిర్ణయం

2లో..

## ఎలాంటి షరతులు లేకుండానే ఇరాన్ లొంగుబాటు

ప్రపంచాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి కాపాడేందుకే చర్చలకు ప్రాధాన్యమిచ్చా : ట్రంప్

## గాంధీ సరోవర్‌కు రక్షణశాఖ అనుమతులు

రక్షణ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ కీలకమైన క్లియరెన్స్ లభించడం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో సహకరించి, అనుమతులు మంజూరు చేసినందుకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర రక్షణ శాఖ , ఇండియన్ ఆర్మీకి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మూసీ నది పునరుజ్జీవనం , రివర్‌ఫ్రంట్ అభివృద్ధి విజన్‌లో గాంధీ సరోవర్ ప్రాజెక్ట్‌కు అనుమతులు రావడం ఒక కీలక మైలురాయి అని అభివర్ణించారు. బాపు ఘాట్ పరిసర ప్రాంతాలలో ఈ ప్రాజెక్ట్ పనులు ప్రారంభం కావడం వల్ల మూసీ పరివాహక ప్రాంత రూపురేఖలు మారిపోతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మూసీ నది పరివాహక ప్రాంతాన్ని కేవలం ఒక నదిలా కాకుండా.. అద్భుతమైన పర్యావరణ, సాంస్కృతిక , గొప్ప ప్రజా ఆస్తిగా మార్చడమే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా హైదరాబాద్ నగరానికి ఒక సరికొత్త పర్యాటక హంగులు తోడవుతాయని, పర్యావరణ రక్షణకు కూడా ఇది ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. కేంద్ర రక్షణ శాఖ ఇచ్చిన ఈ గ్రీన్ సిగ్నల్‌తో గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ పనులు మరింత వేగంగా ముందుకు సాగనున్నాయి.మూసీ పునరుజ్జీవం, రివర్ ఫ్రంట్ అభివృద్ధి విజన్‌లో ఇదో మైలురాయన్నారు. మూసీ పరివాహక ప్రాంతాన్ని పర్యావరణ, సాంస్కృతిక, ప్రజా ఆస్తిగా మార్చడమే లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## వాయుస్థావరాలపై ఉగ్రపంజా

ఈ దాడి రెండు గంటలకు పైగా కొనసాగిందని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. మృతుల్లో 11 మంది సైనికులు కాగా.. మరో ఇద్దరు సాధారణ పౌరులని అక్కడి ప్రభుత్వం పేర్కొంది. ఈ దాడిని భద్రతా బలగాలు తిప్పికొట్టాయని.. 22 మంది దుండగులను హతమార్చారని తెలిపింది. మరికొందరిని అదుపులోకి తీసుకోవడంతో పాటు పదుల సంఖ్యలో ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించింది. ప్రస్తుతం ఇక్కడ పరిస్థితులు అదుపులోనే ఉన్నాయని తెలిపింది. తాజా దాడి నేపథ్యంలో విమానాశ్రయంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. విమాన రాకపోకలు కూడా పునఃప్రారంభమయ్యాయని నైజర్ పౌర విమానయాన సంస్థ పేర్కొంది. ఈ దాడిని తామే చేశామని జేఎన్ఐఎం ప్రకటించుకుంది. సోషల్ మీడియాలో చేసిన ఓ ప్రకటనలో విమానాశ్రయం, దాని సమీపంలోని ఓ సైనిక స్థావరంపైనా ఆత్మాహుతి దాడికి పాల్పడినట్లు పేర్కొంది. కాగా.. ఈ విమానాశ్రయ ప్రాంగణంపై దాడి జరగడం ఈ ఏడాదిలో ఇది రెండోసారి. జనవరిలో ఇస్లామిక్ స్టేట్ సాహెల్ ప్రావిన్స్ అనే సంస్థ దీన్ని లక్ష్యంగా చేసుకొని దాడి చేసింది.

## ఆదిలోనే హంసపాదు

ఇక్కడ హెజ్‌బొల్లా కార్యకలాపాలతో తమ దేశానికి ముప్పు పెరుగుతోన్న నేపథ్యంలోనే ఈ ఆపరేషన్ చేస్తున్నట్లు పేర్కొంది. ఈ దాడుల్లో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. కాగా.. ఈ పరిణామాలు అమెరికా-ఇరాన్ మధ్య జరిగిన నూతన ఒప్పందాన్ని నీరుగార్చేలా ఉండడం గమనార్హం.ఈ శాంతి ఒప్పందంలో లెబనాన్ అంశాన్ని కూడా చేర్చిన సంగతి తెలిసిందే. లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైనిక ఆపరేషన్లను తక్షణమే ముగించి.. ఆ ప్రాంతాన్ని వీడాలని ఒప్పందంలో పేర్కొన్నారు. అయితే, దీన్ని ఇజ్రాయెల్ ముందునుంచీ వ్యతిరేకిస్తోంది. హెజ్‌బొల్లా నుంచి తమకు పొంచి ఉన్న ముప్పు పూర్తిగా తొలగిపోయేంతవరకు దక్షిణ లెబనాన్ నుంచి వెనక్కి వెళ్లబోమని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఇప్పటికే స్పష్టం చేశారు. సరిహద్దు నుంచి 10 కిలోమీటర్ల వరకూ ఆక్రమించుకున్న ప్రాంతం నుంచి వైదొలగబోమని వెల్లడించారు. ఈ ప్రకటన చేసిన కొద్ది గంటలకే ఇజ్రాయెల్ దళాలు దాడులను ముమ్మరం చేయడంతో మళ్లీ ఉద్రిక్తతలు రాజుకున్నాయి. ఈ పరిణామాలపై ఇరాన్, అమెరికా ఇంకా స్పందించలేదు.

## చర్చలు వాయిదా

**టెహ్రాన్(జనంసాక్షి):** అమెరికా-ఇరాన్ మధ్య జరగాల్సిన చర్చలు వాయిదా పడ్డాయి. యుద్ధాన్ని ముగించే విషయంపై చర్చలు వాయిదా పడినట్లు స్విట్జర్లాండ్ ప్రకటించింది. ఒప్పందం కుదిరిన కొన్ని గంటలకే ఇజ్రాయెల్-హెజ్‌బొల్లా మధ్య పోరాటం ఉద్ధృతమైంది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో 16మంది మృతి చెందారు. దీంతో చర్చలకు తాత్కాలికంగా దూరంగా ఉండాలని ఇరాన్ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ చర్చల కోసం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్విట్జర్లాండ్‌కు వెళ్లాల్సి ఉండగా.. చివరి నిమిషంలో తన పర్యటనను వాయిదా వేసుకున్నారు. చర్చలను పునఃప్రారంభించే ముందు లెబనాన్‌పై దాడులు ముగుస్తాయని హామీ ఇవ్వాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది. ప్రస్తుతం లెబనాన్‌లో జరుగుతున్న పోరాటాన్ని శాంతింపజేయడానికి మధ్యవర్తులు కృషి చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. అమెరికా-ఇరాన్ మధ్య జరిగిన ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ఉల్లంఘిస్తోందన్నారు. దీంతో హార్మూజ్‌లో ఆంక్షల సడలింపు, సముద్ర భద్రత, అణు సంబంధిత చర్యలు, ప్రాంతీయ హామీలపై జరగాల్సిన చర్చలు వాయిదా పడినట్లు తెలిపారు. గురువారం ఇజ్రాయెల్-హెజ్‌బొల్లా మధ్య జరిగిన దాడుల్లో నలుగురు ఇజ్రాయెల్ సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయంపై ఆ దేశ జాతీ య భద్రతా శాఖ మంత్రి ఇటామర్ బెన్ గ్విర్ స్పందిస్తూ.. లెబనాన్ మొత్తా న్ని తగలబెట్టాలని సైన్యానికి పిలుపునిచ్చారు. తమ సైన్యం, ప్రజలు బలిదా నానికి సిద్ధంగా లేరని ప్రపంచానికి స్పష్టం చేయాలనుకుంటున్నట్లు తెలిపా రు. ఈ సమస్య మాటలతో తొలగిపోయేలా లేదని.. నిప్పుతో మాట్లాడాల్సిన సమయం వచ్చిందని ఆర్థిక మంత్రి బెజలెల్ స్మోట్రిచ్ పేర్కొనడం గమనార్హం.

## ఎలాంటి షరతులు లేకుండానే ఇరాన్ లొంగుబాటు



వాషింగ్టన్(జనంసాక్షి):ఇరాన్‌తో ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో ఒప్పందం విఫలమైతే ఏం చేస్తారని మీడియా అడిగిన ప్రశ్నకు.. 'ఒప్పందం సఫలమైతే ఆ ఘనత నా ఖాతాలో వేసుకుంటా.. విఫలమైతే ఆ నింద జేడీ వాన్స్‌పై వేస్తా'నంటూ నవ్వుతూ బదులిచ్చారు. కాబట్టి ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఉపాధ్యక్షుడికి సూచించారు. ఇరుదేశాల మధ్య కుదిరిన ఒప్పందంలో టెహ్రాన్ ఎలాంటి షరతులు విధించకుండానే లొంగిపోయిందని పేర్కొన్నారు. హార్మూజ్ మూసివేతతో ప్రపంచ వాణిజ్య మార్గాలకు అంతరాయం ఏర్పడడంతో.. ప్రపంచాన్ని ఆర్థిక సంక్షోభం బారి నుంచి కాపాడేందుకు తానే చర్చలకు ప్రాధాన్యం ఇచ్చినట్లు ట్రంప్ వెల్లడించారు.ఈ ఘర్షణ మరింత విస్తృత ఆర్థిక విపత్తుగా మారకుండా నివారించడానికే ఒప్పందం కుదుర్చుకున్నట్లు ట్రంప్ మీడియా సమావేశంలో పేర్కొన్నారు. తన శక్తికి, అధికారానికి పరిమితులు లేవని వ్యాఖ్యానించారు. మరోవైపు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇజ్రాయెల్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రపంచంలో ఇజ్రాయెల్‌పై సానుభూతి ఉన్న ఏకైక దేశాధినేత ట్రంప్ మాత్రమేనని పేర్కొన్నారు. అమెరికా డబ్బుతోనే ఇజ్రాయెల్ అభివృద్ధి చెందుతోందన్నారు. తమ అతిపెద్ద సమస్య అమెరికా అధ్యక్షుడే అని ఇజ్రాయెల్‌లో ఎవరైనా అనుకుంటే.. వారు ఇప్పటికైనా మేల్కొని తమ దేశం ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితిని గ్రహించాలని సూచించారు. ఇరాన్-అమెరికా చేసుకున్న ఒప్పందంలోని నిబంధనలను పాటించాల్సిన అవసరం లేదని ఇజ్రాయెల్ క్యాబినెట్‌లోని జాతీయ భద్రతా మంత్రి ఇటామర్ బెన్-గ్విర్ పేర్కొన్న నేపథ్యంలో జేడీ వాన్స్ ఈ వ్యాఖ్యలు చేశారు.

# విద్యార్థులు మత్తుకు బానిసలు కావొద్దు



ఈసందర్భంగా అన్నారు. 60 ఏళ్ల సుదీర్ఘ పోరాటం, విద్యార్థుల ఆత్మబలిదానాలతో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైంది. తెలంగాణ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు, ఉపాధి కోసం ఎంతోమంది త్యాగాలు చేశారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో ఉంది.. వాటిని పునరుద్ధరించాలన్నదే తన సంకల్పమని అన్నారు. విద్యాశాఖను గతంలో విధ్వంసం చేశారు. గత పాలకుల అరాచకంతో రాష్ట్రానికి వందేళ్ల నష్టం జరిగింది. తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ రూపొందించి ప్రక్షాళన చేపట్టాం అని వివరించారు. విధ్వంసమైన విద్యాశాఖను వికాసం వైపు నడిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం బడ్జెట్‌లో 8.5 శాతం నిధులు కేటాయించాం. వెనుకబడిన తరగతుల విద్యార్థుల కోసం రూ.26,600 కోట్లు ఖర్చు చేస్తున్నాం. వీటిని భావితరాల భవిష్యత్తును నిర్ణయించే పెట్టుబడులుగా భావిస్తున్నాం. ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో నో అడ్మిషన్ బోర్డు పెట్టారు. ప్రభుత్వ స్కూళ్లలో ఇలా బోర్డు పెట్టే పరిస్థితి వస్తుందని ఎవరూ ఊహించి ఉండరని అన్నారు. ఉద్యోగులకు జీతాల మాదిరిగానే ప్రతినెలా ఒకటో తేదీన విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తున్నామని రేవంత్‌రెడ్డి అన్నారు. గతంలో హాస్టల్ విద్యార్థులకు ఈ ఛార్జీలు పెంచలేదని, తాము అధికారంలోకి వచ్చాక పెంచామని అన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్‌తో పాటు మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

**యంగ్ ఇండియా వెల్కమ్ కిట్ల పంపిణీ**

హైదరాబాద్(జనంసాక్షి):ఎల్బీ స్టేడియంలో యంగ్ ఇండియా వెల్కమ్ కిట్స్ పంపిణీ, డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించడంతో పాటు కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. తెలంగాణ వ్యాప్తంగా రూ.50.73కోట్లతో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి సీఎం రేవంత్ శ్రీకారం చుట్టారు. అందులో రూ.36.65కోట్లతో వివిధ జిల్లాల్లో మినీ స్టేడియాల నిర్మాణం, క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. రూ.14.08కోట్లతో గచ్చిబౌలి, ఎల్బీ స్టేడియాల్లో బాలబాలికల క్రీడా శిక్షణకు వివిధ అకాడమీలను రేవంత్ ప్రారంభించారు. రూ.10కోట్లతో రంగారెడ్డి జిల్లా కొందుర్గ్‌లో మినీ స్టేడియం నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ.10కోట్లతో సంగారెడ్డిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియం ఆధునికీకరణకు కొబ్బరికాయ కొట్టారు. అలాగే రూ.4కోట్లతో నారాయణపేట్ జిల్లా నర్వలో మినీ స్టేడియం నిర్మాణానికి భూమిపూజ చేశారు. రూ.4కోట్లతో వనపర్తి జిల్లా ఆత్మకూర్‌లో మల్టీ పర్పస్ స్టేడియం, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో కోర్టుల నిర్మాణం, క్రికెట్ గ్రౌండ్, వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. అలాగే రూ.3.50కోట్లతో కామారెడ్డి జిల్లా గాంధారి, రూ.2.65కోట్లతో మెదక్ జిల్లా నర్సాపూర్‌లో మినీ స్టేడియాలకు భూమిపూజ చేశారు.

రూ.2.50కోట్లతో నారాయణపేట్ జిల్లా మక్తల్ మండలం ఉట్కూరులో వాలీబాల్, కబడ్డీ కోర్టుల నిర్మాణానికీ కొబ్బరికాయ కొట్టారు సీఎం రేవంత్. రూ.5.70 కోట్లతో బాలికల కోసం హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన ఈఎఈం తెలంగాణ టాలెంట్ అకాడమీ ప్రారంభం చేశారు. రూ.5.70 కోట్లతో బాలుర కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన ఈఎఈం తెలంగాణ టాలెంట్ అకాడమీ ప్రారంభించారు. రూ.35.95 లక్షలతో బాలికల కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన అథ్లెటిక్స్ అకాడమీ ప్రారంభం అయ్యింది. రూ.35.94 లక్షలతో బాలుర కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన అథ్లెటిక్స్ అకాడమీ ప్రారంభం చేశారు. రూ.44.50 లక్షలతో బాలికల కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన హాకీ అకాడమీ ప్రారంభం చేశారు. రూ.44.50 లక్షలతో బాలుర కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన హాకీ అకాడమీ ప్రారంభం అయ్యింది. రూ.58.50 లక్షలతో బాలుర కోసం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఫుట్ బాల్ అకాడమీ ప్రారంభం చేశారు. రూ.49 లక్షలతో బాలుర కోసం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన హ్యాండ్ బాల్ అకాడమీ ప్రారంభం అయ్యింది. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. మరోవైపు గురుకుల విద్యార్థులకు 22 రకాల వస్తువులు, హాస్టల్ విద్యార్థులకు 10, డే స్కాలర్లకు 7 రకాల విద్యా సామగ్రితో కిట్లను అందించారు. ఈ కార్యక్రమానికి సుమారు 15వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ చారిత్రాత్మక వేడుకకు రాష్ట్రంలోని ప్రభుత్వ బడులు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీలు), ప్రభుత్వ గురుకులాలు, విద్యా వసతి గృహాల నుంచి దాదాపు 15 వేల మంది విద్యార్థులు తరలివచ్చారు. విద్యార్థులు చదువుకునే విద్యాసంస్థల రకాన్ని బట్టి వారి అవసరాలకు తగినట్లుగా ఈ కిట్లను ప్రభుత్వం ప్రత్యేకంగా డిజైన్ చేసింది.

## అల్లు అర్జున్‌కు సమన్లు

హైదరాబాద్(జనంసాక్షి): సంధ్య థియేటర్ ఘటనలో సినీ నటుడు అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు సమన్లు జారీ చేసింది. సోమవారం విచారణకు హాజరు కావాలని పేర్కొంది. ఈ కేసులో అల్లు అర్జున్‌ను చిక్కడపల్లి పోలీసులు ఏ11 నిందితుడిగా చేర్చారు. ఏ1 నుంచి ఏ10 వరకు నిందితులుగా సంధ్య థియేటర్ యాజమాన్యం ఉంది. సంధ్య థియేటర్ ఘటనలో ఇప్పటి వరకు 19 మందికి సమన్లు జారీ అయ్యాయి. నిందితుల వ్యక్తిగత హాజరు తర్వాత కేసు విచారణ ప్రారంభం కానుంది.ఇప్పటికే 23 మందిని నిందితులుగా చేర్చి పోలీసులు ఛార్జిషీట్ దాఖలు చేశారు. 2024 డిసెంబర్ 4న పుష్ప-2 సినిమా బెనిఫిట్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనలో రేవతి అనే మహిళ మృతి చెందగా.. అమె కుమారుడు శ్రీతేజ తీవ్రంగా గాయపడ్డాడు.

## ఎన్నికల హామీలు బుట్టదాఖలు

ఈ కొద్ది రోజుల్లోనే ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ, ప్రభుత్వాన్ని ఒక మాఫియాతో పోల్చారు. ప్రభుత్వం ఏర్పడి ఇన్ని రోజులవుతున్నా ఇచ్చిన గ్యారంటీల ఊసే లేదు. దీనిపై ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తే అడ్డమైన తిట్లు తిడుతున్నారు. వంద రోజుల్లో పిల్లలు పుడతారా అంటూ వింత మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌ను తిట్టుకుంటూ తిరిగితే చాలు, పాలన చేయనక్కర్లేదు అనే చందాన సీఎం వ్యవహార శైలి ఉందని విమర్శించారు. గత ప్రభుత్వం చేసిన పనులకు రిబ్బన్లు కట్ చేయడానికి సీఎం తన జేబులో కత్తెర పెట్టుకుని తిరుగుతున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర అభివృద్ధి శూన్యమైందని, కేవలం అప్పులే పెరిగిపోయాయని కేటీఆర్ ఆరోపించారు. ఈ కొద్ది కాలంలోనే ప్రభుత్వం దాదాపు 4 లక్షల కోట్ల రూపాయల అప్పు చేసిందని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో పేదలకు ఒక్క ఇల్లు కూడా కట్టి ఇవ్వలేదు గానీ, 'హైడ్రా' పేరుతో ఉన్న ఇళ్లను మాత్రం నిర్దాక్షయంగా కూల్చుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులను 'దండుపాళ్యం ముఠా'తో పోల్చిన ఆయన, ఈ ప్రభుత్వాన్ని ఒక మాఫియా నడుపుతోందని, ఆ మాఫియాలో రేవంత్ రెడ్డి ఒక పిల్ల నాయకుడు అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రంలో రైతుల పరిస్థితి మరీ దారుణంగా తయారైందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం దగ్గర గోనెసంచులు కూడా లేవని, ఆ సంచులన్నీ ఢిల్లీకి పోతున్నాయని విమర్శించారు. రైతులకు ఇవ్వాల్సిన 'రైతుబంధు' డబ్బు బంద్ అయిపోయిందని, ఆ పైసలన్నీ రాహుల్ గాంధీ ఖాతాలో 'టింగ్ టింగ్' అని పడుతున్నాయని ఆరోపించారు. ప్రస్తుతం పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే, రైతులు ధాన్యం కుప్పలపైనే ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు.కాంగ్రెస్ పాలనలో ప్రజలకు మంచి, చెడు ఏంటో పూర్తిగా అర్థమైందన్న కేటీఆర్, కేసీఆర్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలంతా కథానాయకులు కావాలని పిలుపునిచ్చారు. మల్కాజ్‌గిరి ప్రజలు , బిఆర్ఎస్ కార్యకర్తలు ఎటువంటి రౌడీలు, గుండాలకు భయపడాల్సిన అవసరం లేదని, పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పరంగా నిలబడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ఫోన్ ట్యాపింగ్ కేసు..

## విచారణకు హాజరైన చీకోటి ప్రవీణ్

హైదరాబాద్(జనంసాక్షి): ఫోన్ ట్యాపింగ్ కేసులో బీజేపీ అధికార ప్రతినిధి చికోటి ప్రవీణ్ విచారణ ముగిసింది. దాదాపు గంటన్నరపాటు ప్రవీణ్‌ను సిట్ అధికారులు విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ సిట్ కార్యాలయంలో ఆయనను అధికారులు విచారించారు. విచారణకు ముందు సిట్ కార్యాలయం ఎదురుగా ఉన్న అమ్మవారి దేవాలయంలో దర్శనం చేసుకున్నారు చికోటి ప్రవీణ్. సిట్ విచారణ అనంతరం మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ.. 'ఫోన్ ట్యాపింగ్‌పై సిట్ అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చాను. మా ఫోన్లు ట్యాప్ చేసి వ్యక్తిగత విషయాలను విన్నారు. ఊహించిన దానికన్నా ఘోరంగా ఫోన్ల ట్యాపింగ్ జరిగినట్లు విచారణలో నాకు అర్థమైంది. నేను 200మంది ఫోన్లు మాత్రమే ట్యాప్ అయ్యాయని అనుకున్నా. కానీ ఆ జాబితా రెండు వేలకు పైగా ఉంది. నాకు దగ్గరిగా ఉన్న వారి ఫోన్లనూ విన్నారు. విచిత్రం ఏమిటంటే, ఎక్కువగా బీఆర్ఎస్ నాయకులకు సంబంధించిన ఫోన్లనే ట్యాప్ అయ్యాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల భార్యలు, పనిమనుషులకు సంబంధించిన ఫోన్లను ట్యాప్ చేశారు. రాధా కిషన్ రావు ఎవరో తెలియదని కేసీఆర్ అన్నారు. ఆయన నియామకానికి సంబంధించిన జీవో తెచ్చింది కేసీఆర్ కాదా?. ఇలాంటి నీచమైన రాజకీయాలు ప్రపంచంలో బీఆర్ఎస్ తప్ప ఎవరూ చేయరని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఇరాన్ నౌకలకు లైన్ క్లియర్..

### దిగ్బంధనాన్ని ఎత్తేసిన అమెరికా

**టెహ్రాన్(జనంసాక్షి):** అమెరికా- ఇరాన్ మధ్య అవగాహన ఒప్పందంపై సంతకాలు జరగడంతో.. హార్మూజ్ జల సంధిలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇక్కడ ఇరాన్ నౌకల రాకపోకలపై విధించిన దిగ్బంధనాన్ని అమెరికా ఎత్తివేసింది. ఈ మేరకు యూఎస్ సెంట్రల్ కమాండ్ ఓ పోస్టులో ఈ విషయాన్ని వెల్లడించింది. 'అధ్యక్షుడు ట్రంప్ ఆదేశాల మేరకు ఇరాన్ ఓడరేవులు.. తీర ప్రాంతాలకు రాకపోకలు సాగించే అన్ని నౌకలపై విధించిన దిగ్బంధనాన్ని ఎత్తివేశాం. ఇరాన్ ఓడరేవులకు లేదా అక్కడి రాకపోకలకు అమెరికా దళాలు ఆటంకం కలిగించవు' అని సెంటకామ్ పేర్కొంది. దిగ్బంధనం ఎత్తివేసినప్పటికీ.. ఒప్పందం అమలును పర్యవేక్షించేందుకు అమెరికా యుద్ధనౌకలు దాని సమీపంలోనే మోహరించి ఉంటాయని స్పష్టంచేసింది. డీల్‌లోని అన్ని అంశాలను పాటిస్తూ.. వాటికి కట్టుబడి, అవి పూర్తిగా అమలవుతున్నాయని నిర్ధరించే వరకు తమ శక్తిమంతమైన యుద్ధనౌకలు ఈ ప్రాంతంలోనే ఉంటాయని పేర్కొంది. 60 రోజుల శాంతి ఒప్పందానికి సంబంధించిన ఎంవోయూపై ఇరుదేశాలు నిన్న సంతకాలు చేసిన సంగతి తెలిసిందే. దీని అనంతరం హార్మూజ్‌లో చిక్కుకుపోయిన నౌకల ప్రయాణం కూడా ప్రారంభమైంది. దీంతో మరికొన్ని రోజుల్లో చమురు రవాణా సాధారణ స్థితికి రానుంది.

అలాచేస్తే.. కఠిన చర్యలు తప్పవు: ఇరాన్

అమెరికాకు ఇరాన్ గట్టి హెచ్చరికలు చేసింది. డీల్‌కు సంబంధించిన చర్చల నేపథ్యంలో అమెరికా దాని భాగస్వాములు దురుద్దేశంతో వ్యవహరించినా.. ఒప్పందాన్ని ఉల్లంఘించినా, మితిమీరిన డిమాండ్లు చేసినా తమ స్పందన తీవ్రంగా ఉంటుందని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ ఘాలిబఫ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. యుద్ధంలో ఇప్పటికే గట్టి దెబ్బ తిన్నారు... మళ్లీ అదే దారిలో నడిస్తే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందన్నారు.



# ధాన్యం నిల్వ వ్యవస్థ ఆధునీకరణకు ప్రణాళికలు

చేస్తున్నామని చెప్పారు. సైలోలు ప్రస్తుతం అమలులో ఉన్న ధాన్యం కొనుగోలు, నిల్వ వ్యవస్థలకు ప్రత్యామ్నాయం కాదని, వాటికి అనుబంధంగా పనిచేసే ఆధునిక మౌలిక వసతులుగా ఉపయోగప డతాయని స్పష్టం చేశారు.'తెలంగాణలో రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లలో స్వయం సహాయక సంఘాలు, ఇకేపీ కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. భవిష్యత్తులో కూడా వారి పాత్ర కొనసాగుతుంది. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రస్తుత కొనుగోలు వ్యవస్థను కొనసాగిస్తూనే ఆధునిక సాంకేతికతను అనుసంధానం చేస్తాం' అని మంత్రి తెలిపారు. పంట కోతల అనంతరం నిల్వ నష్టాలను తగ్గించడం, ధాన్యం నాణ్యతను పరిరక్షించడం, రవాణా వ్యవస్థను వేగవంతం చేయడం, సరఫరా గొలుసును మరింత సమర్థవంతంగా మార్చడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఆయన చెప్పారు. సమావేశంలో పాల్గొన్న సాంకేతిక నిపుణులు ఆధునిక సైలోల ద్వారా ధాన్యం స్వీకరణ నుంచి నిల్వ, రవాణా వరకు మొత్తం పక్రియను ఆటోమేటెడ్ పద్ధతిలో నిర్వహించవచ్చని వివరించారు. డిజిటల్ నాణ్యత పరీక్షలు, యాంత్రిక అన్‌లోడింగ్, సెన్సార్ ఆధారిత పర్యవేక్షణ, శాస్త్రీయ నిల్వ విధానాల ద్వారా ధాన్య నాణ్యతను దీర్ఘకాలం కాపాడవచ్చని తెలిపారు. ÷కొనుగోలు కేంద్రాలు, నిల్వ కేంద్రాల వద్ద ఎదురవుతున్న కార్మికుల కొరత, రవాణా ఆలస్యం వంటి సమస్యలకు కూడా ఈ వ్యవస్థ సమర్థవంతమైన పరిష్కారం చూపగలదని మంత్రి అభిప్రాయపడ్డారు. ల్గ÷ల్వే అనుసంధానంతో కూడిన ఆధునిక లాజిస్టిక్స్ వ్యవస్థ ద్వారా ధాన్యాన్ని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు, దేశవ్యాప్తంగా వినియోగ కేంద్రాలకు వేగంగా తరలించే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రధాన వరి ఉత్పత్తి జిల్లాల్లో సైలోల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలు, నిల్వ సామర్థ్యాలు, పెట్టుబడి వ్యయం, అమలు విధానాలపై సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని మంత్రి సంబంధిత సంస్థలను ఆదేశించారు.'ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా, పంపిణీ వ్యవస్థలను మరింత బలోపేతం చేసి రైతులకు, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యంగా సాంకేతికతను వినియోగిస్తూ వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతామన్నారు

## రాష్ట్రంలో దశల వారీగా భూముల రీసర్వే

పట్టణీకరణ విస్తరించడం, పరిపాలనా సరిహద్దులు మారడం వల్ల అనేక ప్రాంతాల్లో భూముల అసలు హద్దులపై స్పష్టత లేకుండా పోయిందన్నారు. ఈ పరిస్థితులకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం సమగ్ర రీ-సర్వే చేపడుతోందని తెలిపారు. భూ వివాదాల పరిష్కారంలో భాగంగా రాష్ట్రంలో నిజాం కాలం నుంచి నక్షాలు లేని 378 గ్రామాలను గుర్తించామని, వాటిలో ఇప్పటికే 5 గ్రామాల్లో రీ-సర్వే పూర్తి చేసి భూదార్ నంబర్లు కేటాయించినట్లు తెలిపారు. మిగిలిన 373 గ్రామాల్లో కూడా రోవర్స్ వంటి ఆధునిక సాంకేతికతతో సర్వే పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. గొలుసులు, కర్రలు, క్రాస్ స్టాఫ్, మెజరింగ్ టేప్ వంటి పాత సర్వే పరికరాలకు పూర్తిగా స్వస్తి చెబుతున్నామని మంత్రి తెలిపారు. డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్, క్యూజీఐఎస్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ శాస్త్రీయ పద్ధతిలో భూముల సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే 411 రోవర్స్ కొనుగోలు చేయగా, త్వరలో మరో 400 రోవర్స్ కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు. భూముల రీ-సర్వే పూర్తయిన తర్వాత ప్రతి భూకమతానికి ఖచ్చితమైన హద్దులను నిర్ణయించి, ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించనున్నట్లు మంత్రి తెలిపారు. ఆధార్ తరహాలో ప్రతి భూమికి ప్రత్యేక గుర్తింపుగా భూదార్ కార్డులు జారీ చేస్తామని చెప్పారు. డీజీపీఎస్ ద్వారా సేకరించిన సమాచారాన్ని క్యూజీఐఎస్ సాఫ్ట్‌వేర్‌లో నిక్షిప్తం చేసి భూ భారతి పోర్టల్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు.తెలంగాణ ప్రాంతంలో 1948 నాటికి సుమారు 40 లక్షల సర్వే నంబర్లు ఉండగా, ప్రస్తుతం అవి 2 కోట్ల 29 లక్షలకు పెరిగాయని రాష్ట్రంలోని అన్ని సర్వే నంబర్లకు దశలవారీగా భూదార్ నంబర్లు కేటాయించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ రూపొందించిందన్నారు. రీ-సర్వే కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన మానవ వనరులను ప్రభుత్వం సమకూర్చిందని, 5,520 మంది లైసెన్స్డ్ సర్వేయర్లకు శిక్షణ ఇచ్చి లైసెన్సులు జారీ చేశామని, భూవిస్తీర్ణాన్ని బట్టి ప్రతి మండలానికి 4 నుంచి 6 మంది సర్వేయర్లను నియమించామని చెప్పారు. రాష్ట్రంలోని రెవెన్యూ గ్రామాలను క్లస్టర్లుగా విభజించి ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. భూముల రీ-సర్వే పూర్తయిన తర్వాత ప్రతి కమతానికి ఖచ్చితమైన సరిహద్దులు, ప్రత్యేక పటాలు సిద్ధమవుతాయని, తద్వారా భూ యాజమాన్యంపై ఎలాంటి వివాదాలకు తావు ఉండదన్నారు. భూ భారతి చట్టం ద్వారా సాగు భూముల రిజిస్ట్రేషన్లకు సర్వే పటం తప్పనిసరి చేసిన నేపథ్యంలో రీ-సర్వే ద్వారా భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ పక్రియలు మరింత పారదర్శకంగా, వేగవంతంగా మారనున్నాయని తెలిపారు.

## స్టార్‌లింక్‌కు పోటీగా శాట్‌కామ్ రంగంలోకి జియో

న్యూఢిల్లీ(జనంసాక్షి):టెలికాం సేవల విభాగంలో అగ్రగామిగా దూసుకుపోతున్న జియో... ఇప్పుడు స్వదేశీ కమ్యూనికేషన్ ఉపగ్రహాల ద్వారా అంతరిక్షం నుంచి కనెక్టివిటీని అందించేందుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు శాట్‌కామ్ రంగంలో తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలని కంపెనీ చూస్తోందని జియో ప్లాట్‌ఫామ్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆకాశ్ అంబానీ తెలిపారు. ప్రస్తుతం శాటిలైట్ కమ్యూనికేషన్స్ విభాగంలో ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్, ఫ్రాన్స్‌కు చెందిన యుటెల్‌శాట్ వంటి విదేశీ కంపెనీల హవా నడుస్తోంది. ఈ విభాగంలో జియో కూడా అడుగుపెట్టబోతోంది."జియో భారతదేశాన్ని భూమిపై అనుసంధానించింది. ఇప్పుడు అంతరిక్షం నుంచి అనుసంధానించాలి. జియో నెట్‌వర్క్ చేరుకోలేని మారుమూల గ్రామాలు, ద్వీపాలు, సరిహద్దు ప్రాంతాలు ఇంకా ఉన్నాయి. వాటిని అనుసంధానం చేయడానికి శాటిలైట్ కనెక్టివిటీ ఉపయోగపడుతుంది. ఇందుకోసం సొంతంగా లో ఎర్త్ ఆర్బిట్ శాటిలైట్ వ్యవస్థను అభివృద్ధి చేయడాన్ని జియో పరిశీలిస్తోంది" అని రిలయన్స్ ఇండస్ట్రీస్ వార్షిక సాధారణ సమావేశంలో ఆకాశ్ అంబానీ వెల్లడించారు.దీర్ఘకాలంలో సొంతంగా శాటిలైట్ వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటూనే.. మరోవైపు సేవల లభ్యతను వేగవంతం చేయడానికి తాము అంతర్జాతీయ సంస్థలతో శాటిలైట్ సామర్థ్యాన్ని లీజుకు తీసుకుంటామని ఆకాశ్ అంబానీ తెలిపారు.

## రాహుల్ జన్మదినం రోజే రైతు డిక్లరేషన్‌కు చెల్లుచీటీ

మీది విశ్వాసం లేని కేబినెట్ అని అభివర్ణించారు. మీది విశ్వాఘాతుక ప్రభుత్వమని రేవంత్ రెడ్డి సర్కారుపై నిప్పులు చెరిగారు. పంట కొనుగోలుపై కాంగ్రెస్ సర్కార్ చేతులెత్తేసిందని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదినం నాడు రైతులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విషం కక్కారని మండిపడ్డారు. శుక్రవారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వరంగల్‌లో రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ ప్రకటించారని గుర్తు చేశారు. ఆయన జన్మదినం రోజే ఆ డిక్లరేషన్‌ను తెలంగాణ సీఎం బొందపెట్టారని హరీశ్ రావు విమర్శించారు. ధాన్యం ఏదైనా కనీస మద్దతు ధరతోపాటు బోనస్ కూడా ఇస్తామని నాడు రాహుల్ గాంధీ వరంగల్ వేదికగా ప్రకటించారని గుర్తు చేశారు. కానీ అందుకు భిన్నంగా కేంద్రం చెప్పిందే కొంటాం.. ఎంత కొనమంటే అంతే కొంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెలిపారు. తన బాధ్యత నుంచి తప్పించుకుంటుందంటూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం కొన్నా కొనకపోయినా.. అన్ని పంటలు కొన్నది కేసీఆర్ ప్రభుత్వమని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తన నిర్ణయం మార్చుకోవాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. కేంద్రం ఎంఎస్‌పి ప్రకటిస్తుంది తప్ప మక్కలూ, జొన్నలు కొనదా? అని అసహనం వ్యక్తం చేశారు. పప్పు దినుసులు, వేరుశనగ 25 శాతం మాత్రమే కేంద్రం కొనుగోలు చేస్తుందన్నారు. అంటే మిగతా పంటను రైతులు బయట అమ్ముకోవాలా? అని ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు. దళారుల దయాదాక్షిణ్యంపై రైతులు ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొందని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. 50 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేంద్రం కొంటుందని.. మిగతా పంటను రైతులు ఏం చేయాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలంటున్న రైతులకు ప్రభుత్వం భరోసా ఇస్తుందా అని అడిగారు. తడి గుడ్డతో రైతుల గొంతును రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోస్తుందన్నారు. రైతులు జీవితాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటం ఆడుతున్నాయన్నారు. ఎకరాకు రెండు బస్తాల యూరియా మాత్రమే.. అదీ నెలకు ఒకటి చొప్పున ఇస్తారట అంటూ ఆయన ఆందోళన చెందారు. రైతులంటే మీకు ఎందుకు ఇంత చిన్నచూపు అని మంత్రులను ఆయన ప్రశ్నించారు. యూరియా ఇచ్చే తెలివి కూడా లేదా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. మిర్చి రైతులు ఎకరాకు ఐదారు యూరియా బస్తాలు వాడుతారని.. మరి మీరు రెండే ఇస్తే మిగతాది ఎట్లా అని ప్రశ్నించారు. కేంద్రం 30 శాతం యూరియా ధరలు పెంచిందని వివరించారు. రెండు బస్తాల ఆలోచన విరమించుకోవాలని ప్రభుత్వానికి ఆయన హితవు పలికారు.

# ఏడు రకాలే సాగు చేయాలన్న ఆంక్షలు సరికాదు

- రైతులకు అండగా ప్రభుత్వం నిలబడాలి
- మాజీమంత్రి నిరంజన్ రెడ్డి



**మహబూబ్‌నగర్, జూన్19 (జనంసాక్షి) :** ఎల్‌నినో ప్రభావంతో రైతులు ఇప్పటికే సాగులో ముందుకు సాగలేక ఇబ్బందులు పడుతుంటే, ప్రభుత్వం కేవలం 7 సన్నరకాల పంటలనే సాగు చేయాలని ఆంక్షలు పెట్టడం సరికాదని మాజీమంత్రి నిరంజన్ రెడ్డి హితవు పలికారు. దిగుబడి లేని పంటలను సాగు చేయాలంటే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిపారు. ప్రభుత్వం సూచించే ఆ ఏడు రకాల పంటలకు చీడపురుగుల సమస్య కూడా అధికంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం నాడిక్కడ మాట్లాడుతూ గతంలో 33 సన్న రకాలను గుర్తించిన రేవంత్‌రెడ్డి సర్కార్.. ఇప్పుడు ఏడింటికే కుదించడం ఏమిటని ప్రశ్నించారు. రైతులు ఏ రకమైన పంట సాగుచేసినా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందనే నమ్మకాన్ని, భరోసాను రైతులకు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ఖరీఫ్‌లోనైనా రైతు భరోసా రూ.15,000 చొప్పున వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు. ధాన్యం బోనస్ ఇవ్వడాన్ని ఈ ప్రభుత్వం పూర్తిగా మర్చిపోయిందని విమర్శించారు. రైతు బీమా ఏమైందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చనిపోయిన రైతుల కుటుంబ సభ్యులు చెప్పులరిగేలా తిరుగుతున్నా పట్టించుకునేనాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. 'యూరియా సామా న్యులకు ఏమి అర్థమవుతుందని పేర్కొన్నారు. ఈసారైనా రైతులు యూరియా కోసం పడికాపులు కాయకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. గతంలో వరి ధాన్యం కొనుగోలు చేయకపోతే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇంటి ముందు ధాన్యం పోసి ధర్నా చేస్తానన్న రేవంత్.. ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోలుపై రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పెద్ద ప్రకటనలు గుప్పిస్తున్నదే తప్ప క్షేత్రస్థాయిలో రైతులకు దకిందేమీ లేదని తెలిపారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను రైతులు అడ్డికి పావుసేరు చొప్పున అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం సేకరణ బాధ్యతల నుంచి తప్పించుకొనేందుకే కుంటిసాకులు వెతుకుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

## రాష్ట్ర ముస్లిం రచయితల సంఘం ప్రధానకార్యదర్శిగా కల్లూరు ఉమర్ ఫారూఖ్ ఖాన్



**హిందూపురం (జనంసాక్షి) :** హిందూపురం రాష్ట్ర ముస్లిం రచయితల సంఘం కార్యవర్గ సమావేశంలో కల్లూరు ఉమర్ ఫారూఖ్ ఖాన్ ను హిందూపురం ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. ముస్లిం రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు ప్రముఖ కవి కరీముల్లా అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధ్యక్షులుగా గుంటూరుకు చెందిన అబ్దుల్ హకీం, ప్రధాన కార్యదర్శిగా నంద్యాలకు చెందిన అబ్దుల్ సమద్, ఉపాధ్యక్షులుగా మండపేటకు చెందిన ముహమ్మద్ షరీఫ్, సహాయం కార్యదర్శిగా ఈవేమనా రఫీ, కోశాధికారిగా బషీర్ అహ మ్మద్, మహిళా కార్యదర్శులుగా బషీరున్నిసా బేగం, ఖుర్షీద్ బేగం, నసీమా బేగం, కార్యదర్శులుగా యస్. యం. సుభాని, తదితరులు ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు ప్రధాన కార్యదర్శి కల్లూరు ఉమర్ ఫారూఖ్ ఖాన్ మాట్లాడుతూ ముస్లిం విద్యాభివృద్ధికి, సామాజిక చైతన్యానికి, మత సామరస్యానికి, పరమత సహనానికి వసుధైక కుటుంబ నిర్మాణానికి లౌకిక విలువల పరిరక్షణకు, తెలుగు భాషాభివృద్ధికి, రాజ్యాంగ విలువలకు కట్టుబడి "ము.ర.సం" పని చేస్తుందని కార్యవర్గం ప్రతిన చేసినట్లు తెలిపారు. ఇప్పటికే పలు జిల్లాల్లో జిల్లా శాఖలు ఉన్నాయని, లేని చోట జిల్లా కన్వీనర్లు, కార్యవర్గ ఎన్నిక నిర్వహించనున్నట్లు కల్లూరు ఉమర్ ఫారూఖ్ ఖాన్ ప్రకటించారు. వివిధ సందర్భాలను బట్టి కవిసమ్మేళనాలు, కవిత్వం, కథ, వ్యాసాలపై శిక్షణ తరగతులు, సెమినార్లు నిర్వహిస్తామని తెలిపారు. త్వరలో రాష్ట్ర మహాసభలు నిర్వ హించనున్నట్లు ప్రకటించారు. అన్ని ప్రగతి శీల, లౌకిక,పీడిత అణగారిన. దళిత, బహుజన సాహితీ శిబిరాలకు తమ సంఘీభావం ఉంటుందని, ము.ర.సం అన్ని రకాల మతోన్మాదాలను, మత ఉగ్రవాదాలను వ్యతిరేకిస్తుందని, దేశ సమైక్యతకు కృషి చేస్తుదని మురసం భవిష్యత్తు కార్యక్రమాలు ప్రకటించారు. త్వరలో జాతీయ అధ్యక్షులు కరీముల్లా, అధ్యక్షులు అబ్దుల్ హాకీం, ప్రధాన కార్యదర్శులు అన్ని జిల్లాలో ప్రర్యటించనున్నట్లు కల్లూరు ఉమర్ ఫారూఖ్ ఖాన్ తెలిపారు.



## ఘనంగా పంచ వరాహి అమ్మ యాగ మహోత్సవం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** పంచ వరాహి అమ్మవారి అనుగ్రహం, లోకక్షేమం, ధర్మ పరిరక్షణ, మహిళా సాధికారత, దేశ సుభిక్షత కోసం ఎన్టీఆర్ స్టేడియం లో నిర్వహించిన పంచ వరాహి అమ్మ యాగ మహోత్సవం 2026 కార్యక్రమానికి రాజ్య సభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ గారితో కలిసి పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ నీలిమా వేముల, వ్యవస్థాపకురాలు, చైర్‌పర్సన్ డైనమిక్ ఎంట్రప్రెన్యూర్స్ ఉమెన్ ఇన్నోవేటర్స్ (డీఈడబ్ల్యూఐ) కలెక్టివ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహోత్సవం జ్యోతిర్వాస్తు విద్యాపీఠం పీఠాధిపతి ఉమా మహేశ్వర పండిత్ దివ్య మార్గదర్శకత్వంలో ఘనంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ యాగ కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ, భారతీయ సనాతన సంస్కృతి, ఆధ్యాత్మిక సంప్రదాయాల పరిరక్షణకు ఇటువంటి యాగాలు, యజ్ఞాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. మహిళల సంక్షేమం, సమాజ శాంతి, పర్యావరణ పరిరక్షణ, ప్రజల ఆయురారోగ్యాలు, దేశాభివృద్ధి కోసం నిర్వహిస్తున్న ఈ మహాయాగం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. అమ్మవారి కృపాకటాక్షాలతో తెలుగు రాష్ట్రాలు సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా సమాజంలో నైతిక విలువలు, ధార్మిక చైతన్యం పెంపొందుతాయని తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులను అభినందించిన ఉప్పల శ్రీనివాస్ గుప్త, సమాజ శ్రేయస్సు కోసం మహిళా శక్తిని ఏకం చేస్తూ ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ కొలేటి దామోదర్ గుప్త, చకులం రమణయ్య, బెల్దే వెంకటేశం,సురేశెట్టు శ్రీనివాస్ ఐవీఎఫ్ మహిళా విభాగ్ అధ్యక్షురాలు లెంకపల్లి మంజుల ఐవీఎఫ్ యూత్ కోశాధికారి నరేష్ గుప్త, రాష్ట్ర కార్యదర్శి వీరేందర్ ఐవీఎఫ్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సంతోష్ కుమార్, ఆధ్యాత్మిక గురువులు, వేద పండితులు, ప్రముఖులు, మహిళా ప్రతినిధులు, భక్తులు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# వాట్సాప్‌లో పాఠశాల విద్యా సేవలు ప్రారంభం

- 18 లక్షల మందికి పైగా విద్యార్థులు, తల్లిదండ్రులకు సమాచారం
- విద్యాశాఖ, మీసేవ నేతృత్వంలో వినూత్న కార్యక్రమం
- డిజిటల్ మస్కట్ గా పాలపిట్టతో సమాచార వ్యాప్తి



**హైదరాబాద్, జూన్19 (జనంసాక్షి) :** డిజిటల్ పాలనలో తెలంగాణ ప్రజాప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. విద్యాశాఖ ద్వారా అన్ని పాఠశాలల సమాచారం ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు, విద్యార్థులకు అందించనున్నారు. మీసేవ సహకారంతో వాట్సాప్ ద్వారా ఇకపై స్కూల్ అప్డేట్స్ నేరుగా వారి ఫోన్ కు చేరనున్నాయి. ఎల్‌బీ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ సేవలను అధికారికంగా ప్రారంభించారు. వినూత్న కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 18 లక్షల మందికి పైగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాఠశాల విద్యకు సంబంధించిన ముఖ్యమైన సమాచారం, సేవలు, ప్రభుత్వ కార్యక్రమాల వివరాలను నేరుగా వాట్సాప్ ద్వారా పొందనున్నారు. విద్యా పురోగతి, పరీక్షల సమాచారం, విద్యా సామగ్రి పంపిణీ, స్కాలర్‌షిప్‌లు, పాఠశాల కార్యక్రమాలు, ఆరోగ్య, సంక్షేమ కార్యక్రమాల వంటి అంశాలపై సకాలంలో సమాచారం అందుబాటులోకి రానుంది. ప్లాట్‌ఫారమ్‌ను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వ సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్ / కమ్యూనికేషన్స్ శాఖకు చెందిన ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ–మీసేవ విభాగం, పాఠశాల విద్యా శాఖతో కలిసి అభివృద్ధి చేసింది. విద్యార్థులు, తల్లిదండ్రులకు పారదర్శకంగా, సులభమైన రీతిలో వేగవంతమైన సేవలను అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ఈ డిజిటల్ సేవలను వినియోగించు కుం టున్నారు. వాట్సాప్ ద్వారా మీసేవ ప్రస్తుతం అందిస్తున్న ప్రధాన సేవలు ఇలా ఉన్నాయి. విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టులు,హాల్ టికెట్ల డౌన్‌లోడ్,మార్కుల మెమోలు,పరీక్షా ఫలితాలు,ఎస్ఎస్‌సీ మెమోలు, బోనెడ్ సర్టిఫికెట్లు,ట్రాన్స్ ఫర్ సర్టిఫికెట్లు,ఎస్ఎస్‌సీ మెమో సవరణల దరఖాస్తులు సేవల వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గి, సమయంతో పాటు వ్యయం ఆదా అవుతోంది. త్వరలో అందుబాటులోకి రానున్న సేవలు తదుపరి దశలో క్రింది సేవలను కూడా వాట్సాప్ వేదికలో అందుబాటులోకి తీసుకురానున్నారు. యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ వివరాలు,విద్యార్థుల హాజరు సమాచారం,ప్రీ–మెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తులు,మధ్యాహ్న భోజన పథకం వివరాలు,ఆరోగ్య, సంక్షేమ కార్యక్రమాలు,క్రీడలు, సహపాఠ్య కార్యక్రమాల సమాచారం, రెసిడెన్షియల్ పాఠశాలల సంక్షేమ కార్యక్రమాల వివరాలు,విద్యార్థులు, తల్లిదండ్రుల అభిప్రాయ సేకరణ ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా రాష్ట్ర పక్షి 'పాలపిట్ట'ను డిజిటల్ మస్కట్‌గా పరిచయం చేశారు. పాలపిట్ట యానిమేషన్ వీడియోల ద్వారా విద్యార్థులు, తల్లిదండ్రులకు ముఖ్యమైన సమాచారం, అవగాహన సందేశాలు, వీడియోలు వాట్సాప్‌లో పంపించబడతాయి. దీనివల్ల ప్రభుత్వ విద్యా సమాచార ప్రసారం మరింత సులభంగా, ఆకర్షణీయంగా, ప్రజలకు చేరువ అవుతుంది. సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, విద్యా రంగంలో సాంకేతికత వినియోగాన్ని మరింత విస్తరించి విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరచడం, తల్లిదండ్రులతో ప్రభుత్వ అనుసంధానాన్ని బలోపేతం చేయడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రజలకు చేరువైన, సమర్థవంతమైన డిజిటల్ సేవల అందింపులో తెలంగాణ మరోసారి దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. వాట్సాప్ ఆధారిత పాఠశాల విద్యా సేవల ప్రారంభం తెలంగాణ డిజిటల్ పరివర్తన ప్రయాణంలో మరో ముఖ్యమైన మైలురాయిగా నిలవనుంది.

## ప్రజాస్వామ్య ఉద్యమాల్లో శాంతి కమిటీల పాత్ర కీలకం

**పీస్ డైలాగ్ కమిటీ, మాజీ మావోయిస్టు నేతల మర్యాద పూర్వక సమావేశం**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రజాస్వామ్య ఉద్యమాల్లో శాంతి కమిటీల పాత్ర కీలకమని వక్తలు అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లోని జస్టిస్ చంద్రకుమార్ కార్యాలయంలో శుక్రవారం శాంతి–చర్చల కమిటీ (పీస్ డైలాగ్ కమిటీ –పీడీసీ), మాజీ మావోయిస్టు అగ్రనేతల మధ్య ఒక ముఖ్యమైన మర్యాదపూర్వక సమావేశం జరిగింది. ఈ భేటీలో మాజీ మావోయిస్టు నేతలు దేవుజీ టీం, మళ్ళా రాజిరెడ్డి ఏ సంగ్రహమ్, సుజాతక్క, జెఎన్ఎమ్ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు. ప్రస్తుత దేశ సామాజిక, రాజకీయ పరిస్థితులు, ప్రజాస్వామ్య ఉద్యమాల ఆవశ్యకతపై సుదీర్ఘంగా చర్చించారు. గతేడాది మార్చి నెలలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కగారు మారణకాండకు వ్యతిరేకంగా, ఇరువైపులా ప్రాణనష్టం జరగకూడదనే ఉద్దేశంతో, కేవలం చర్చల ద్వారానే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని నమ్ముతూ జస్టిస్ చంద్రకుమార్ నేతృత్వంలో ఈ 'పీస్ డైలాగ్ కమిటీ' ఏర్పాటయింది. లెఫ్ట్ పార్టీలు, ఎంఎల్ పార్టీలు, వివిధ ప్రజాస్వామ్య శక్తులు నాటి నుండి శాంతియుత వాతావరణం, కాల్పుల విరమణ కోసం నిరంతరం ఉద్యమించారు. ఈ నేపథ్యంలో జరిగిన సమావేశంలో పలు వర్తమాన అంశాలపై ప్రజాస్వామ్య కోణంలో కీలక చర్చలు జరిగాయి.

దేశంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవడానికి, ప్రజల గొంతుకను వినిపించడానికి భవిష్యత్తులో రాబోయే ప్రజాస్వామ్య ఉద్యమాలలో శాంతి కమిటీల పాత్ర ఎంతో కీలకమని, ఈ కమిటీల పరిధిని మరింత విస్తృతం చేయాలని నిర్ణయించారు. భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు, స్వేచ్ఛకు భంగం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడటమే ప్రజాస్వామ్య శక్తుల ప్రథమ కర్తవ్యమని పునరుద్ఘాటించారు. దేశంలో భిన్నత్వంలో ఏకత్వాన్ని దెబ్బతీసే శక్తులకు వ్యతిరేకంగా, లౌకికవాద విలువలను కాపాడుకుంటూ, అన్ని వర్గాల ప్రజల మధ్య సామరస్యాన్ని పెంపొందించే దిశగా ప్రజాస్వామ్య ప్రోగ్రామ్‌లను రూపొందించాలని చర్చించారు. దేశ ఆర్థిక స్వావలంబనను దెబ్బతీసే కార్పొరేట్ అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ, స్వదేశీ వనరులు, ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేయడం ద్వారానే దేశం నిజమైన ప్రగతి సాధిస్తుందని అభిప్రాయ పడ్డారు. అభివృద్ధి పేరుతో అడవుల నుండి ఆదివాసీలను బలవంతంగా విస్థాపన చేయడాన్ని కమిటీ తీవ్రంగా ఖండించింది. జల్–జంగిల్–జమీన్ పై ఆదివాసీలకు ఉన్న హక్కులను కాపాడాలని, వారి సంస్కృతిని, ఉనికిని రక్షించడానికి ప్రత్యేక కార్యాచరణ అవసరమని సూచించారు. దేశంలో రోజురోజుకూ పెరిగిపోతున్న నిరుద్యోగంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. యువతకు సరైన ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఇది లక్షలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తుతో, వారి కుటుంబాల ఆశలతో ఆడుకోవడమేనని, ఈ విద్యా వ్యవస్థలోని లోపాలను సరిదిద్ది, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో పీస్ డైలాగ్ కమిటీ (పీడీసీ) అధ్యక్షులు జస్టిస్ చంద్ర కుమార్‌తో పాటు సీనియర్ కమ్యూనిస్ట్ నాయకులు కందిమళ్ళ ప్రతాప్ రెడ్డి, ప్రొఫెసర్ అన్వర్, సీనియర్ ఎడిటర్ రహమాన్, అడ్వకేట్ వెంకన్న, ఖాన్, ప్రొఫెసర్ పి.ఎల్.వి. సార్, సోమా రామమూర్తి, జై సింగ్ రాథోడ్, పీడీసీ కో–ఆర్డినేటర్ బండి దుర్గాప్రసాద్ హాజరయ్యారు.

## నీట్ పరీక్షా కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు

**వరంగల్ పోలీస్ కమిషనర్**



**వరంగల్ బ్యూరో, జూన్ 19 (జనం సాక్షి) :** ఆదివారం జరిగే నీట్ పరీక్ష సజావుగా నిర్వహిం చేందుకు పరీక్షా కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు అమలు చేస్తు న్నట్లుగా వరంగల్ పోలీస్ కమిషన్ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు.వరంగల్ పోలీస్ కమిషనర్ పరిధిలో ఈ నెల 21వ తారీకు ఆదివారం జరిగే నీట్ పరీక్ష సంబంధించి పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ ప్రకారం నిషేధాజ్ఞలు అమలు చేయబడతాయని. ఈ ఉత్తర ప్రకారం పరీక్ష జరిగే 500 మీటర్ల పరిధిలో ప్రజలు గుంపులుగా గుమి కూడటం, సభలు సమావేశాలు ర్యాలీలు ధర్నాలు నిషేధించబడ్డాయని, అలాగే పరీక్షా జరిగే పరిసరాలలో పరీక్ష సమయంలో జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని, ఈ ఉత్తర్వులు ఉదయం ఆరు గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుందని. ఎవరైనా ఈ ఉత్తరం అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ హెచ్చరించారు.

## కాలం చెల్లిన పురుగు మందులను విక్రయిస్తున్న డీలర్

**దాడులు చేసి పట్టుకున్న టాస్క్‌ఫోర్స్**



**ఆత్మకూర్, జూన్ 19 (జనం సాక్షి):** కాలం చెల్లిన పురుగుమందులను విక్రయిస్తున్న వెంకట సాయి అగ్రోస్ డీలర్ షాప్ పై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. శుక్రవారం ఆత్మకూరు మండలం గూడెపాడు జాతీయ రహదారిపై ఏర్పాటుచేసిన వెంకట సాయి అగ్రోస్ ఏజెన్సీ షాపుపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు చేసి కాలం చెల్లిన పురుగుమందులు దాదాపు 3 లక్షల విలువ చేసే మందులను స్వాధీనం చేసుకున్నారు. విక్రయిస్తున్న డీలర్పై కేసులు నమోదు చేస్తామని టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు.

## క్యాన్సర్ కేసులను పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలి

- హాస్పిటల్స్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన డిఎంహెచ్ఓ



**హనుమకొండ ప్రతినిధి జూన్ 19 (జనం సాక్షి) :** ప్రభుత్వం క్యాన్సర్‌ను నోటిఫైయబుల్ వ్యాధుల జాబితాలో చేర్చినందున జిల్లాలోని క్లినిక్ లు, దయాగ్నొస్టిక్ సెంటర్ లు మరియు హాస్పిటల్ లు తప్పనిసరిగా తెలంగాణ క్యాన్సర్ పోర్టల్ లో నమోదు చేసుకోవాలని , గుర్తించిన ,చికిత్స అందించిన లేదా తమ వద్దకు వచ్చిన క్యాన్సర్ కేసులను పోర్టల్ లో తప్పనిసరిగా నమోదు చేయాలని హనుమకొండ డిఎంహెచ్వో డాక్టర్ ఎస్ .డి .రాంకుమార్ ఆదేశించారు. శుక్రవారం హనుమకొండలోని రెనోవా బన్ను క్యాన్సర్ హాస్పిటల్, అజర హాస్పిటల్ ,విజయ దయాగ్నొస్టిక్ సెంటర్ మరియు రాడార్ దయాగ్నొస్టిక్ సెంటర్ లను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోర్టల్‌లో వారు నమోదు చేస్తున్న తీరును స్వయంగా పరిశీలించారు. ప్రస్తుతం నాన్ కమ్యూనికేబుల్ వ్యాధులలో క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదవుతుండడం అలాగే మరణాలు ఎక్కువగా నమోదవుతున్నందున వ్యాధి తీవ్రతను, రిస్క్ ఫ్యాక్టర్లను ప్రభావిత ప్రాంతాలను గుర్తించి ఒక సమగ్రమైన ప్రణాళిక రూపొందించడంలో భాగంగా ప్రత్యేకించినఈ పోర్టల్ లో ప్రతి క్లినిక్ ,ఆసుపత్రి నమోదు చేసుకొని తమవద్ద నిర్ధారించబడిన ,చికిత్స అందిస్తున్న, తమ ఓపి కి వచ్చిన అన్ని రకముల క్యాన్సర్ కేసుల పూర్తి వివరాలు పోర్టల్ లో నమోదు చేయాలన్నారు. లేబరేటరీలు, దయాగ్నొస్టిక్ సెంటర్లు నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. రాబోయే వర్షాకాలంలో రాపిడ్ దయాగ్నొస్టిక్ టెస్టింగ్ ద్వారా పాజిటివ్ లను అన్నింటిని డెంగ్యూ గా నిర్ధారించి ప్రజలను ఆందోళనకు గురి చేయవద్దని , డెంగ్యూ ఎలిసా పాజిటివ్ నిర్ధారణ అయిన వారికి డెంగ్యూ ప్రోటోకాల్ ప్రకారం చికిత్స అందించాలన్నారు. ఈ తనిఖీలో అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ టి.మదన్మోహన్రావు, ఎన్సీడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీనివాస్, జిల్లా మాస్ మీడియా అధికారి వి అశోక్ రెడ్డి, డిపిఓ రుక్మొద్దీన్, సంబంధిత ఆసుపత్రుల డాక్టర్లు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం



**హైదరాబాద్, జూన్ 19 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లో జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం అయ్యింది. పార్టీ అధినేత, ఎపి డిప్యూటి సిఎం÷– పవన్ కళ్యాణ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. హైదరాబాద్‌లోని మణికొండ మల్కం చెరువు సమీపంలో నూతనంగా నిర్మించిన జనసేన తెలంగాణ రాష్ట్ర కార్యాలయం శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలతో అధికారికంగా ప్రారంభమైంది. జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ జనసేన జెండాను ఆవిష్కరించి కార్యాలయంలోకి అడుగుపెట్టారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తెలంగాణ తల్లి చిత్రపటానికి నమస్కరించి, రాష్ట్ర నాయకులతో ముచ్చటించారు. రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (ఉఊఓఅ) ఎన్నికల్లో జనసేన పార్టీ బరిలోకి దిగుతుందని పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఒంటరిగానైనా సరే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పోటీ చేస్తామని, క్షేత్రస్థాయిలో పార్టీకి బలం పెంచేందుకు త్వరలోనే తానే స్వయంగా తెలంగాణవ్యాప్తంగా పర్యటిస్తానని ఆయన ప్రకటించారు. ఈ క్రమంలోనే గ్రేటర్ ఎన్నికలను ఒక సవాల్‌గా తీసుకుని క్యాడర్‌ను సమాయత్తం చేసేందుకు ఈ నూతన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా మారిన జనసేన పార్టీ.. తెలంగాణపై తన రాజకీయ దృష్టిని కేంద్రీకరించింది. రాష్ట్రంలో పార్టీ విస్తరణ, సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా సరికొత్త వ్యూహాలతో దూకుడు పెంచింది. హైదరాబాద్‌లో ఇప్పటికే జనసేన పార్టీకి కార్యాలయం ఉన్నప్పటికీ.. తెలంగాణలో పార్టీ ఉనికిని మరింత బలంగా చాటేందుకు ఈ కొత్త ఆఫీస్‌ను అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్రంలో పార్టీ చేరికలను ప్రోత్సహించేందుకు వీలుగా త్వరలోనే ఒక ప్రత్యేక 'జాయినింగ్స్ కమిటీ'ని కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యాలయం కేంద్రంగానే తెలంగాణలో సంస్థాగత నిర్మాణం, కమిటీల ఏర్పాటు, ఇతర రాజకీయ వ్యూహాలపై జనసేన నాయకత్వం దృష్టి సారించనుంది. ఇటీవలి కాలంలో పవన్ కళ్యాణ్ హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ పెట్టడం, ఢిల్లీ వేదికగా జరిగిన 'సేన ప్రస్థానం' కార్యక్రమంలో తెలంగాణ రాజకీయాల గురించి ప్రస్తావించడం, అలాగే హనుమకొండలో తన అభిమాని నిరంజన్‌ను కలవడం వంటి వరుస పరిణామాలు జనసైనికుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ఆంధ్రప్రదేశ్‌లో సాధించిన విజయ ఉత్సాహంతో తెలంగాణలోనూ జనసేనను ఒక బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా నిలబెట్టాలని పవన్ భావిస్తున్నారు. ఈ నూతన కార్యాలయం ప్రారంభోత్సవంతో తెలంగాణ రాజకీయాల్లో జనసేన తన తదుపరి పొలిటికల్ రోడ్ మ్యాప్‌ను ఎలా సిద్ధం చేసుకోబోతోందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# ఇరాన్ చారిత్రాత్మక విజయం

అమెరికా నోట్లో వెలక్కాయలా నిలిచిన ఇరాన్, హర్మూజ్ జలసంధిపై తన వ్యూహాత్మక పట్టును అస్త్రంగా మలచుకుని ప్రపంచ రాజకీయ చదరంగాన్ని తన అనుకూలంగా మార్చుకుంది. దశాబ్దాల ఆర్థిక ముట్టడి నుండి 300 బిలియన్ల డాలర్ల నష్టపరిహారం సాధించడం మాత్రమే కాదు. అంతర్జాతీయ అణు పర్యవేక్షణ సంకెళ్ళనూ తెంచుకోవడం తెహ్రాన్ దౌత్య చదరంగంలో అభూతపూర్వమైన నాలుగు ముందడుగులుగా నిలిచిపోతుంది. హర్మూజ్ జలసంధి అనేది కేవలం నీటి మార్గం మాత్రమే కాదు.. ప్రపంచ చమురు సరఫరాలో 20 శాతం ఈ 33 కిలోమీటర్ల ఇరుకు కూడలి గుండా ప్రవహిస్తుంది. ఈ భౌగోళిక వాస్తవాన్ని తన అతిపెద్ద రాజకీయ పేకముక్కగా మలచుకున్న ఇరాన్, పాశ్చాత్య దేశాల ఆంక్షల వలయంలో చిక్కుకున్నా ఒంగిపోలేదు, విరిగిపోలేదు.

300 బిలియన్ల డాలర్ల నష్టపరిహారం వెనక కేవలం ఆర్థిక న్యాయమే లేదు, దశాబ్దాలుగా గడ్డకట్టిన ఆస్తుల విముక్తి, ఆంక్షల హననానికి బదులుగా అంతర్జాతీయ న్యాయస్థాన తీర్పులను అనుకూలంగా మార్చుకున్న వ్యూహాత్మక చాకచక్యం ఇందులో ఇమిడి ఉన్నాయి. ఏ దేశమైనా సరే ఆంక్షల చట్రాన్ని ఛేదించుకోగలదని, అందుకు కావలసింది సైనిక శక్తి మాత్రమే కాదు, వ్యూహాత్మక సహనం అని తెహ్రాన్ నిరూపించింది.

అణు పర్యవేక్షణ విషయంలో ఐఏఈఏ తనిఖీల నిలిపివేత అమెరికా–ఇజ్రాయెల్ కూటమికి తీవ్రమైన రాజకీయ దెబ్బ. సంవత్సరాల తరబడి "అణ్వాయుధ ముప్పు" అని ప్రచారం చేసిన పాశ్చాత్య మీడియా కథనాలకు ఇరాన్ చిత్తశుద్ధి ప్రశ్నార్థకంగా మారిందా లేదా అనే చర్చ పక్కన పెట్టినా, ఈ నిర్ణయం ఇరాన్ సార్వభౌమత్వ ప్రకటనగా పశ్చిమ ఆసియా దేశాలు చదువుతున్నాయి. ఇది ఇరాన్ ఒంటరి విజయం మాత్రమే కాదు.. రష్యా, చైనాల పూర్తి దౌత్య మద్దతు, గ్లోబల్ సౌత్ దేశాల మౌన అనుమతి ఈ ఒప్పందానికి వెన్నుముక అయ్యాయి. అమెరికా ఆధిపత్య క్రమం బీటలు వారుతున్న సంకేతాలు గత దశాబ్దంగా కనిపిస్తున్నా, ఇరాన్ ఘనత వాటిని బహిరంగంగా లిఖించింది. ఇక్కడ అతి ముఖ్యమైన ప్రశ్న.. ఈ దౌత్య విజయం ఇరాన్ ప్రజలకు వాస్తవంగా ఏమి తీసుకువస్తుంది? 300 బిలియన్ డాలర్ల ఆర్థిక పునర్నిర్మాణానికి వినియోగిస్తే, పెట్రోడాలర్ ఆదాయం ప్రజారోగ్యం, విద్య, మౌలిక సదుపాయాలకు చేరితే.. ఇది చరిత్రలో నిలిచే విజయం. లేకుంటే, కేవలం రాజకీయ నాయకుల తిరుగులేని హోదా మాత్రమే మిగులుతుంది. పశ్చిమ ఆసియా భూపటం మళ్ళీ రాయబడుతోంది. హర్మూజ్ నీళ్ళు ఇప్పుడు కొత్త అధికార సమీకరణాల కథ చెబుతున్నాయి.

సంపాదకీయం

## నవనావ



సులభ తరం
కాదు జీవితం
సరళ తరం
చేసుకోవాలి
జీవితం...
కనుమరుగు
చేయడం వల్లా
మౌనముద్ర
దాల్చడం వల్లా
శూన్య ఫలితం
ఎదురొడ్డి
నిల్చోవడం వల్లా
అవాంతరాలను
ఛేదించడం వల్లా
మరో చైతన్యాన్ని
ఆహ్వానించడం వల్లా
శ్రమ ఫలితం...
కొత్త లోకం కోసం
చేరే తీరం కోసం
చేసుకునాలి
నవనావను సిద్ధం

**రేడియమ్.**
**9291527757**

# శివాజీ సాహస దాడులు – ఆధునిక సర్జికల్ స్ట్రైక్

### భారత సైనిక చరిత్రలో శివాజీ వ్యూహాల ప్రాసంగికత

భారతదేశ చరిత్రలో అనేక మంది రాజులు, యోధులు, సామ్రాజ్య నిర్మాణకర్తలు ఉన్నప్పటికీ, యుద్ధ వ్యూహాలను పూర్తిగా కొత్త దిశలో మలిచిన నాయకులలో ఛత్రపతి శివాజీ మహారాజ్ పేరు అగ్రస్థానంలో నిలుస్తుంది. ఆయన కేవలం ఒక రాజు కాదు; ఒక వ్యూహకర్త, దూరదృష్టి కలిగిన పరిపాలకుడు, ప్రజల విశ్వాసాన్ని బలంగా నమ్మిన నాయకుడు. శత్రువుతో పోరాడే విధానాన్ని పూర్తిగా మార్చి, పరిమిత వనరులతో కూడా మహాసామ్రాజ్యాలను సవాలు చేయవచ్చని నిరూపించిన మహానుభావుడు.

ఇటీవలి దశాబ్దాల్లో "సర్జికల్ స్ట్రైక్" అనే పదం భారతీయులలో విస్తృత చర్చకు దారితీసింది. నిర్దిష్ట లక్ష్యాన్ని మాత్రమే ఛేదించే సైనిక చర్యగా దీనిని నిర్వచిస్తారు. అయితే ఈ భావన పూర్తిగా ఆధునికమా? లేక చరిత్రలో కూడా ఇలాంటి లక్ష్యిత దాడుల ఉదాహరణలు ఉన్నాయా? అనే ప్రశ్నకు సమాధానం వెతికితే శివాజీ మహారాజ్ కార్యాచరణ మన ముందుకొస్తుంది.

### స్వరాజ్య భావనకు జన్మనిచ్చిన నాయకుడు

17వ శతాబ్దంలో భారతదేశ రాజకీయ పరిస్థితులు అత్యంత సంక్లిష్టంగా ఉండేవి. ఉత్తర భారతదేశంలో మొఘల్ సామ్రాజ్యం విస్తరిస్తుండగా, దక్కన్ ప్రాంతంలో ఆదిల్‌షాహీలు, కుతుబ్‌షాహీలు ఆధిపత్యం చెలాయించేవారు. ఇలాంటి సమయంలో ఒక చిన్న జాగీర్ నుంచి ప్రారంభమైన శివాజీ ఉద్యమం క్రమంగా స్వరాజ్య సిద్ధాంతంగా రూపుదిద్దుకుంది. జిజాబాయి బోధించిన దేశభక్తి, ధర్మరక్షణ, ప్రజా సంక్షేమ భావనలు శివాజీ వ్యక్తిత్వానికి మూలస్తంభాలయ్యాయి. దాదాజీ కొండదేవ్ అందించిన శిక్షణ, సహ్యాద్రి పర్వతాల భౌగోళిక అవగాహన, స్థానిక ప్రజల సహకారం కలిసి ఆయనను అసాధారణ నాయకుడిగా తీర్చిదిద్దాయి.

### గణిమీ కావా - యుద్ధానికి కొత్త నిర్వచనం

శత్రువు ఎంత బలవంతుడైనా అతని బలహీనతలను లక్ష్యంగా చేసుకోవడమే శివాజీ సైనిక విధానంలో ప్రధాన సూత్రం. ఈ వ్యూహాన్నే "గణిమీ కావా" అని పిలుస్తారు. నేడు దీనిని గెరిల్లా యుద్ధ విధానంగా పేర్కొంటారు. భారీ సైన్యాన్ని ఎదుర్కొనే బదులుగా చిన్న చిన్న దళాలతో ఆకస్మిక దాడులు చేయడం,



భౌగోళిక పరిస్థితులను అనుకూలంగా మలచుకోవడం, శత్రువుకు తేరుకునే అవకాశం ఇవ్వకుండా వెనుదిరగడం ఈ విధానం ప్రత్యేకత. ప్రపంచ సైనిక చరిత్రలో అత్యంత సమర్థవంతమైన అసమాన యుద్ధ విధానాలలో ఇది ఒకటిగా గుర్తింపు పొందింది.

### షైస్తా ఖాన్‌పై దాడి - చరిత్రలో నిలిచిన ఆపరేషన్

1663లో జరిగిన షైస్తా ఖాన్‌పై దాడి శివాజీ జీవితంలో అత్యంత సాహసోపేతమైన ఘట్టం. వేలాది మంది మొఘల్ సైనికుల మధ్యలోకి చొరబడి ప్రధాన సేనాధిపతిపై దాడి చేయడం సాధారణ విషయం కాదు. శత్రు శిబిరంపై ముందస్తు నిఘా, భద్రతా వ్యవస్థల అధ్యయనం, మారువేషాలు, సమయస్ఫూర్తి, వేగవంతమైన కార్యాచరణ – ఇవన్నీ కలిపి ఈ ఆపరేషన్‌ను విజయవంతం చేశాయి. ఆధునిక ప్రత్యేక దళాలు అనుసరించే అనేక సూత్రాలు ఈ ఘటనలో కనిపిస్తాయి.

సూరత్ దాడి – ఆర్థిక యుద్ధ వ్యూహం

యుద్ధం కేవలం ఖడ్గాలతో గెలవబడదు. శత్రువు ఆర్థిక బలాన్ని దెబ్బతీయడం కూడా విజయానికి కీలకం. సూరత్‌పై శివాజీ దాడి దీనికి గొప్ప ఉదాహరణ.

స్వరాజ్య నిర్మాణానికి అవసరమైన వనరులను సమకూర్చడం, మొఘల్ ఆర్థిక వ్యవస్థకు దెబ్బ కొట్టడం ఈ దాడి ప్రధాన లక్ష్యాలు. అయితే సాధారణ ప్రజల ప్రాణాలు, ప్రార్థనా స్థలాలు, మహిళల భద్రత విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని శివాజీ తన సైన్యానికి ఆదేశించినట్లు చారిత్రక ఆధారాలు సూచిస్తున్నాయి.

నిఘా వ్యవస్థ – విజయాల వెనుక అసలు రహస్యం

శివాజీ విజయాలకు కేవలం సాహసం కారణం కాదు. బలమైన గూఢచారి వ్యవస్థ ఆయనకు అసలైన ఆయుధం. శత్రు రాజదర్బార్లు, సైనిక శిబిరాలు, వాణిజ్య కేంద్రాలు, సరిహద్దు ప్రాంతాల నుంచి సమాచారం నిరంతరం అందేది.

ఈ సమాచారాన్ని విశ్లేషించి సరైన సమయంలో దాడి చేయడం ఆయన వ్యూహంలో ప్రధాన భాగం. ఆధునిక సైన్యంలో ఇంటెలిజెన్స్‌కు ఉన్న ప్రాధాన్యతను శివాజీ శతాబ్దాల ముందే ఆచరణలో చూపించారు.

చరిత్రకారుల అభిప్రాయం ఏమిటి?

చరిత్రకారులలో ఎక్కువ మంది ఒక విషయాన్ని స్పష్టంగా చెబుతున్నారు. "సర్జికల్ స్ట్రైక్" అనే పదం ఆధునిక సైనిక పరిభాషకు చెందినది. కాబట్టి శివాజీ నిర్వహించిన దాడులను అచ్చం అదే పేరుతో పిలవడం చారిత్రకంగా సరైనది కాదు.

అయితే లక్ష్యిత దాడి, ఖచ్చితమైన ప్రణాళిక, వేగవంతమైన కార్యాచరణ, పరిమిత సమయంలో ఆపరేషన్ పూర్తి చేయడం వంటి లక్షణాల పరంగా శివాజీ వ్యూహాలు ఆధునిక సర్జికల్ స్ట్రైక్ భావనకు అత్యంత దగ్గరగా ఉన్నాయని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు. శివాజీ మహారాజ్ వారసత్వం కేవలం యుద్ధ విజయాలకే పరిమితం కాదు. స్వరాజ్యం, ప్రజా రక్షణ, పరిపాలనా దూరదృష్టి, వ్యూహాత్మక నాయకత్వం, దేశభక్తి వంటి విలువలకు ఆయన జీవితం ప్రతీకగా నిలిచింది.

చారిత్రక సత్యాన్ని గౌరవిస్తూ చెప్పాలంటే – "శివాజీ ఆధునిక సర్జికల్ స్ట్రైక్‌లకు ప్రేరణనిచ్చే లక్ష్యిత సైనిక వ్యూహాలను విజయవంతంగా అమలు చేశారు" అనేది సమతుల్యమైన చారిత్రక వ్యాఖ్య. ఆయన చరిత్ర భారత సైనిక ఆలోచనలకు, నాయకత్వ అధ్యయనాలకు, జాతీయ స్ఫూర్తికి చిరస్థాయిగా మార్గదర్శకంగా నిలుస్తూనే ఉంటుంది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

## మీనార్ల సోయగం



నాలుగు మినార్ల సుందర సౌధం
ఇండో–ఇస్లామిక్ నిర్మాణ శైలి
భాగ్య నగరానికే తలమానికం!
చరిత్రకు సజీవ సాక్ష్యం,
హైదరాబాద్ నగర జీవనాడి,
అదే మనందరి చార్ మినార్
గ్లోబల్ ఐకాన్ గాఅవతరించిన వేళ
ఒకప్పుడు
నిజాం రాజుల మసీదు?
అరబిక్,పర్షియన్ భాషా అధ్యయనాల మదర్సా!!
ఇప్పుడు అందరి బతుకుల్ని
వెలిగిస్తున్న ఒక అంగడి ?
లాడ్ బజార్ మెరుపుల నడుమ,సందడిగా
మారిన
ఓ సాయంత్రం వేళ!!
మెరుపు మెరుపుల తలుక్కులు
సవ్వడి చేసే గాజుల రవళి
మెహెంది రంగుల్లో మురిసిపోతూ
ఈద్ నాడు అద్దుకున్న అత్తరులా
సాధారణ బతుకు చిత్ర గుభాలింపు
దస్ కా తీన్ అరుపులు
హర్‌ఏక్ మాల్ కేకలు
అగ్గువ అగ్గువ పిలుపులు
గమ్మత్తుగా నడిచే
కొనుగోలుదారుల బేరసారాలు
వెరసి మనిషి బతుకు దెరువు పోరాటం
పాతబస్తీ గల్లీల బతుకు చిత్రం
మనిషి వాసన పులుముకున్నట్టు చార్మినార్...
తేటకళ్ళ సూర్మా రేఖల
అగరు దూపాలు
సాంబ్రాణి పొగల ఉత్తేజం
మంచి ముత్యాల నగలు
సుగంధ ద్రవ్యాల పరిమళం
షేర్వాణీలు, లంగా ఓణీలు,
జరీ వర్క్ పెళ్లి దుస్తులు
బిర్యానీ ఘుమఘుమల
పసందైన విందు
చిన్నా పెద్దా వ్యాపారుల అడ్డా
వెరసి సమస్త పర్యాటకుల
మధురానుభూతి
ఎన్నిసార్లు హైదరాబాద్ వెళ్లినా!!
మినార్ పక్కన తొంగిచూసే నెలవంకను
పొందలేని అనుభూతి
వెల్తి గానేవుంది.

**అనిత కృష్ణ గండమళ్ళ**
**9490876621**




# జనగణన, జీవనోపాధి ఓట్ల రాజకీయాలు

భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా మారిన తర్వాత జనాభా నిర్మాణం, భాషా వైవిధ్యం, మతపరమైన కూర్పు, ఉపాధి నమూనాలు, సామాజిక వర్గాల రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాలు మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. సుమారు 143 కోట్లకు పైగా జనాభా కలిగిన భారతదేశంలో భాష, మతం, కులం, ప్రాంతం, లింగం వంటి గుర్తింపులు కేవలం సామాజిక వాస్తవాలుగానే కాకుండా రాజకీయ శక్తి సమీకరణాలుగా కూడా మారాయి. గత పన్నెండు సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ) పాలన ఈ గుర్తింపుల రాజకీయాలను కొత్త దశకు తీసుకెళ్లిందని విమర్శకులు వాదిస్తుండగా, అనుకూల వర్గాలు దీనిని జాతీయ ఐక్యత, అభివృద్ధి రాజకీయాలుగా చిత్రీకరిస్తున్నాయి.

భారత జనాభాలో సుమారు 79.8 శాతం హిందువులు, 14.2 శాతం ముస్లింలు, 2.3 శాతం క్రైస్తవులు, 1.7 శాతం సిక్కులు, మిగిలిన వారు బౌద్ధులు, జైనులు, ఇతర మతాలకు చెందినవారు. భాషాపరంగా హిందీ మాట్లాడేవారు సుమారు 44 శాతం ఉన్నప్పటికీ, దేశంలో వందలాది భాషలు, వేలాది మాండలికాలు ఉన్నాయి. తెలుగు, తమిళం, బెంగాలీ, మరాఠీ, కన్నడ, మలయాళం, ఒడియా, పంజాబీ వంటి భాషలకు తమ తమ ప్రాంతాల్లో బలమైన సామాజిక, రాజకీయ ఆధారాలు ఉన్నాయి. ఈ వైవిధ్యమే భారత బలమని చెప్పబడుతున్నప్పటికీ, రాజకీయ పార్టీలు తరచుగా దీనిని ఓటు బ్యాంకులుగా మలచే ప్రయత్నం చేశాయి.

2014 తర్వాత బీజేపీ "ఒక దేశం – ఒక గుర్తింపు" అనే భావనను బలంగా ముందుకు తెచ్చింది. జాతీయత, హిందుత్వం, భద్రత, అభివృద్ధి వంటి అంశాలను ప్రధాన రాజకీయ అజెండాగా నిలబెట్టింది. విమర్శకుల అభిప్రాయం ప్రకారం, ఈ ప్రక్రియలో మతపరమైన విభజనలు మరింత స్పష్టమయ్యాయి. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ పౌర రిజిస్టర్ (ఎన్ఆర్సీ), యూనిఫాం సివిల్ కోడ్ చర్చలు, గోవధ నిషేధం, మత మార్పిడి చట్టాలు వంటి అంశాలు ముఖ్యంగా ముస్లిం, క్రైస్తవ మైనారిటీలలో ఆందోళనలను పెంచాయి. మరోవైపు బీజేపీ అనుచరులు వీటిని జాతీయ భద్రత, సామాజిక సంస్కరణల భాగంగా సమర్థించారు.

కుల రాజకీయాల విషయంలో కూడా ఆసక్తికరమైన పరిణామాలు కనిపించాయి. ఒకప్పుడు అగ్రకుల పార్టీగా భావించబడిన బీజేపీ, గత దశాబ్దంలో వెనుకబడిన వర్గాలు (ఓబీసీలు), షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలలో తన ప్రభావాన్ని విస్తరించేందుకు కృషి చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ఓబీసీ వర్గానికి చెందినవారని ప్రచారం చేయడం, అనేక రాష్ట్రాల్లో స్థానిక వెనుకబడిన వర్గాల నాయకత్వాన్ని ప్రోత్సహించడం ద్వారా కొత్త సామాజిక కూటమిని నిర్మించేందుకు ప్రయత్నించింది. అయితే విమర్శకులు మాత్రం కుల గణన (కాస్ట్ సెన్సస్) విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన వైఖరి తీసుకోకపోవడాన్ని ప్రశ్నిస్తున్నారు. జనాభాలో ఎంత శాతం ఉన్నా, వనరులు, ఉద్యోగాలు, విద్యా అవకాశాల పంపిణీపై ఖచ్చితమైన సమాచారం లేకపోవడం సామాజిక న్యాయానికి ఆటంకమని వారు వాదిస్తున్నారు.

ఉపాధి నిర్మాణాన్ని పరిశీలిస్తే, భారత కార్మిక శక్తిలో ఇప్పటికీ సుమారు 42 శాతం మంది వ్యవసాయ రంగంపైనే ఆధారపడి ఉన్నారు. అయితే వ్యవసాయం స్థూల దేశీయోత్పత్తిలో (జీడీపీ) దాదాపు 18 శాతం మాత్రమే వాటా కలిగి ఉంది. ఇది ఆదాయ అసమానతను సూచిస్తుంది. పరిశ్రమల రంగంలో సుమారు 25 శాతం, సేవల రంగంలో 33 శాతం మంది పనిచేస్తున్నారు. యువతలో నిరుద్యోగం, మహిళల తక్కువ శ్రామిక భాగస్వామ్యం, అసంఘటిత రంగంలో అధిక ఉపాధి వంటి సమస్యలు ఇంకా కొనసాగుతున్నాయి. గత పన్నెండు సంవత్సరాల్లో డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, స్టార్టప్‌లు, మౌలిక వసతుల అభివృద్ధి వంటి రంగాల్లో పురోగతి జరిగినప్పటికీ, నాణ్యమైన ఉద్యోగాలు , ఉపాధి సృష్టి ఆశించిన స్థాయిలో జరగలేదని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి.

జెండర్ రాజకీయాలు కూడా ఈ కాలంలో ముఖ్య అంశంగా మారాయి. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం బీజేపీకి రాజకీయంగా ప్రయోజనం చేకూర్చినప్పటికీ, మహిళల ఉపాధి రేటు, వేతన అసమానత, భద్రత వంటి అంశాల్లో ఇంకా అనేక సవాళ్లు ఉన్నాయి. ఎన్నికల సమయంలో మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు, గృహ నిర్మాణ పథకాలు, నగదు బదిలీలు వంటి సంక్షేమ కార్యక్రమాలు ప్రధాన పాత్ర పోషించాయి. ఫలితంగా అనేక రాష్ట్రాల్లో మహిళా ఓటర్ల మద్దతు బీజేపీకి పెరిగింది.

ప్రాంతీయ రాజకీయాల పరంగా చూస్తే, ఉత్తర భారతదేశంలో బీజేపీ ఆధిపత్యం బలపడగా, దక్షిణ భారతదేశంలో భాషా, సాంస్కృతిక గుర్తింపులు ఇంకా బలమైన రాజకీయ శక్తులుగానే ఉన్నాయి. హిందీ భాష ప్రాధాన్యతపై జరిగే చర్చలు, కేంద్ర–రాష్ట్ర సంబంధాలపై వివాదాలు, ఆర్థిక వనరుల పంపిణీపై అసంతృప్తి వంటి అంశాలు ప్రాంతీయ పార్టీలకు అవకాశాలను కల్పిస్తున్నాయి. ముఖ్యంగా దక్షిణ రాష్ట్రాలు తమ ఆర్థిక వాటాకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం లేదని తరచుగా వాదిస్తున్నాయి.

భారత రాజకీయాల అసలు విరోధాభాసం ఏమిటంటే, దేశం అభివృద్ధి, ఉపాధి, విద్య, ఆరోగ్యం వంటి సామాన్య సమస్యలను ఎదుర్కొంటున్నప్పటికీ ఎన్నికల చర్చలు తరచుగా కులం, మతం, ప్రాంతం, విగ్రహారాధన గుర్తింపు చుట్టూ తిరుగుతున్నాయి. బీజేపీ ఈ గుర్తింపులను సమర్థవంతంగా రాజకీయ శక్తిగా మలచి వరుస విజయాలు సాధించినా, దీర్ఘకాలికంగా దేశ భవిష్యత్తు సామాజిక ఐక్యత, సమాన అవకాశాలు, నాణ్యమైన ఉపాధి సృష్టి, మహిళల భాగస్వామ్యం, ప్రాంతీయ సమతుల్యత వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. భారతదేశం యొక్క అసలైన బలం దాని వైవిధ్యంలో ఉంది. ఆ వైవిధ్యాన్ని ఓట్ల గణితంగా కాకుండా సామాజిక సంపదగా చూడగలిగినప్పుడు మాత్రమే ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# బతుకు చెట్టు




"అమెరికా పోత. లండన్ పోత. అని ఇంట్ల ఇట్ల లొల్లి పెడితే ఎట్లరా? మన స్థాయి ఏంటిది తెలువదా? అందరూ అటే పోతున్నరా? ఎక్కడెక్కడి నుంచో వచ్చి ఇక్కడ బతుకుత లేరా? ఉపాయం ఉంటే కష్ట పడితే ఎక్కడైనా బతకవచ్చు."

తల్లి లక్ష్మమ్మ కొంత వేదనగా కొంత కోపంగా అరిచింది. తన కొడుకు కూడా అమెరికాకు పోవాలనే వుంది . కాని ఆర్థిక పరిస్థితి తనకు తెలుసు. వీడి నాన్న పోయినంక తానొక్కతే హోటల్ నడుపు కొస్తున్నది.

'విదేశాల చదువులకు, వీసాలకు, కన్సల్టెన్సీల చుట్టూ తిరగడానికి లక్షల రూపాయల అప్పులు తేవడానికి మనకంత స్తోమత ఉందా? అసలు మన బతుకేంది? ఈ గల్లీల నడిపే చిన్న హోటల్ ఏంది? అయినా ఈ కాలపు పిల్లలకు అంతా గాల్లోనే తేలాలె. రెక్కలొస్తే చాలు పరాయి దేశం ఎగిరిపోవాలె! ఎక్కడెక్కడి నుంచో కట్టుబట్టలతో వలస వచ్చి ఈ నగరంలో బతుకుతలేరా? మన ఊరిలోనే ఉండి, మన మట్టిలోనే మనం కష్టపడి బతకరాదా? అయినా అంతదూరం ఎందుకురా... మన ఇంట్లో కిరాయకున్న శేఖర్‌ని చూడు. అప్పట్లో చేతిలో రూపాయి లేక, కాళ్లకు అరిగిపోయిన పాత స్లిప్పర్లతో హైదరాబాద్ రైల్వే స్టేషన్‌లో దిగిండు. మొదట మన చిన్న హోటల్‌లనే ప్లేట్లు కడిగే పనిల చేరిండు. అప్పుడు ! ఇపుడు చూడు... ఐదు కోట్ల ఆస్తి సంపాదించిండు. మంచి అపార్ట్మెంట్ కట్టుకున్నడు. ఎక్కడికో పోయి అందరికీ దూరంగా ఉండి ఇంతకన్న ఎక్కువ సంపాయిస్తవా?కష్ట పడితే మన ఈ సిటీల సంపాయించ రాదా! '

' నీకు డిగ్రీ ల పిస! ఎంత చదువులు చదివినా నౌకరి లేదు. ఊళ్లె ఉన్న సేట్ల కొడుకులు కార్లలో తిరుగుతుంటే నువ్వింకా ఇట్లా ఖాళీగ తిరుగుతున్నవు. సదువుకున్నా లాభం లేకపాయె. ఇట్లా రోడ్ల వెంట తిరిగితే రేపు పొద్దున నీకు పిల్లనెవడిస్తడు? ఏ పనీ పాటా లేకుండా ఎట్ల బతుకుతవురా? మన క డిస్ ముందే ఎదిగిన శేఖర్‌ని చూసి నేర్చుకోరా!'.

ఇంట్లో కూర్చున్న ప్రకాశానికి వాళ్లమ్మ లక్ష్మమ్మ పెడుతున్న తిట్ల దీవెనలు...

విదేశాల చదువు కోసం జరుగుతున్న గొడవ, గిన్నెల చప్పుడు.. మల్లా అమ్మ క్యాసెట్ వేసింది అని చెవులు మూసుకున్నాడు ప్రకాశ్. విసురుగా బయటకు నడిచాడు. మల్లెక్కడికిరా! అని తల్లి అరుస్తున్నా వినిపించుకోలేదు.

లక్ష్మమ్మకు కొడుకును చూస్తే లోలోపల బాధగానే ఉంది. పెండ్లి చేస్తే ఏదో పని చేసుకొని పతక వచ్చు అని ఆశ. అందని దానికి నిచ్చెనలు వేయకూడదు అనేది ఆమె తత్వం. అది జీవితం నేర్పిన పాఠం. పల్లెటూరు నుండి ఈ సిటీకి బతుక వచ్చినపుడు ఎన్ని కష్టాలు అనుభవించారో అన్ని యాదికున్నయి. ఎక్కడో అందరితో పాటు రేకుల గుడిసె కున్నారు.

" ఇది నీ పెండ్లమేనారా? లేపుక వచ్చినట్టు కనపడుతున్నది " అంటూ చూసే వాళ్ల చెడ్డ చూపులకు విల విల వాడి పోయింది. ఆ గూండాలతో ఏ రాత్రి ఏం ముంచుక వస్తుందో అని భయంతో నిద్ర పట్టేది కాదు. చివరకు ఒక హోటల్ వ్యాపారంలో స్థిర పడ్డాక మనసు కుదుట పడ్డది. తమ లాగ సిటీకి వచ్చి ఆశ్రయం లేక అల్లాడే వాళ్లను ఎందరినో చూసింది. చేతనైన సాయం చేసింది. బుక్కెడు బువ్వ కాస్త నిద్ర పోయే స్థలం ఇస్తే ఎందరో చల్లని తల్లి అని దీవించారు. అట్లా ఆశ్రయం పొందిన వాల్లలో శేఖర్ ఒకడు. లక్ష్మమ్మ కు శేఖర్ ఒక ఆశా కిరణంలా కనిపించాడు. ఫోన్ కలిపి చాలా సేపు మాట్లాడింది లక్ష్మమ్మ .

శేఖర్ ఇపుడు మంచి స్థితి మంతుడు. బిల్డర్ గా మంచి పేరున్నది. శేఖర్

సిటీలో అడుగుపెట్టిన కొత్తలో ఎటు వెల్లాలో తెలియలేదు. ఆకలికి కడుపు నకనకలాడుతోంది. అప్పుడే సికింద్రాబాద్ గల్లీలో లక్ష్మమ్మ నడుపుతున్న ఒక చిన్న హోటల్ కనిపించింది. హోటల్ ముందర నిలబడి ఆశగా లోపలికి చూస్తున్న శేఖర్‌ని చూసి లక్ష్మమ్మే పిలిచింది.

"ఏం బాబు... ఎక్కడి నుంచి వస్తున్నావ్? అన్నం తింటావా?" అని అడిగింది.

"అమ్మ... నా దగ్గర పైసలు లేవు. ఆంధ్ర నుంచి వచ్చాను. ఏదైనా పని ఉంటే ఇవ్వండి అమ్మ. రాత్రి తిని, పడుకోవడానికి చోటు ఇస్తే చాలు" అన్నాడు శేఖర్ దీనంగా.

లక్ష్మమ్మ జాలిపడి హోటల్‌లో ప్లేట్లు కడిగే పని ఇచ్చింది. ప్రతిరోజూ వంద మంది తిన్న ప్లేట్లు కడుగుతున్నప్పుడు శేఖర్ మనసులో ఒకటే కసి రగిలేది. 'నన్ను అవమానించిన ఊరు చూస్తుండాలి... నేను జీవితంలో ఎదగాలి' అనుకునేవాడు. రాత్రి పూట హోటల్ టేబుల్ల మీద పడుకుని నగరపు ఆకాశాన్ని చూస్తూ నిద్రపోయేవాడు.

ఆ తర్వాత ఒక బట్టల దుకాణంలో సేల్స్‌మ్యాన్‌గా చేరాడు. . కస్టమర్లతో ఎలా మాట్లాడాలి, జనాల నమ్మకాన్ని ఎలా గెలవాలి అనేది అక్కడ నేర్చుకున్నాడు. ఎక్కడో ఒకచోట చిన్న జీతం వస్తే చాలనుకోలేదు శేఖర్. అతని కళ్లల్లో ఎదగాలనే జ్వాల ఉంది వై ఏళ్ల క్రితం పుట్టిన ఊరి వాతావరణం, ఆ పల్లెటూరి మనుషుల చూపులు గుర్తొస్తే ఇప్పటికీ శేఖర్ గుండె భారమవుతుంది. తండ్రి చేసిన వ్యవసాయం అప్పుల్లో మునిగిపోయింది. అప్పులిచ్చిన సావుకార్లు ఇంటి ముందర నిలబడి నానా మాటలు అంటుంటే, తల దించుకుని నిలబడటం తప్ప తాను ఏమీ చేయలేకపోయాడు. పేదరికం ఒకవైపు అయితే... గుండెల్లో దాచుకున్న ప్రేమ ఇంకోవైపు వాటంతటవే కరిగిపోసాగాయి.

సర్పంచ్ కూతురు సుజాతను ప్రాణంగా ప్రేమించాడు శేఖర్. అది కులాంతర ప్రేమ. ఒకరోజు రాత్రి ఊరి చివర చింతచెట్టు కింద సుజాత ఏడుస్తూ శేఖర్ చేతులు పట్టుకుంది.

" మా ఇంట్లో కులం పట్టింపులు ఎలా ఉంటాయో నీకు తెలుసు. నాన్న వేరే సంబంధాలు చూస్తున్నాడు. నాకు నువ్వు తప్ప ఎవరూ లేరు. నువ్వు వస్తానంటే నేను ఇప్పుడే ఈ కట్టుబట్టలతో నీతో వచ్చేస్తా. మనం టౌన్‌కి వెళ్లి రిజిస్టర్ మ్యారేజ్ చేసుకుందాం. నన్ను వదిలేయకు శేఖర్..." అంటూ సుజాత భోరున ఏడ్చింది.

శేఖర్ ప్రాక్టికల్‌గా ఆలోచించాడు. అప్పటికే చాలా అవమానాలు ఎదుర్కొన్నాడు.

. గుండెను రాయి చేసుకుని ఆమె వైపు చూశాడు.

" సుజాతా! . నువ్వు సర్పంచ్ బిడ్డవు. నువ్వేమో కట్టుబట్టలతో వస్తా అంటున్నావు. నా కాళ్లకేమో అరిగిపోయిన స్లిప్పర్లు ఉన్నాయి. జేబులో కనీసం బస్సు టికెట్‌కి కూడా రూపాయి లేదు. రేపు పొద్దున నిన్ను ఏడ పెట్టాలి? ఏం తినిపించాలి? సంపాదన లేని మనం ఎట్ల బతకగలం? ఆకలేస్తే ప్రేమ ముద్దలు పెట్టదు కదా సుజాతా! నన్ను క్షమించు. నీకు సుఖపడే హక్కు ఉంది. నాతో వస్తే దరిద్రమే మిగులుతుంది" అన్నాడు నిస్సహాయంగా.

ఆ మాటలకు సుజాత కళ్లల్లో నీళ్లు ఆగలేదు. కానీశేఖర్ ఆలోచనలోని చేదు నిజం ఆమెకు అర్థమైంది.

ఆ రాత్రి వాల్లిద్దరిని అక్కడ ఎవరు చూశారు ఏమో!

మరుసటి రోజే ఊరి సర్పంచ్ మనుషులు శేఖర్‌ని రచ్చబండ దగ్గరకు లాక్కెళ్లారు.

"ఎంత గుండెరా నీకు? రూపాయి లేని దరిద్రుడివి... మా ఇంటి అమ్మాయినే ప్రేమిస్తావా? నీకు, నీకుటుంబానికి ఈ ఊళ్లో ఉండే అర్హత లేదు" అంటూ సర్పంచ్ అందరి ముందే శేఖర్‌ని, అతని తండ్రిని హీనంగా అవమానించి, ముఖం మీద ఉమ్మివేశాడు. ఆ అవమానం భరించలేక, బంధువుల హేళనలు తట్టుకోలేక, చివరకు కట్టుబట్టలతో, చిరిగిన చెప్పులతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో అడుగుపెట్టాడు శేఖర్. అప్పుడు లక్ష్మమ్మ ఆదుకుంది. ఆశ్రయం ఇచ్చింది. తాను ఎదుగుతున్నాడు. సుజాతను ఇపుడు పెళ్లి చేసుకోవచ్చు అనుకున్నాడు. ఆరా తీస్తే

అప్పటికే–సుజాతకు వాళ్ల నాన్న (సర్పంచ్) వేరే ధనవంతుల సంబంధం చూసి బలవంతంగా పెళ్లి చేసేశాడని. తెలిసిఆ రోజు శేఖర్ ఆఫీస్ గదిలో ఒంటరిగా కూర్చుని ఏడ్చాడు. కానీ బతుకు పోరాటంలో ఎక్కువసేపు ఏడవడానికి కూడా సమయం లేదు. డబ్బు సంపాదన పెరిగిన తర్వాత, వయసు పైబడుతుండటంతో పెళ్లి ప్రస్తావన వచ్చింది. అప్పటికే తెలంగాణ జిల్లాల నుండి వలస వచ్చి హైదరాబాద్‌లోనే స్థిరపడిన ఒక పెద్ద కుటుంబానికి చెందిన అమ్మాయి పద్మావతితో శేఖర్ వివాహం జరిగింది. పద్మావతి నగరంలో పెరిగినా శేఖర్ కష్టాన్ని, అతని గతాన్ని గౌరవించింది.



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

# వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు

**సికింద్రాబాద్, జూన్ 19 (జనంసాక్షి) :** ప్రజారోగ్య పరిరక్షణలో ఎంటమాలజీ పాత్ర కీలకమని మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. వర్షాకాలంలో దోమలద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులను అరికట్టడంలో ఎంటమాలజీ సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని ఆయన అన్నారు. వర్షాకాల ఆరోగ్య సవాళ్లను సమర్థ వంతంగా ఎదుర్కొనేందుకు ఎంటమాలజీ, శానిటేషన్ విభాగాల సిబ్బందికి ప్రత్యేక సాంకేతిక శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఉస్మానియా విశ్వవిద్యాలయం లోని ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజారోగ్య పరిరక్షణలో ఎంటమాలజీ,శానిటేషన్ విభాగాలు ముందుండి పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్పొరేషన్ పరిధిలో దోమల నిఘాను మరింత ముమ్మరం చేయడంతో పాటు లార్వా పెరిగే ప్రాంతాలను గుర్తించి పూర్తిగా నిర్మూలించాలని సూచించారు. యాంటీ లార్వల్ ఆపరేషన్లు, ఫాగింగ్ కార్యక్రమాలను



శాస్త్రీయంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ రెడ్యా నాయక్ దోమల జీవన చక్రం, వాటి పెరుగుదలకు అనుకూలమైన పరిస్థితులు, లార్వా అభివృద్ధి దశలు,దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై సిబ్బందికి అవగాహన కల్పించారు. నిల్వ నీటిని తొలగించడం, లార్వా నియంత్రణ చర్యలు చేపట్టడం, వెక్టర్ కంట్రోల్ విధానాలను సమర్థవంతంగా అమలు చేయడం వంటి అంశాలపై వివరించారు. జీహెచ్ఎంసీ మాజీ చీఫ్ ఎంటమాలజిస్ట్ డాక్టర్ ఆర్. రామ్‌బాబు,సీనియర్ ఎంటమాలజిస్ట్ మాధవరెడ్డి దోమల నివారణకు చేపట్టాల్సిన చర్యలు, ఫాగింగ్ నిర్వహణ,సమగ్ర వెక్టర్ మేనేజ్ మెంట్‌పై తమ అనుభవాలను పంచుకున్నారు. వర్షాకాలంలో క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమం ముగింపులో దోమల నియంత్రణ, ప్రజల్లో అవగాహన పెంపు, సమన్వయంతో క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టి వెక్టర్-బోర్న్ వ్యాధులను సమర్థ వంతంగా నివారించేందుకు అధికారులు, సిబ్బంది కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్ర మంలో అదనపు కమిషనర్ రఘు ప్రసాద్, శానిటేషన్ జాయింట్ కమిషనర్లు డీఈలు, ఏఈలు, ఎంటమాలజీ, శానిటేషన్ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు బీమా ప్రీమియం చెల్లించలేని పరిస్థితిలో ప్రభుత్వం

- ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



**వెల్దుర్తి, జూన్ 19 (జనం సాక్షి) :** రైతు బీమా ప్రీమియం చెల్లించలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని రైతులను ప్రభుత్వం మోసం చేస్తుందని ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి మండిపడ్డారు శుక్రవారం వెల్దుర్తి మండలంలోని నెల్లూరులో ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ పిట్టల కాలనీలో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డు స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు అలాగే పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు అనంతరం విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రైతులకు సన్న వడ్లకు ఇస్తానన్నా బోనస్ ఊసే లేదన్నారు కేంద్ర ప్రభుత్వం చెప్పినంత మీరని కొనుగోలు చేస్తాననడం ప్రభుత్వానికి తగదన్నారు వెల్దుర్తి మండల పరిధిలోని ఆయా గ్రామాలకు గ్రూప్ 10 లక్షల చొప్పున మహిళా సమైక్య భవనాలు మంజూరు కావడం జరిగిందన్నారు. ఆయా పాఠశాలల ప్రహరీ గోడల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయని ఆయా గ్రామాల సిసి రోడ్లు మంజూరు కావడం జరిగిందని ఈ నిధులను సర్పంచులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆయా గ్రామాల సర్పంచులు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నీట్ రీ-ఎగ్జామ్ అభ్యర్థులకు టీజీఎస్ఆర్టీసీ ఉచిత ప్రయాణం



**ముషీరాబాద్, జూన్ 19 (జనం సాక్షి) :** ఈ నెల 21న నిర్వహించనున్న నీట్ రీ-ఎగ్జామ్‌కు హాజరయ్యే అభ్యర్థులకు టీజీఎస్ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు సంస్థ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్‌ను చూపించి ఇంటి నుంచి పరీక్షా కేంద్రానికి, తిరిగి ఇంటికి ఉచితంగా ప్రయాణించవచ్చని చెప్పారు. ఏసీ సర్వీసులు మినహా అన్ని ఆర్టీసీ బస్సుల్లో ఈ సదుపాయం అందుబాటులో ఉంటుందని వివరించారు. నీట్ రీ-ఎగ్జామ్‌కు సుమారు 73 వేల మంది అభ్యర్థులు హాజరుకానుండటంతో పరీక్షా కేంద్రాల మార్గాల్లో అదనపు బస్సులను నడిపేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జూన్ 21 తొలి సర్వీసు నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు ఉచిత ప్రయాణ సౌకర్యం అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. ప్రయాణానికి సంబంధించిన ఇబ్బందులు ఎదురైతే 040-2345 0033, 6815 3333 నంబర్లలోని టీజీఎస్ఆర్టీసీ కాల్‌సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులందరికీ నాగిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

## వర్షాకాలంలో కల్వర్టు వద్ద జాగ్రత్తలు పాటించాలి

- చేవెళ్ల ఏసిపి కిషన్ గౌడ్



**చేవెళ్ల, జూన్ 19 (జనంసాక్షి) :** వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని చేవెళ్ల ఏసిపి కిషన్ గౌడ్ తెలిపారు. ఏసీపీ పర్యవేక్షణలో మున్సిపల్ కమిషనర్ యాదగిరి, చేవెళ్ల సొసైటీ చైర్మన్ దేవర వెంకటరెడ్డి, చేవెళ్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ భూపాల్ శ్రీధర్, 8 వార్డు కౌన్సిలర్ దావల్గారి గోపాల్ రెడ్డి లు కల్వర్టును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెరువులు, వాగులు, కాలువలు, కల్వర్టులు, బ్రిడ్జిలను పరిశీలించామని, వర్షాకాలంలో కల్వర్టు, వాగులు, కుంటల వద్ద నీరు అధికంగా ప్రవహించే పరిస్థితులు ఏర్పడవచ్చు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్తయ్య, మాజీ ఉపసర్పంచులు టేకులపల్లి శ్రీనివాస్, విజయ్ కుమార్, మాజీ డైరెక్టర్ యాదయ్య, నాయకులు ఎర్ర గోపాల్ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన పెంపొందించుకోవాలి



**కుల్కచర్ల, జూన్ 19 (జనం సాక్షి) :** భారత ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో కుల్కచర్ల మండలానికి చెందిన బూత్ లెవల్ ఏజెంట్లకు ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియపై శుక్రవారం రైతు వేదిక ఆవరణలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ వాసుచంద్ర, ఎన్నికల అధికారి డిటి అనిల్ బాబు బూత్ లెవల్ ఏజెంట్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకమైందని అన్నారు. ఓటరు జాబితాల పరిశీలన, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు-చేర్పులు, అభ్యంతరాల పరిష్కారం వంటి అంశాల్లో ఎన్నికల కమిషన్ నిబంధనలను పూర్తిగా అవగాహన చేసుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై సమగ్రంగా వివరించి, ఓటరు జాబితాలను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సర్వే వివరాలను ఆన్లైన్లో తప్పిదాలు లేకుండా నమోదు చేయాలి అన్నారు. ప్రతి అర్హత కలిగిన పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా బూత్ లెవల్ ఏజెంట్లు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ సహకరించాలని కోరారు. ఈ అవగాహన సదస్సులో తహసీల్దార్ పురుషోత్తం, ఆర్ఐ రవింద్ర చారి,,ట్రైనర్ లక్నాపురం శ్రీనివాస్,రెవిన్యూ సిబ్బంది,వివిధ రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

# అనుమతి లేని వీఆర్ జూనియర్ కళాశాలను వెంటనే సీజ్ చేయాలి

**అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 19 (జనం సాక్షి) :** అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలో నిర్వహిస్తున్న వీఆర్ జూనియర్ కళాశాల ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా విద్యా సంస్థను నిర్వహిస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతోందని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివకుమార్ తీవ్రంగా విమర్శించారు. కళాశాల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘిస్తూ అక్రమంగా కళాశాలను నడుపుతోందని, దీనిపై సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకుని కళాశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులను తప్పుదారి పట్టిస్తూ లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, స్టేషనరీ సామగ్రిని కళాశాల యాజమాన్యమే విక్రయిస్తూ, బయట కొనుగోలు చేయకుండా ఒత్తిడి తెస్తోందని అన్నారు. ఇది విద్యాశాఖ నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని పేర్కొన్నారు. అనుమతులు లేకుండా విద్యా సంస్థను నిర్వహించడం అత్యంత తీవ్రమైన విషయం అని, దీనివల్ల విద్యార్థుల విద్యా భవిష్యత్తు ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికార యంత్రాంగం ఇప్పటికైనా స్పందించి యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, కళాశాల కార్యకలాపాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ నడుస్తున్న ఈ కళాశాలపై చర్యలు తీసుకునే వరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అలాగే ఈ విషయాన్ని ప్రజా దర్బార్‌లో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి బాధిత విద్యార్థులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని తెలిపారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం ఎస్ఎఫ్ఐ ఎల్లప్పుడూ ముందుంటుందని, అక్రమాలకు పాల్పడే



విద్యాసంస్థలను ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి వంశీ, నాయకులు నరేందర్, హరీష్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

# రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి

- గ్రామాల అభివృద్దే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం
- తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్ కారిడార్లు
- రహదారుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన
- కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి



**మహేశ్వరం, జూన్ 19 (జనంసాక్షి) :** గ్రామీణ ప్రాంత రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.గ్రామాల అభివృద్దే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర బొగ్గు గనుల శాఖమంత్రి కిషన్ రెడ్డి అన్నారు.శుక్రవారం రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలోని లేమూరు, తిమ్మాపూర్, బేగంపేట గ్రామాలలో 100 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో రహదారులకు రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ...తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్ కారిడార్లు గేమ్ చేంజర్ గా మారనున్నాయన్నారు.రంగారెడ్డి జిల్లా గ్రామీణ ప్రాంతాలల్లో రహదారులు, విద్యుత్,సాగునీరు, మౌలిక సదుపాయాలు మెరుగుపడితే గ్రామాల అభివృద్ధి పెరుగుతుందన్నారు.హైదరాబాద్ సమీపంలో ఉన్న మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాలల్లో పట్టణీకరణ వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు.తిమ్మాపూర్ గ్రామం నుంచి అనుసంధానంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో నూతన రోడ్డు నిర్మాణ పనులకు జరుగుతాయన్నారు.అనంతరం రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ... కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామన్నారు.గతంలో కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు అందకపోవడం వల్ల రహదారుల నిర్మాణ పనులు ఆలస్యమయ్యావన్నారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి,చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి,మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్,బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూళ్ల వీరేందర్ గౌడ్,జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్,అందెల శ్రీరాములు యాదవ్,బొక్క నర్సింహ రెడ్డి,పాపయ్య గౌడ్,కొప్పు భాష,పలువురు,బీజేపీ,కాంగ్రెస్ పార్టీ నాయకులు,పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కార్డుల కోసం మధ్య దళారులను నమ్మి మోసపోవద్దు

- జిల్లా లేబర్ ఆఫీసర్ వేణుగోపాల్



**గద్వాల నడిగడ్డ, జూన్ 19 (జనం సాక్షి) :** భవన, ఇతర నిర్మాణ కార్మికులు లేబర్ కార్డుల నమోదు లేదా పునరుద్ధరణ కోసం మధ్య దళారులను ఆశ్రయించి మోసపోవద్దని జిల్లా లేబర్ ఆఫీసర్ వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం గద్వాల మండలంలోని నది అగ్రహారం గ్రామంలో భవన, ఇతర నిర్మాణ కార్మికుల నమోదు, పునరుద్ధరణ, సంక్షేమ పథకాలు, కార్మికుల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, గత 12 నెలల్లో కనీసం 90 రోజులు భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పరిధిలోని 54 రకాల నిర్మాణ వృత్తుల్లో పనిచేస్తున్న కార్మికులు సభ్యత్వం పొందడానికి అర్హులని వివరించారు. నమోదైన కార్మికులకు ప్రసూతి సహాయం, వివాహ సహాయం, విద్యా సహాయం, ప్రమాద/సహజ మరణ పరిహారం, అంత్యక్రియల ఖర్చులు తదితర సంక్షేమ పథకాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు.కార్మికులు ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్, మొబైల్ నంబర్, ఫోటోలు, ఉపాధి ధ్రువీకరణ పత్రంతో సమీప మీ సేవ కేంద్రంలో రూ.110 సేవా రుసుము చెల్లించి రసీదు తీసుకుని, కలెక్టరేట్ గది నెం.23 లోని జిల్లా లేబర్ కార్యాలయంలో నమోదు పూర్తి చేసుకోవాలని సూచించారు. సహజ మరణం, ప్రమాద మరణానికి సంబంధించిన క్లెయిమ్‌ల నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం ట్రైల్ బ్లేజర్ (ఏతీఖఅశ్రీ దీశ్రీఖఓవతీ) ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీకి అప్పగించినట్లు తెలిపారు. ఈ క్లెయిమ్‌లకు సంబంధించిన నామినీలు, అర్హులైన కుటుంబ సభ్యులు అవసరమైన పత్రాలతో జిల్లా లేబర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ట్రైల్ బ్లేజర్ కంపెనీ ప్రతినిధి కార్తీక్ మొబైల్: 7331119174ను సంప్రదించి క్లెయిమ్ దరఖాస్తులను సమర్పించుకోవచ్చని వివరించారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో మోసాలకు పాల్పడుతున్న మధ్యవర్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎలాంటి సందేహాలు లేదా ఫిర్యాదులు ఉన్నా నేరుగా జిల్లా లేబర్ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమంలో గ్రామంలోని నిర్మాణ కార్మికులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## వివిధ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్**



**కొడంగల్, జూన్ 19 (జనం సాక్షి) :** కొడంగల్ మున్సిపల్ పరిధిలోని మూడవ వార్డు పాత కొడంగల్ గ్రామంలో ఉదయం మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్ నాయక్,స్థానిక కౌన్సిలర్ గొల్ల లక్ష్మమ్మ గ్రామస్తులతో కలిసి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామంలో కొనసాగుతున్న అండర్ డ్రైనేజీ పనులు, అంగన్వాడీ భవనం నిర్మాణం, వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు, పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులతో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని పరిశీలించారు. పనుల నాణ్యత, పురోగతిపై కాంట్రాక్టర్లు మరియు సంబంధిత అధికారులతో చైర్మన్ సమీక్ష నిర్వహించారు.ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో గొల్ల బుగ్గప్ప, శివశంకర్ పాత కొడంగల్ గ్రామ వాసులు యువకులు పాల్గొన్నారు.

# యువత ఉపాధి, నైపుణ్యాభివృద్ధిపై కేంద్రం దృష్టి

- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి
- హైదరాబాద్‌లో పీఎం వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన కార్యక్రమం



**ముషీరాబాద్, జూన్ 19 (జనం సాక్షి) :** యువత ఉపాధి, నైపుణ్యాభివృద్ధి పై కేంద్రం దృష్టి సారించిందని, 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనలో యువశక్తి కీలక పాత్ర పోషిస్తుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు హైదరాబాద్ లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో ఉన్న ఆర్టీసీ కళాభవన్ లో నిర్వహించిన 'ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన' కార్యక్రమంలో కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశాభివృద్ధికి శ్రామిక శక్తి, నైపుణ్యం కలిగిన యువతే అసలైన బలమని పేర్కొన్నారు. 2020 నుంచి 2025 మధ్య 18 నుంచి 28 ఏళ్ల వయస్సు గల 3.45 కోట్లకు పైగా యువత ఫార్మల్ వర్క్‌ఫోర్స్‌లో చేరినట్లు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామిక వృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్న కేంద్ర ప్రభుత్వం, రూ.99,446 కోట్ల వ్యయంతో పీఎం- విధిఆర్వై పథకాన్ని అమలు చేస్తోందన్నారు. రెండేళ్లలో 3.5 కోట్లకు పైగా ఉద్యోగాలను ప్రోత్సహించడం ఈ పథకం లక్ష్యమని వివరించారు. ఫస్ట్ టైమ్ ఎంప్లాయిలకు రూ.15,000 వరకు ప్రోత్సాహకాన్ని అందించడంతో పాటు, కొత్త ఉద్యోగాలు కల్పించే సంస్థలకు కూడా కేంద్రం ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు. ముఖ్యంగా తయారీ రంగ సంస్థలకు నాలుగేళ్లపాటు ప్రత్యేక మద్దతు లభిస్తుందని చెప్పారు. తెలంగాణలో ఇప్పటికే 25 వేలకుపైగా సంస్థలు ఈ పథకంలో నమోదు చేసుకోగా, 18 వేలకుపైగా సంస్థలు అదనపు ఉద్యోగాలను కల్పించి ప్రయోజనాలు పొందుతున్నాయని వెల్లడించారు. గత 12 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, ముద్ర యోజన వంటి కార్యక్రమాలు యువత సాధికారతకు దోహదపడ్డాయని పేర్కొన్నారు. దేశంలో 2.2 లక్షలకు పైగా స్టార్టప్‌లు, 120కి పైగా యూనికార్న్‌లు ఏర్పడి 23 లక్షలకు పైగా ఉద్యోగాలు సృష్టించాయని తెలిపారు. ప్రతి కొత్త ఉద్యోగం, ప్రతి కొత్త నైపుణ్యం, ప్రతి కొత్త సంస్థ వికసిత్ భారత్-2047 లక్ష్య సాధనలో కీలక అడుగుగా నిలుస్తుందని పేర్కొంటూ, ఈ పథకంలో భాగస్వాములైన యువత, సంస్థలు, యజమానులకు అభినందనలు తెలిపారు.

# అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి

- నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం
- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వెల్లడి

**గద్వాల నడిగడ్డ, జూన్ 19 (జనం సాక్షి) :** ఈ నెల 21వ తేదీ జరగనున్న నీట్ – 2026 పునః పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో జరిగిన నీట్ పరీక్షలో పేపర్ లీక్ కారణంగా ప్రభుత్వం ఈనెల 21వ తేదీన పరీక్షను తిరిగి నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు జరగనున్న నీట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. పరీక్ష నిర్వహణ కోసం ఒక కో–ఆర్డినేటర్, నలుగురు చీఫ్ సూపరింటెండెంట్లు, నలుగురు డిప్యూటీ చీఫ్ సూపరింటెండెంట్లు, నలుగురు అబ్జర్వర్లు, 80 మంది ఇన్విజిలేటర్లు నియమించినట్లు వెల్లడించారు.అదేవిధంగా ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక్కో తహసీల్దార్‌ను లైజన్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. భద్రతా పరంగా ప్రతి పరీక్షా కేంద్రం



వద్ద ఒక ఎస్సై,ఇద్దరు పురుష కానిస్టేబుళ్లు,ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లను విధుల్లో నియమించినట్లు తెలిపారు.పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థులను ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు మాత్రమే అనుమతిస్తారన్నారు. నిర్ణీత సమయం దాటిన తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్షా కేంద్రం లోనికి వెళ్లేందుకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. హాల్ టికెట్‌తో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఒక పోస్టుకార్డ్ సైజ్ ఫోటో తీసుకురావాలని సూచించారు. ఆధార్ కార్డు,పాన్ కార్డు,డ్రైవింగ్ లైసెన్స్,ఓటర్ ఐడీ, పాస్‌పోర్ట్ వంటి ప్రభుత్వం గుర్తించిన ఏదైనా ఒరిజినల్ గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. దివ్యాంగ అభ్యర్థులు వైకల్యాన్ని ధ్రువీకరించే సర్టిఫికెట్లను తీసుకురావాలన్నారు.పరీక్ష హాల్ లోనికి వెళ్లే ముందు బయోమెట్రిక్ హాజరు, రిజిస్ట్రేషన్, తనిఖీ వంటి ప్రక్రియలు చేపట్టాల్సి ఉన్నందున అభ్యర్థులు ముందస్తుగానే చేరుకోవాలన్నారు. పరీక్ష కేంద్రానికి ఎలక్ట్రానిక్ ఉపకారణాలైన మొబైల్ ఫోన్లు, డిజిటల్ చేతి గడియారాలు, బ్లూటూత్ లు ఆభరణాలు వంటివి అనుమతించబడవని తెలిపారు.నీట్ పరీక్షకు సంబంధించిన ఏదైనా సమాచారం లేదా సందేహాల నివృత్తి కోసం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులు 7702697697,8309470647, 9848897759 నంబర్లను సంప్రదించి అవసరమైన సమాచారాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద సీసీ కెమెరాలను అమర్చడం జరిగిందని,పకడ్బందీ నిఘా నడుమ సజావుగా పరీక్ష జరిగేలా చర్యలు తీసుకున్నామని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



**రామచంద్రాపురం, జూన్ 19 (జనం సాక్షి) :** పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం అందిస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి హామీ ఇచ్చారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి అర్హుడికి చేరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల ప్రతినిధులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు చేపడతామని ఆయన భరోసా ఇచ్చారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం ప్రభుత్వ ప్రాధాన్య అంశమని, వారి కుటుంబాల అభ్యున్నతికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

## జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయం



**కొల్చారం, జూన్ 19 (జనం సాక్షి) :** జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా టి యు డబ్ల్యు జే యూనియన్ పనిచేస్తుందని ఆ సంస్థ జిల్లా అధ్యక్షులు శంకర్ దయాల్ చారి శుక్రవారం అన్నారు. మెదక్ జిల్లా మండల కేంద్రమైన కొల్చారం లో ప్రసిద్ధ జైన ఆలయం వద్ద టి యు డబ్ల్యు జె యూనియన్ లో సభ్యత్వ నమోదు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి శంకర్ దయాల్ చారితోపాటు, టీయూడబ్ల్యూజే నాయకులు తిమ్మన్నగారి శ్రీధర్, సంతోష్ హాజరయ్యారు. అనంతరం జిల్లా అధ్యక్షులు శంకర్ దయాల్ చారి మాట్లాడుతూ టి యు డబ్ల్యు జే పాత్రికేయుల సంక్షేమానికి, అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి విశేషంగా కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు చౌరి నాగభూషణం, రామకృష్ణ గౌడ్, అశోక్ గౌడ్, అందనగరం ఏసు రత్నం,బిక్షపతి నేత, టి .శ్రీధర్ ,రాజు, రమేష్ ,భూపాల్ ,నవీన్, వంశీ ,శ్రీధర్ ,అనిల్ చారి, భూమయ్య, ప్రవీణ్ ,శ్రీశైలం, పురుషోత్తం , నరసింహులు, శ్రీను ,లక్ష్మీనారాయణ, యాదగిరి ,గోపాల్, తదితరులు పాల్గొన్నారు

# భూ సేకరణ ప్రక్రియ వేగవంతం కావాలి

- ప్రత్యేక టీములు సమన్వయంతో పని చేయాలి
- జిల్లా కలెక్టర్ గద్వాల ఎమ్మెల్యే

**గద్వాల నడిగడ్డ, జూన్ 19 (జనం సాక్షి) :** జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి నెట్టెంపాడు, గట్టు ఎత్తిపోతల పథకాలతో పాటు మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో భూసేకరణ ఆలస్యం కావడంపై ప్రభుత్వం సీరియస్ గా ఉందని, భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు రెవిన్యూ, సర్వే, ఇరిగేషన్ శాఖల అధికారులతో కలిపి ఏర్పాటు చేసిన ప్రత్యేక టీములు సమన్వయంతో పని చేయాలన్నారు. గట్టు ఎత్తిపోతల పథకంలో భాగంగా రిజర్వాయర్, సమాంతర కాలువల నిర్మాణానికి ఇంకా అవసరమైన భూసేకరణ వేగవంతం కావాలన్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా వివిధ ప్యాకేజీలలో పెండింగ్‌లో ఉన్న 541 ఎకరాల్లో గత 15 రోజుల్లో 56 ఎకరాలకు ప్రిలిమినరీ డిక్లరేషన్ ఇచ్చినందున మిగిలిన భూసేకరణ కూడా చేపట్టాలన్నారు. మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణను కూడా వేగవంతం చేయాలన్నారు. భూ సేకరణకు సంబంధించి ఎవరైనా రైతుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమైతే సంబంధిత గ్రామాల్లో సభలు నిర్వహించి ప్రాజెక్టుల ఆవశ్యకత, ప్రభుత్వ అవసరాల గురించి వివరించి ఒప్పించాలన్నారు. ఇక నుంచి ప్రతి శుక్రవారం జిల్లాలో ప్రాజెక్టుల భూసేకరణకు సంబంధించి రివ్యూ నిర్వహించడం జరుగుతుందని సంబంధిత అధికారులు భూసేకరణ విషయంలో ఎప్పటికప్పుడు పురోగతిని సాధించి నివేదికలు సమర్పించాలన్నారు. అనంతరం ఆయా మండలాల వారీగా వివిధ గ్రామాల పరిధిలో చేపట్టాల్సిన భూసేకరణ పై సంబంధిత మండలాల అధికారులతో క్షుణ్ణంగా మాట్లాడారు. ఈ



సమావేశంలో భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, ఆర్డీవో శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ ఈఈలు సంజీవ్ ప్రసాద్, శ్రీనివాసులు, ఇతర ఇంజనీర్లు, ఆయా మండలాల తహసిల్దార్ లు, సర్వే అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డ్‌కు స్థలం కేటాయించాలి

- ఎంఆర్ఓ వినతిపత్రం అందజేసిన ప్రజా ప్రతినిధులు



**చౌట్కూర్, జూన్ 19 (జనం సాక్షి) :** మండల కేంద్రంలో డంప్ యార్డ్ స్థల కేటాయింపు ప్రక్రియ వేగవంతం చేయాలని గ్రామ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎంఆర్ఓ కిష్టయ్యను కలసిన గ్రామ ప్రతినిధులు డంప్ యార్డ్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని కేటాయించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.గ్రామంలో రోజురోజుకు చెత్త సమస్య పెరిగిపోతోందని దీనికి శాశ్వత పరిష్కారం చూపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు పేర్కొన్నారు. డంప్ యార్డ్ ఏర్పాటు చేయడం వల్ల గ్రామ పరిశుభ్రత మెరుగుపడటంతో పాటు ప్రజారోగ్యం కూడా మెరుగవుతుందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ అభివృద్ధికి, పారిశుధ్య నిర్వహణకు ఈ స్థల కేటాయింపు అత్యంత కీలకమని ప్రతినిధులు స్పష్టం చేశారు.దీనిపై సానుకూలంగా స్పందించిన ఎంఆర్ఓ కిష్టయ్య సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి, డంప్ యార్డ్ కోసం తగిన స్థలాన్ని కేటాయించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వినతిపత్రం సమర్పించిన వారిలో డీటీ అనుదీప్, సర్పంచ్ రాంరెడ్డి, ఉపసర్పంచ్ రామాగౌడ్, గ్రామ అధ్యక్షుడు వరకల రమేష్, రాజేశ్వర్ గౌడ్, నవీన్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

**సంగారెడ్డి, జూన్ 19 (జనం సాక్షి) :** ఓటరు జాబితాలో ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా సమగ్రంగా, పారదర్శకంగా రూపొందించేందుకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)–2026 ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్‌వోలు), బూత్ లెవల్ ఏజెంట్లకు ఈ నెల 24వ తేదీలోగా శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేయాలని సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం జూన్ 25 నుంచి బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ చేపట్టాలని తెలిపారు. అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రచురించే వరకు ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం అన్ని కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. అలాగే ఎస్ఐఆర్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన



కల్పించేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, షెడ్యూల్‌కు అనుగుణంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రక్రియను విజయవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, అన్ని స్థాయిల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించామని, జిల్లా స్థాయిలో కూడా మరో రెండు రోజుల్లో సమావేశం నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. బూత్ లెవల్ అధికారులకు శిక్షణ పూర్తి చేసి, ఇంటింటి సర్వే సందర్భంగా నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలపై సమగ్ర అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోపు ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

## పేదింటి కల నెరవేరడమే ముఖ్యమంత్రి లక్ష్యం

**మిడ్జిల్, జూన్ 19 (జనం సాక్షి) :** పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని మార్కెట్ కమిటీ చైర్మన్ జ్యోతి అల్వాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కంచనపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులతో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి గృహప్రవేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా జ్యోతి అల్వాల్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పేద ప్రజలకు సొంతింటి కల నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ పేద ప్రజలను విస్మరించిందని. పేద ప్రజలు సొంత ఇంటి నిర్మాణం చేసుకొని జీవించాలని ముఖ్యమంత్రి లక్షమని మనసున్న రైతు బిడ్డ రైతు



బాంధవుడు పేద ప్రజల కష్టాలు తెలిసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని అన్నారు. పేదింటి ప్రజలు అన్ని విధాలు అభివృద్ధి చెందడమే ముఖ్యమంత్రి లక్ష్యమని అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింలు. కొత్తపల్లి మాజీ ఎంపీటీసీ శివప్రసాద్. ఐలు బాలిరెడ్డి ఐలయ్య చెన్నయ్య కృష్ణయ్య నాగరాజు లింగం అశోక్ శేఖర్ గౌడ్ బాలస్వామి గ్రామ ప్రజలు ఉన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- ఎనిమిది మంది అరెస్టు
- రూ.10,587 నగదు, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం

**తూప్రాన్, జూన్ 19 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో అక్రమ జూద కార్యకలాపాలపై పోలీసులు మరోసారి ఉక్కుపాదం మోపారు. తూప్రాన్‌లోని గీతా స్కూల్ వెంచర్ సమీపంలో కొందరు వ్యక్తులు గుంపుగా చేరి జూదం నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం అందడంతో



పోలీసులు శుక్రవారం ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడిలో జూదం ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.10,587 నగదు, 7 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై గంగరాజు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గీతా స్కూల్ వెంచర్ సమీపంలోని ఓ ప్రాంతంలో కొందరు వ్యక్తులు బహిరంగంగా జూదం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ప్రత్యేక బృందం అక్కడికి చేరుకుని దాడి చేపట్టింది. పోలీసులను గమనించిన కొందరు పరారయ్యేందుకు ప్రయత్నించినప్పటికీ, అప్రమత్తమైన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారి వద్ద ఉన్న నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అరెస్టు చేసిన వారిలో మల్లబోయిన గణేష్, ఇటుక్యాల రేవంత్ రెడ్డి, మస్కూరి రాజు, కుమ్మరి మొగిలి, చిరుమాని పరమేశ్, పైనం సాయి కుమార్, మంతూరి రాజశేఖర్, వెంచర్ల రాజు ఉన్నారు. వీరిపై సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో జూదం, క్రికెట్ బెట్టింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్, ఇతర అక్రమ పందేల కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. సమాజాన్ని తప్పుదారి పట్టించే ఇటువంటి చట్టవిరుద్ధ కార్య కలాపాలను ఎట్టి పరి స్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. జిల్లావ్యాప్తంగా ప్రత్యేక నిఘా బృందాలు పనిచేస్తున్నాయని, ఎక్కడైనా జూదం లేదా బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందితే వెంటనే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూదం కారణంగా అనేక కుటుంబాలు ఆర్థికంగా నష్టపోవడంతో పాటు సామాజిక సమస్యలు కూడా తలెత్తుతున్నాయని ఎస్పీ పేర్కొన్నారు. తక్షణ లాభాల కోసం కొందరు ఈ వ్యసనానికి బానిసలై కుటుంబాలను ఇబ్బందుల్లోకి నెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యువత ముఖ్యంగా ఆన్‌లైన్ బెట్టింగ్, క్రికెట్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే ప్రజలు తమ పరిసరాల్లో జూదం, బెట్టింగ్ లేదా ఇతర అనుమానాస్పద కార్యకలాపాలు జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్–100కు సమాచారం అందించాలని కోరారు.

## డెంగ్యూ–వైరల్ వ్యాధుల నివారణపై అవగాహన సదస్సు

**బెజ్జంకి, జూన్ 19 (జనం సాక్షి) :** మండలంలోని కళ్లేపల్లి గ్రామంలో శుక్రవారం సర్పంచ్ బిగుల్ల మోహన్ ఆధ్వర్యంలో డ్రై డే కార్యక్రమాన్ని గ్రామ పాలకవర్గం తో కలిసి నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఇంటి వెనుక భాగాల్లో,పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండే పాత్రలు,వ్యర్థ వస్తువులు,పిచ్చి మొక్కలను తొలగించాలని ప్రజలకు అవగాహన కల్పించారు.అలాగే తాగునీటిని కాచి చల్లార్చి,వడబోసి తాగాలని సూచించారు. నిల్వ ఉంచిన,ఈగలు వాలిన,పాచిపోయిన ఆహార పదార్థాలను తినరాదని ప్రజలకు వివరించారు. డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు వంటి వ్యాధుల నివారణకు పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యమని తెలిపారు. గ్రామ ప్రజలు ఈ కార్యక్రమానికి సహకరించి పరిశుభ్రతను పాటించాలని సర్పంచ్ బిగుల్ల మోహన్ ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శేషి వినీత్,గ్రామ కార్యదర్శి రాకేష్,వార్డు సభ్యులు పబ్బతి విజయ,మంకాల మోహన్,కోరుకొప్పుల పార్వతి,బుర్ర పద్మ,వేదిరే రాజయ్య,వేదిరే సతీష్,అంగన్‌వాడీ టీచర్లు మరియు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



# మాదకద్రవ్యాల మహమ్మారిపై సమాజం సమష్టిగా పోరాడాలి

- జిల్లా ఎస్పీ సునిత రెడ్డి
- నషా ముక్త్ భారత్ అభియాన్” పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ
- యువత శక్తి దేశ భవిష్యత్తు మాదకద్రవ్యాలకు ‘నో’ చెప్పండి
- యువత భవిష్యత్తును కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత

**వనపర్తి బ్యూరో, జూన్ 19 (జనంసాక్షి) :** మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును చీకటిలోకి నెట్టే సామాజిక శాపం. డ్రగ్స్ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి యువతను సరైన మార్గంలో నడిపించాలి. ప్రజల సహకారంతో వనపర్తి జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, అన్నారు. శుక్రవారం తెలంగాణ ప్రభుత్వం, దివ్యాంగులు, వృద్ధులు ,ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ డైరెక్టర్, హైదరాబాద్ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జూన్ 17 నుండి 26 వరకు నషా ముక్త్ సప్తః వారోత్సవాల సందర్భంగా వారం రోజులు అవగాహన కార్యక్రమాలలో భాగంగా అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ “నషా ముక్త్ భారత్ అభియాన్” పోస్టర్ ను జిల్లా ఎస్పీ సునిత రెడ్డి,ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలు వ్యక్తిగత జీవితాలను మాత్రమే కాకుండా కుటుంబాలు, సమాజం మరియు దేశ భవిష్యత్తును కూడా తీవ్రంగా దెబ్బతీస్తాయని అన్నారు. ముఖ్యంగా యువత డ్రగ్స్ బారిన పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు,అన్ని వర్గాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. “నషా ముక్త్ భారత్ అభియాన్” కార్యక్రమం ద్వారా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం, యువతను సరైన మార్గంలో నడిపించడం, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అందరూ భాగస్వాములు కావడం అత్యంత అవసరమని ఎస్పీ పేర్కొన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం




తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ, బాలాజీ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి కె. సుధారాణి ,జిల్లా బాలల పరిరక్షణ అదికాకరి, రాంబాబు, జిల్లా సంక్షేమ సూపరిండెంట్ అరుంధతి, చైల్డ్ ప్రొటెక్షన్ డీసీపీయూ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పార్టీలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

- గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి
- సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే రేవూరి శంకుస్థాపన



**నడికుడ, జూన్ 19 (జనంసాక్షి) :** బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో దోచుకున్న సొమ్ముతో కుట్టుమిషన్ల శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేసి కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్నారని ప్రజలను మభ్య పెట్టడానికే ఈ కుట్టు మిషన్ల తీరలేపుతున్నారని కుట్టు మిషన్ల శిక్షణ శిబిరాలను పరిశీలించడానికి వచ్చి ప్రభుత్వ కార్యాలయాలలో పార్టీ కార్యక్రమాలు సమావేశాలు ఏర్పాటు చేయడం సిగ్గుచేటు అని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారుశుక్రవారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి సుడిగాలి పర్యటన చేశారు నడికుడ మండలంలోని 15 గ్రామాలలో ఎం జివిన్ ఆర్ ఈ జి ఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ధర్మారం నడి కూడ చౌటుపర్తి గ్రామాలలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి శంకుస్థాపన చేశారు. గ్రామాలకు ఎమ్మెల్యే రాకతో డీజే, కోలాటాలు,డప్పు చప్పుళ్ళతో ఎమ్మెల్యేకి ఘనంగా స్వాగతం పలికారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నాయకులు, కాంట్రాక్టర్లను చూసి అభివృద్ధి పనులు చేపట్టారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు.గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన గ్రామాలు నేడు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందనితెలిపారు. గ్రామాలలోని ప్రతి వార్డులోను ప్రజల కనీస అవసరాలు తీర్చడానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించిందని తెలిపారు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ప్రజా ధనాన్ని దోచుకొని పాపలు పోవడానికి కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి కాంట్రాక్టర్ ముసుగులో దోచుకుతున్నాడని తెలిపారు. పార్టీలకు అతీతంగా సీఎంఆర్ఎఫ్, కళ్యాణ లక్ష్మి, ఇందిరమ్మండ్లను పంపిణీ చేస్తున్నమన్నారు. కార్యక్రమంలో 15 గ్రామాల సర్పంచులు ఉప సర్పంచ్లు పాలకవర్గాలు మరియు మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు మండల సమన్వయ కమిటీ సభ్యులు సంబంధిత అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ నిధుల పనుల్లో పురోగతి కనిపించాలి

- సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరాలి
- పార్లమెంట్ సభ్యులు, దిశా కమిటీ చైర్మన్ పోరిక బలరాం నాయక్



**ములుగు ప్రతినిధి, జూన్ 19(జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సకాలంలో అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణతో పనిచేయాలని మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు, దిశా కమిటీ చైర్మన్ పోరిక బలరాం నాయక్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమావేశం పోరిక బలరాం నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రాధాబాయి, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా పోలీసు అధికారి సుధీర్ రామ్నాద్ కేకన్, అటవీ శాఖ జిల్లా అధికారి వికాస్ మీనా, దిశా కమిటీ సభ్యులు పూర్ణచందర్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ పోరిక బలరాం నాయక్ జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని శాఖల వారీగా సమగ్రంగా సమీక్షించి, పనుల అమలులో ఎటువంటి జాప్యం లేకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిలో ఎంఆర్ఐ స్కాన్ ఏర్పాటు కోసం తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. మెడికల్ కళాశాల విద్యార్థులతో గిరిజన ప్రాంతాలలో వైద్య శిక్షణ శిబిరాలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమగ్ర శిక్ష కార్యక్రమం, మధ్యాహ్న భోజన పథకం అమలును మరింత సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. వ్యవసాయ రంగంపై మాట్లాడుతూ యూరియా వినియోగంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని, ఆన్లైన్ విధానం ద్వారానే ఎరువుల కొనుగోలు, అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, బ్లాక్ మార్కెట్పై కఠిన చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. రైతులు సేంద్రీయ వ్యవసాయం వైపు మొగ్గుచూపేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ములుగు, ఏటూరునాగారం ప్రాంతాలలో రింగ్ రోడ్ ఏర్పాటుకు అంచనాలు సిద్ధం చేయాలని, ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన పనుల జాబితాను రూపొందించి ప్రాధాన్యత క్రమంలో అమలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ శాఖల పనితీరుపై దిశా సమావేశంలో సమగ్ర సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, ఆరోగ్య శాఖలో ఓపీ సేవలు, మందుల లభ్యత, వైద్య పరికరాల అందుబాటు, పాఠశాలలు పునఃప్రారంభం నేపథ్యంలో విద్యాశాఖ చేపట్టాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. సమావేశానికి హాజరైన మహిళా కమిషన్ సభ్యులు, దిశా కమిటీ సభ్యులు, అధికారులు, సమన్వయంతో సహకరించారని, జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలును మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లే దిశగా చర్యలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ జిల్లాలో ప్రతి మూడు నెలలకు ఒకసారి దిశా సమావేశం నిర్వహిస్తూ అభివృద్ధి పనులపై క్రమం తప్పకుండా సమీక్ష కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రవికుమార్, ములుగు మున్సిపాలిటీ చైర్పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- పార్టీ కార్యాలయం, ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రజల సంక్షేమం, సామాజిక న్యాయం, పేదల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం భూపాలపల్లి పట్టణంలోని 3వ వార్డులో నూతన కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం, టేకు రాజేశ్వరి రాజబాబుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ, రాష్ట్ర అభివృద్ధిలో కాంగ్రెస్ పార్టీ పోషించిన పాత్రను వివరించారు. పేద కుటుంబాలకు గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. మహిళల సాధికారతకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే చెప్పారు. మహిళల పేర్లపై ఇళ్ల మంజూరు, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గుర్తుంచుకుని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. 3వ వార్డు కమ్యూనిటీ హాల్ మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. నూతన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎర్రవెల్లి జలపతిరావు, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, డీసీసీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్, స్థానిక కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఎదుట సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో భారీ ధర్నా

- ఇండ్ల స్థలాల పంపిణీలో ప్రభుత్వం వైఫల్యంతోనే భూపోరాటాలు
- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
- అర్హులైన పేదలందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్




**హనుమకొండ ప్రతినిధి జూన్ 19 (జనం సాక్షి) :** ఇండ్ల స్థలాల పంపిణీలో ప్రభుత్వ వైఫల్యంతోనే పేదలు భూపోరాటాలు నిర్వహిస్తున్నారని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. అర్హులైన నిరుపేదలందరికీ ఇండ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ హనుమకొండ కలెక్టరేట్ ఎదుట శుక్రవారం సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ ధర్నాకు వామపక్షాల నాయకులు, పెద్ద సంఖ్యలో పేద ప్రజలు, మహిళలు తరలివచ్చారు.ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు హాజరై మాట్లాడుతూ భూపోరాటాల ద్వారా ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు వేసుకుని దశాబ్దాలుగా నివాసముంటున్న, నిరుపేదలైన ప్రజలకు ఇండ్ల స్థలాల పట్టాలు ఇవ్వడంలో ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందని ఆయన మండిపడ్డారు.ఒకవైపు పేదలకు గూడు లేక ఇబ్బంది పడుతుంటే, మరోవైపు విలువైన ప్రభుత్వ భూములు ల్యాండ్ మాఫియా పరం అవుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి హనుమకొండ జిల్లాలోని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇండ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేయాలని, లేనిపక్షంలో వామపక్షాల ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఇళ్లస్థలంతో పాటు పక్కా ఇల్లు నిర్మిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, కానీ ఇంకా రాష్ట్ర ప్రభుత్వం దీనిని అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నదని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి పేద ప్రజలను ఆదుకోవాలని కోరారు. పేదలకు, ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న వారికి ఇండ్ల స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, సిపిఎం జిల్లా నాయకులు ఎం. చుక్కయ్య అధ్యక్షతన జరిగిన ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శులు,కర్రె బిక్షపతి, జి.ప్రభాకర్ రెడ్డి,సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు మంద సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, మండల కార్యదర్శి ఎన్. అశోక్ స్టాలిన్, కార్యవర్గ సభ్యులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, మునిగాల బిక్షపతి, జక్కు రాజు గౌడ్,నేదునూరి రాజమౌళి, వేల్పుల సారంగపాణి, బత్తిని సదానందం,రాసమల్ల దీన, సిపిఎం జిల్లా నాయకులు బొట్ల చక్రపాణి, వీరన్న, మంద సంపత్, గొడుగు వెంకట్ పాల్గొన్నారు.



## ఎంఆర్ఐ యంత్రం ప్రారంభానికి సిద్ధం

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జిల్లా కేంద్రంలోని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేయనున్న ఎం.ఆర్.ఐ యంత్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ శుక్రవారం పరిశీలించారు. యంత్రం ఏర్పాటు పనులు తుదిదశకు చేరుకున్నాయని, ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంఆర్ఐ యంత్రం అందుబాటులోకి రావడం వల్ల జిల్లాలోనే అధునాతన వైద్య సేవలు ప్రజలకు లభిస్తాయని తెలిపారు. ఎంఆర్ఐ చేసిన వ్యక్తుల పేర్లు రిజిస్టర్ లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా రాజేంద్రప్రసాద్, వైద్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రూ.28.15 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరు

- ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



**నిర్మల్ టౌన్ (జనంసాక్షి) :** నియోజక వర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు 28.15 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరు అయినట్లు బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో నూతన సీసీ రోడ్లు డ్రైనేజ్ ల నిర్మాణానికి రూ. 19.15 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయని అన్నారు. అలాగే రూ. 9 కోట్ల తో 30 గ్రామాల్లో అగ్రికల్చర్ గోదాములు మంజూరై నట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని, కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని తెలిపారు.

## భూముల సర్వేకు వేగవంతమైన చర్యలు

- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె. హరిత




**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 19(జనంసాక్షి ):** జిల్లాలో నకలు లేని గిరిజన భూములు, సదా బైనామా దరఖాస్తులు, భూ సంబంధిత పెండింగ్ సమస్యల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ కె. హరిత తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అధికారులు, సర్వేయర్లతో కలిసి భూముల సర్వే పురోగతిపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామాల్లో భూ సమస్యలను గ్రామాల వారీగా గుర్తించి సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వే నిర్వహణలో ఎలాంటి జాప్యం లేకుండా అవసరమైన సిబ్బందిని సమన్వయం చేసుకుని పనులు పూర్తి చేయాలని సూచించారు. సదా బైనామా దరఖాస్తులను నెలాఖరులోగా పరిశీలించి అర్హులైన వారికి త్వరితగతిన పరిష్కారం అందించాలని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చిన భూ సంబంధిత దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.సర్వే ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కలెక్టర్ తెలిపారు. భూ హక్కుల పరిరక్షణతో పాటు ప్రజలకు పారదర్శక సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్, రెవెన్యూ శాఖ అధికారులు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు, మండల సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

## టెండర్లు పూర్తికాకముందే వంద కోట్ల అవినీతి ఆరోపణలు హాస్యాస్పదం

- దక్షిణ కాశీ ప్రతిష్ఠను రాజకీయాలకు బలి చేయడం తగదు
- భక్తుల ఆకాంక్షలకు అనుగుణంగానే ఆలయ పునర్నిర్మాణం చేపడుతున్నాం: ఆలయ పాలకమండలి



**కాళేశ్వరం, జూన్ 19 (జనంసాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణ పనులపై మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ చేసిన వ్యాఖ్యలను ఆలయ పాలక మండలి చైర్మన్ మోహన్ శర్మతో పాటు ధర్మకర్తలు తీవ్రంగా ఖండించారు. రాజకీయ ప్రయోజనాల కోసం దక్షిణ కాశీగా పేరుగాంచిన కాళేశ్వర క్షేత్రాన్ని వివాదాల్లోకి లాగడం బాధ్యతారాహిత్యమని పేర్కొన్నారు.ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించిన టెండర్ ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదని, ఈ నెల 23న టెండర్ల ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. టెండర్లు ఖరారు కాకముందే, పనులు ఎవరికీ కేటాయించకముందే రూ.100 కోట్ల అవినీతి జరిగిందంటూ ఆరోపణలు చేయడం హాస్యాస్పదమని విమర్శించారు. ప్రజల్లో అనుమానాలు, భయాందోళనలు సృష్టించడం తప్ప ఇటువంటి వ్యాఖ్యలకు ఎలాంటి ఆధారాలు లేవన్నారు.రూ. లక్ష కోట్ల వ్యయంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు సమయంలో పుట్ట మధూకర్ ఎమ్మెల్యేగా ఉన్నారని గుర్తు చేసిన వారు, అప్పటి భారీ ప్రాజెక్టు పనుల్లో తనకు ఎన్ని వేల కోట్ల ప్రయోజనాలు వచ్చాయో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఇతరులపై ఆరోపణలు చేయడానికి ముందు తన హయాంలో జరిగిన పనులపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత మాజీ ఎమ్మెల్యేపై ఉందన్నారు.రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని, పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా, ప్రభుత్వం మరియు దేవాదాయ శాఖ మార్గదర్శకాల ప్రకారమే రూ.198 కోట్లతో ఆలయ పునర్నిర్మాణం చేపడుతున్నామని స్పష్టం చేశారు. కాళేశ్వర క్షేత్ర అభివృద్ధిని అడ్డుకునేలా అసత్య ప్రచారాలు చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. దేవాలయాలు రాజకీయాలకు అతీతమైనవని, కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకలని, అలాంటి పవిత్ర క్షేత్రాలపై ఆధారాలు లేని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలను భక్తులు విశ్వసించవద్దని కోరారు.ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్ మోహన్ శర్మతో పాటు ధర్మకర్తలు దొడ్ల అశోక్, కుంభం పద్మ, అడ్డూరి శ్రీధర్ రావు, బీసుల నర్సయ్య, మంచినీళ్ల దుర్గయ్య, గందెసిరి సత్యనా రాయణ, సుంకరి సీతయ్య, జలవంచ సీతారాం, కాటం సత్తయ్య, శ్యామ్ సుందర్, తాటిపెల్లి రాజయ్య, ప్రశాంత్ రెడ్డి మాట్లా డుతూ కాళేశ్వర క్షేత్ర అభివృద్ధి విషయంలో ఎలాంటి అపోహలకు గురికావద్దని, భక్తుల సహకారంతో పునర్నిర్మాణ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని తెలిపారు.

# సేవకు తగిన గుర్తింపు

- స్మైల్ విత్ షైన్ వెల్ఫేర్ సొసైటీకి జాతీయ అవార్డు
- భారతీయ స్ఫూర్తి సేవరత్న నేషనల్ అవార్డు తో సత్కారం



**రామకృష్ణాపూర్, జూన్ 19 (జనంసాక్షి):** సమాజ సేవలో విశేష కృషి చేస్తున్న స్మైల్ విత్ షైన్ వెల్ఫేర్ సొసైటీకి ప్రతిష్టాత్మకమైన భారతీయ స్ఫూర్తి సేవరత్న నేషనల్ అవార్డు లభించింది. గత సంవత్సరం నుంచి నిరంతరంగా పేదలు, నిరుపేదలు, అంగవైకల్యం కలిగిన వ్యక్తులు, పేద విద్యార్థులకు సేవలందిస్తూ వస్తున్న ఈ సంస్థను గుర్తించి స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా ఎన్‌జీవో ఆధ్వర్యంలో ఈ జాతీయ అవార్డును ప్రదానం చేశారు. స్మైల్ విత్ షైన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం నిరుపేదలకు ఆహార పంపిణీ, నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పేద విద్యార్థులకు చదువుకు అవసరమైన స్టేషనరీ సామగ్రిని అందించడంతో పాటు అంగవైకల్యం కలిగిన వారికి దుస్తులు పంపిణీ చేస్తున్నారు. కాలానుగుణంగా ప్రజల అవసరాలను గుర్తించి వివిధ సేవా కార్యక్రమాలను చేపడుతూ పేద ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలను గుర్తించిన స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా ఎన్‌జీవో ప్రతినిధులు సంస్థను జాతీయ స్థాయిలో ఎంపిక చేసి భారతీయ స్ఫూర్తి సేవరత్న నేషనల్ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షురాలు గ్రేసీ మని, ప్రధాన కార్యదర్శి గంగారపు సత్యపాల్ హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డు తమ సంస్థ చేస్తున్న సేవలకు లభించిన గుర్తింపుగా భావిస్తున్నామని, భవిష్యత్తులో కూడా మరింత ఉత్సాహంతో పేదలు, అవసరమైన వారికి సేవలు అందించే కార్యక్రమాలను విస్తృతంగా చేపడతామని వారు తెలిపారు. సమాజంలోని ప్రతి ఒక్కరి సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు మరింత చేరువ కావడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

# పని చేసే అవకాశాన్ని సర్పంచులు సద్వినియోగం చేసుకోవాలి

- అందరం కలిసి నియోజకవర్గంలో అవినీతిని తగ్గిద్దాం
- స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 19 (జనం సాక్షి) :** అందరం కలిసి నియోజకవర్గంలో అవినీతిని తగ్గి ద్దామని, ఎక్కడా రూపాయి అవినీతికి ఆస్కారం ఉండవద్దని, పని చేసే అవకాశాన్ని సర్పంచులు సద్వినియోగం చేసుకోవాలని,ప్రజల అవసరాల ను, సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే ప్రయత్నం చేయాలని అప్పుడే ప్రజలలో గుర్తింపు లభిస్తుందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని ఎస్ కన్వెన్షన్ లో నిర్వహించిన స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలోని 7మండలాలలోని వివిధ గ్రామాలలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబందించి సుమారు13కోట్లవిలువైన ఈజీఎస్, ఎస్ డి ఎఫ్ నిధుల మంజూరు పత్రాలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే కడియం శ్రీహరి శ్రీహరి ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులకు, లబ్ధిదారులకు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ఆయాగ్రామాల అభివృద్ధి పై సర్పంచుల దగ్గరి నుండి ప్రతిపాదనలు తీసుకొని వారికి రూపాయి ఖర్చులేకుండా అభివృద్ధి పనుల కు అనుమతులు తెచ్చి నేనే ఆ పనులకు సంబం దించిన మంజూరు పత్రాలను పంపిణి చేస్తున్నట్లు 13కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు మంజూ రు పత్రాలు పంపిణిచేసుకోవడం చాలా సంతోషం గా ఉందని అన్నారు. సర్పంచ్ లకు ఎలాంటి ఇబ్బందులు, అవినీతికి ఆస్కారం ఉండవద్దని తానే స్వయంగా పనులు మంజూరు చేయించిన ట్లు తెలిపారు. మంజూరు అయిన పనులను ఎక్కడ అవినీతికి అవకాశం ఇవ్వకుండా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రజా ప్రతినిధులుగా మన ప్రజలు నమ్మకం పెట్టు కున్నారని సర్పంచులు బాధ్యతగా, జవాబుదారి తనంగా పని చేయాలని అన్నారు. నా స్థాయిలో నేను ఒక్క లంచం తీసుకోకుండా పని చేస్తున్నాని మీరు అదే స్థాయిలో అంతే నిజాయితీగా పని చేయాలని తెలిపారు. గ్రామాలలో సమస్యలను గుర్తించి ప్రజల అవసరాలను తెలుసుకొని అందు కు అనుగుణంగా పనులు చేయాలని వెల్లడించా రు.ప్రజలతో మర్యాద పూర్వకంగా మాట్లాడాలని, వారి కష్ట సుఖాలలో భాగస్వాములు కావాలని సూచించారు. గ్రామానికి మంజూరైన పనులన్నింటిని పూర్తి చేస్తే ఆ గ్రామానికి అదనంగా మరో 10 లక్షలు మంజూ రు చేస్తానని హామీ ఇచ్చారు. వర్షాకాలం వస్తుంద ని గ్రామాలలో పారిశుధ్యం పనులను పక్కాగా నిర్వహించాలని, అలాగే విద్యుత్, త్రాగు నీరు, వీధి దీపాలువంటి సమస్యలులేకుండా చేసుకోవా లని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథా లయసంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు,మార్కె ట్ కమిటీ చైర్మన్ జూలుకుంట్ల లావణ్య శిరీష్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమా ర్, హన్మకొండ,జనగామ జిల్లాల హౌసింగ్ పిడిలు, ఎంపిడివోలు,ఇతర అధికారులు,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు జూలుకుంట్ల శిరీష్ రెడ్డి, గడ్డమీది సురేష్, కోళ్ల రవి,నాయకులు బెలిదె వెంకన్న, శివ కుమార్, ఐలయ్య,బూర్ల శంకర్, లింగాల జగదీష్ చందర్ రెడ్డి, గుడి వంశీధర్ రెడ్డి, గుర్రం ప్రసాద్, పురమాని రజాక్,గట్టు రమేష్, కొలిపాక సతీష్, సింగపురం వెంకటయ్య, చింత ఎల్లయ్య, జిల్లా నియోజకవర్గ స్థాయి నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, కౌన్సిలర్లు, ఇతర ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు, నాయకులు, కార్యకర్త లు తదితరులు పాల్గొన్నారు.

## ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిసిన వందనం గ్రామ సర్పంచ్ ఆవుల నాగేశ్వరావు



**చింతకాని, జూన్ 19 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ మరియు ప్రణాళిక శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్కను వందనం గ్రామ సర్పంచ్ ఆవుల నాగేశ్వరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యలు, సంక్షేమ కార్యక్రమాల అమలు, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై ఉప ముఖ్యమంత్రితో సర్పంచ్ నాగేశ్వరావు విస్తృతంగా చర్చించారు. గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, తాగునీటి సదుపాయం, రహదారుల అభివృద్ధి, విద్యుత్ సౌకర్యాలు, ఇతర ప్రజా అవసరాలకు సంబంధించిన అంశాలను ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాభివృద్ధికి ప్రభుత్వం నుంచి మరింత సహకారం అందించాలని సర్పంచ్ నాగేశ్వరావు కోరగా, రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం మరియు గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాల అమలుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ఆయన హామీ ఇచ్చినట్లు సమాచారం. అనంతరం సర్పంచ్ ఆవుల నాగేశ్వరావు మాట్లాడుతూ, గ్రామ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఉప ముఖ్యమంత్రిని కలవడం ద్వారా గ్రామ సమస్యల పరిష్కారానికి మరింత తోడ్పాటు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ భేటీ సందర్భంగా గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై సానుకూల చర్చ జరిగినట్లు తెలిసింది. స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు ఈ భేటీని స్వాగతిస్తూ, గ్రామ అభివృద్ధికి ఇది మరింత దోహదపడుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

# డాక్టర్లు నిరంతరం పేషేంట్లకు అందుబాటులో ఉండాలి

- **రోగులకు మెరుగైన వైద్యం అందించాలి**
- **వేగవంతంగా నూతన భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలి**
- **జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

సూర్యాపేట ప్రతినిధి, జూన్ 19 (జనంసాక్షి) : డాక్టర్లు నిరంతరం అందుబాటులో ఉండి హాస్పిటల్ కు వచ్చే రోగులకు మెరుగైన చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ వార్డులు, ఇన్ పేషెంట్, అవుట్ పేషెంట్ విభాగాలను ఆయన స్వయంగా పరిశీలించారు. వార్డుల్లోని రోగులతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్, ఆర్ఎమ్ఓ, వివిధ విభాగాల హెచ్ఓడిలతో సమావేశమై, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ప్రత్యేకంగా చర్చించారు. జనవరి నెల నుండి మే నెల వరకు ఆసుపత్రికి దాదాపు 112000 కంటే ఎక్కువ మంది అవుట్ పేషెంట్లకు, అలాగే 25000కు పైగా ఇన్ పేషెంట్లకు వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ప్రోగ్రాం కింద



ఆసుపత్రిలో మోకాలి మార్పిడి, ఇతర ఆర్థోపెడిక్ శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రేడియాలజీ, గైనకాలజీ విభాగాల సేవలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, ముఖ్యంగా ఇక్కడి మాతా శిశు కేంద్రంలో గైనకాలజీ విభాగం ఆధ్వర్యంలో ప్రసవాల సంఖ్య పెరిగినట్లు వెల్లడించారు. ఆసుపత్రికి వచ్చే రోగులందరికీ ఉచితంగా నాణ్యమైన వైద్యంతో పాటు, మందులను కూడా అందిస్తున్నామని స్పష్టం చేశారు.

**క్యాన్సర్ రోగులకు అండగా పెలియేటివ్ కేర్, కీమోథెరపీ..**

క్యాన్సర్ బాధితుల కోసం ఆసుపత్రిలో ప్రత్యేకంగా యూనిట్‌ను ఏర్పాటు చేసి, వారికి కీమోథెరపీతో పాటు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం దాదాపు 58 మంది క్యాన్సర్ రోగులు ఈ సేవల ద్వారా లబ్ధి పొందుతున్నారని వివరించారు.

**త్వరలోనే నూతన భవనాలు అందుబాటులోకి..**

ఆసుపత్రి ఆధునీకరణలో భాగంగా నూతనంగా నిర్మించిన మాతా శిశు సంరక్షణ బ్లాక్ భవన నిర్మాణం పూర్తయిందని, దానికి సంబంధించిన మిగిలిన ఎక్విప్‌మెంట్, ఇతర పనులను త్వరలోనే పూర్తి చేసి వినియోగంలోకి తెస్తామని ప్రకటించారు. దీని పక్కనే నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నూతన ప్రధాన భవన పనులు కూడా చివరి దశకు చేరుకున్నాయని, వీటిని వేగవంతంగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డిపార్ట్‌మెంట్ ఇంజనీర్లను ఆదేశించినట్లు తెలిపారు. ఆసుపత్రికి వచ్చే ఇన్ పేషెంట్లకు వైద్యంతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రవణ్ కుమార్, ఆర్ఎంఓలు గీతా వాణి, ప్రశాంతి, డాక్టర్స్ మనీషా, సతీష్, ఉపేందర్ సింగ్, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతు భీమా పథకాన్ని బాధ్యతగా నిర్వహిస్తున్నాం

- **మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 19 (జనం సాక్షి) :** రైతు మరణించిన సందర్భంలో వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే రైతు బీమా పథకాన్ని ప్రభుత్వం అత్యంత బాధ్యతతో అమలు చేస్తోందన్నారు. ఎల్ఐసీకి చెల్లించాల్సిన మొత్తం వార్షిక ప్రీమియాన్ని ప్రభుత్వం ఇప్పటికే చెల్లించిందన్నారు. రైతు బీమా పథకాన్ని నిలిపివేసినట్లు ప్రచారం పూర్తిగా అసత్యమని మంత్రి తుమ్మల అన్నారు. రైతు సంక్షేమం విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులకు ఉపయోగపడే ఏ ఒక్క పథకాన్ని నిలిపివేసిన దాఖలాలు లేవని, పథకాలను నిలిపివేసి రైతులను ఇబ్బందులకు గురిచేసిన చరిత్ర గత ప్రభుత్వానిదే అని దుయ్యబట్టారు. గత ప్రభుత్వం రైతులకు ఉపయోగపడే వ్యవసాయ యాంత్రీకరణ, సాయిల్ హెల్త్ టెస్ట్, సబ్సిడీపై విత్తనాలు వంటి పథకాలను నిలిపివేయడమే కాకుండా స్టేట్ వాటాను విడుదల చేయకుండా కేంద్ర ప్రాయోజిత పథకాలను సైతం రైతులకు దూరం చేసిందని విమర్శించారు. మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఎలాంటి బేషజాలకు పోకుండా అమలు చేయడమే కాకుండా.. గత ప్రభుత్వం ఆపేసిన పథకాలను పునరుద్ధరిస్తూ రైతులకు అండగా నిలుస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదే అని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 66,038 మంది రైతుల కుటుంబాలు రైతు బీమా పథకం ద్వారా లబ్ధి పొందాయని మంత్రి తెలిపారు. ఆయా కుటుంబాల నామినీల ఖాతాల్లో మొత్తం రూ. 3301.90 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. 2023 డిసెంబర్ నుంచి ఆ ఏడాది ముగిసే వరకు 20,090 కుటుంబాలకు రూ.1,004.50 కోట్లు, 2024 సంవత్సరంలో 25,861 కుటుంబాలకు రూ.1,293.05 కోట్లు బీమా సాయంగా అందించినట్లు వివరించారు. 2025-26 సంవత్సరానికి రాష్ట్రంలో 42.16 లక్షల మంది రైతులు రైతు బీమా పథకంలో నమోదు చేసుకున్నారని, వీరందరికీ వర్తించేలా ఎల్ఐసీకి చెల్లించాల్సిన మొత్తం వార్షిక ప్రీమియం రూ.1,359.56 కోట్లను ప్రభుత్వం పూర్తిగా చెల్లించిందన్నారు. దీంతో 20,087 కుటుంబాలకు రూ.1004.35 కోట్లు బీమా సహాయంగా అంది, మరణించిన రైతు కుంటుబాలకు ఆర్థిక చేయూత అందించడం జరిగిందని అన్నారు. రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ప్రభుత్వంపై బురదచల్లే ప్రయత్నాలు మానుకోవాలని మంత్రి హితవు పలికారు. రైతు మరణంతో దుఃఖంలో ఉన్న కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించి వారిని ఆర్థికంగా నిలదొక్క కొనే విధంగా రైతు బీమా పథకాన్ని ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని, రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

## ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులకు చిక్కిన నేరస్తుడు



**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 19 (జనం సాక్షి) :** ఆన్లైన్ లో నకిలీ పత్రాలు మరియు నకిలీ పేరుతో విద్యార్థులకు ట్రైనింగ్స్ ఇస్తామని నమ్మించి, 10 లక్షల రూపాయలు మోసం చేసిన కేసులో ఒకరిని ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు హైదరాబాద్ లో అరెస్టు చేసినట్లు పోలీస్ కమిషనర్ సునిల్ దత్ తెలిపారు. కేసు వివరాలలోకి వెళితే... ఖమ్మం జిల్లాకు చెందిన ప్రముఖ విధ్య సంస్థకి వాట్సాప్‌లో ఐ. ఐ. టి హైదరాబాద్ ప్రొఫెసర్ అని పరిచయం చేసుకొని, మీ కళాశాల విద్యార్థులకు ట్రైనింగ్స్ నిర్వహిస్తామని చెప్పి , నకిలీ డాక్యుమెంట్స్, నకిలీ యమ్. ఓ. యు ల ను ఆన్లైన్ లో పంపించి , 10 లక్షలు రూపాయలు మోసశీ చేసిన కేసులో నిందితుడు అక్కౌంట్ హోల్డర్ అయిన .రవి కిరణ్ , వయస్సు 26సం: లు ను హైదరాబాద్ లో అరెస్టు చేసి ఖమ్మం సైబర్ క్రైం కోర్టులో హాజరు పరిచి, రిమాండ్ కి తరలించినట్లు తెలిపారు. ఇంకా కేసు దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు. ఈ కేసు విచారణలో ముఖ్య పాత్ర వహించిన సైబర్ క్రైమ్ డిఏస్పీ ఫణిందర్, సిఐ భూక్యా రవి కుమార్, ఎస్సై లు రశీజిత్ కుమార్ , విజయకుమార్, కానిస్టేబుల్ కృష్ణ రావు ,నాగేశ్వరావు, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.

## ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించాలి

- **జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**సూర్యాపేట ప్రతినిధి, జూన్ 19 (జనంసాక్షి) :** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా స్వచ్ఛత, పారదర్శకత, కచ్చితత్వాన్ని పరిరక్షించేందుకు ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని నిర్వహించటం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. ఈ కార్యక్రమం 2026 జూన్ 25 నుండి ప్రారంభమై 2026 అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రచురణతో ముగుస్తుందన్నారు. ఈ నెల 25 నుండి వచ్చే నెల 24 వరకు ఇంటింటి ఎన్యూమరేషన్, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, వచ్చే నెల 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ ఉంటుందని తెలిపారు. 2026 జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. 2026 జూలై 31 నుండి సెప్టెంబర్ 28 వరకు నోటీసుల జారీ, విచారణ, ధృవీకరణ, ఫారాలపై నిర్ణయం తీసుకొనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రచురణ ఉంటుందన్నారు. బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటిని కనీసం మూడు సార్లు సందర్శించి ఎన్యూమరేషన్ ఫారాలను అందజేస్తారని తెలిపారు. ఓటర్లు ఫారాన్ని పూర్తి చేసి 24 జూలై 2026లోపు బిఎల్ఓలకు అందజేయాలన్నారు. ఆధార్ నంబర్ ఇవ్వడం పూర్తిగా ఐచ్ఛికమని తెలిపారు. ఫోటో తప్పుగా లేదా పాతదిగా ఉంటే తాజా ఫోటోను ఫారానికి జత చేయాలన్నారు. ఇంట్లో అందుబాటులో లేకపోతే కుటుంబంలోని వయోజన సభ్యుడు ఫారం పూర్తి చేసి సమర్పించవచ్చని తెలిపారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్‌లో ఓటర్ కార్డు నెంబర్ లేదా నమోదిత మొబైల్ నంబర్ ద్వారా లాగిన్ అయి ఎన్యూమరేషన్ ఫారాన్ని ఆన్‌లైన్‌లో పూర్తి చేసి సమర్పించవచ్చని తెలిపారు. 2026 అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు లేదా 18 సంవత్సరాలు పూర్తి చేసుకునే అర్హత కలిగిన వారు ఫారం-6, డిక్లరేషన్ ఫారంతో కొత్త ఓటరుగా నమోదు చేసుకోవచ్చని అన్నారు. జులై 31న ముసాయిదా జాబితా ప్రచురణ తర్వాత ఫారం-8 ద్వారా చిరునామా మార్పు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు సంబంధిత బూత్ స్థాయి అధికారిని సంప్రదించవచ్చని తెలిపారు. ఓటర్ హెల్ప్‌లైన్ 1950కు కూడా కాల్ చేయవచ్చన్నారు. ప్రజలందరూ ఈ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగస్వాములై, తమ ఓటరు వివరాలను ధృవీకరించుకొని, కచ్చితమైన ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించాలని అన్నారు.

## డిండి రిజర్వాయర్ నుంచి ఆయకట్టుకు నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే

**దేవరకొండ, జూన్ 19 (జనం సాక్షి) :** వానాకాలం సాగు సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు సకాలంలో సాగునీరు అందించాలనే లక్ష్యంతో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ శుక్రవారం డిండి రిజర్వాయర్ నుండి ఆయకట్టుకు నీటిని చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ, రైతుల సంక్షేమం మరియు వ్యవసాయాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. డిండి రిజర్వాయర్ నుంచి విడుదల చేసిన నీటితో డిండి మండల పరిధిలోని ఆయకట్టు ప్రాంతాల్లో సుమారు 20 వేల ఎకరాల్లో వరి సాగు జరగనున్నట్లు తెలిపారు. సాగునీరు అందుబాటులోకి రావడంతో రైతులు వానాకాలం పంటల సాగుకు సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇరిగేషన్ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టి నీటి పంపిణీ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. రైతులు నీటిని సద్వినియోగం చేసుకొని అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రైతుల అవసరాలకు అనుగుణంగా సాగునీరు అందించేందుకు



కృషి చేస్తామని ఎమ్మెల్యేహామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిర్ణీత గడువులోపు అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- **జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**

**ఖమ్మం రూరల్, జూన్ 19 (జనం సాక్షి) :** ఖమ్మం రూరల్ మండల పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వేగవంతంగా, నియమిత గడువు లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. శుక్రవారం పాలేరు నియోజకవర్గం పరిధిలో జిల్లా కలెక్టర్ పర్యటించారు. ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి లో 108 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాయ్స్, గర్ల్స్ హాస్టల్ భవనాలు, ప్రధాన భవనం, అకాడమిక్ బ్లాక్ నిర్మాణాల పనుల పురోగతిని పరిశీలించారు. కార్మికులను పెంచి అనుసంధానంగా పనులు పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం పొన్నేకల్ లో చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ ప్రాంతాలను తిరుగుతూ, పనుల నాణ్యతను, భవనాల నమునా మ్యాప్ లను పర్యవేక్షించి అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాల వద్ద లింక్, అంతర్గత రోడ్లు, ప్రణాళిక ప్రకారం 4 జూనియర్, 9 సీనియర్ హాస్టల్ బ్లాకులు, వెయిటింగ్ హాల్, అకాడమిక్ బ్లాక్ భవనాల నిర్మాణంకు కార్మికులకు అత్యధికంగా పెంచి, పనులను త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా రంగం అభివృద్ధిని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని ముందుకు సాగుతున్నదని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన ఉన్నత విద్య, మెరుగైన ఉపాధి కోర్సులను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని అన్నారు. జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణం పూర్తయితే స్థానిక యువతకు సాంకేతిక విద్య అందుబాటులోకి వచ్చి, వారి భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతుందని అన్నారు. అదే విధంగా యంగ్ ఇండియా స్కూల్ పూర్తి కావడంతో పరిసర ప్రాంతాల విద్యార్థులకు మంచి విద్య అవకాశాలు అందుతాయని తెలిపారు.



పనుల నాణ్యతపై ఎటువంటి రాజీ ఉండకూడదని, ప్రతి దశలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో ఆలస్యం లేకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన వనరులు సమకూర్చుకుని, నిర్ణీత గడువులోపే పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ఇంజనీరింగ్ అధికారి బుగ్గయ్య, ఖమ్మం రూరల్ మండల తహసీల్దారు యం. వినయేందర్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భూధార్ సర్వే, భూభారతి దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి

- **రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్. లోకేష్ కుమార్**

**జగిత్యాల బ్యూరో జూన్ 19 (జనం సాక్షి) :** భూధార్ సర్వే, భూభారతి దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని, సాదా బైనామా, రీ-సర్వే ప్రక్రియలను గడువులోగా పూర్తి చేయాలని, రెవెన్యూ సేవలను ప్రజలకు పారదర్శకంగా అందించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్. లోకేష్ కుమార్, ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుండి రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్. లోకేష్ కుమార్, ఐఏఎస్ పలు జిల్లాల కలెక్టర్లతో భూధార్ సర్వే, భూభారతి, సాదా బైనామా, నాన్-కడాస్ట్రల్ గ్రామాల రీ-సర్వే, నక్షా కార్యక్రమం తదితర అంశాలపై శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. జగిత్యాల కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్. లోకేష్ కుమార్, ఐఏఎస్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న భూధార్ సర్వే కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రతి భూ యజమానికి ఖచ్చితమైన భూ వివరాలు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే భూభారతి కార్యక్రమం కింద వచ్చిన దరఖాస్తులను ఎటువంటి జాప్యం లేకుండా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని, ప్రజలకు రెవెన్యూ సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సాదాబైనామా దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేసి అర్హులైన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని, భూములకు సంబంధించిన పెండింగ్ అంశాలను ప్రాధాన్యతగా తీసుకుని పూర్తి చేయాలని పేర్కొన్నారు. జిల్లాల్లో కొనసాగుతున్న నాన్-కడాస్ట్రల్ గ్రామాల రీ-సర్వే కార్యక్రమాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, ఎంపిక చేసిన గ్రామాల్లో నక్షా డిజిటల్ భూ మ్యాపింగ్ పనులను నాణ్యత ప్రమాణాలతో అమలు చేయాలని ఆదేశించారు. భూముల హద్దుల నిర్ధారణలో పారదర్శకత పాటిస్తూ భూ రికార్డుల ఆధునీకరణకు అధికారులు ప్రత్యేక దృష్టి




సారించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి, రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయడానికి సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భూమి కొలతల ఎడి కిషన్ ప్రసాద్, జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, మున్సిపల్ కమిషనర్, మరియు తదితరులు పాల్గొన్నారు.

## మధిరలో పర్యటించిన అడిషనల్ కలెక్టర్ శ్రీజ



**మధిర, జూన్ 19 (జనంసాక్షి) :** ఖమ్మం జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీజ మధిరలో శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. పర్యటనలో భాగంగా మధిర మున్సిపాలిటీ పరిధిలోని మహాప్రస్థానం, అండర్ డ్రైనేజీ వర్క్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జరుగుతున్న అభివృద్ధి పనులలో నాణ్యత లోపించకూడదని త్వరతిగతిన పనులు పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు. మధిర మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డ్ ఎంప్లాయిస్ కాలనీలో గల వంద పడకలాసుపత్రిని అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడున్న వైద్య సదుపాయాలను పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన వైద్యాన్ని ప్రజలకు అందించాలని సూచించారు. 100 పడకల ఆసుపత్రిలో ల్యాబ్ కు అవసరమైన పరికరాలను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మధిర మున్సిపాలిటీ కమిషనర్ సామ్యూల్ఇజ్రాయిల్ పాల్, మున్సిపాలిటీ చైర్పర్సన్ సామినేని సుజాత, 17వ వార్డు కౌన్సిలర్ ములకలపల్లి వినయ్, వాటి కౌన్సిలర్లు అధికారులు పాల్గొన్నారు.






# మార్కెట్లపై ఐటీ దెబ్బ..

### నష్టాలతో ముగిసిన సూచీలు

**న్యూఢిల్లీ:**దేశీయ మార్కెట్ల వరుస ర్యాలీకి బ్రేక్ పడింది. గత ఐదు సెషన్లలో లాభాలను ఆర్జించిన సూచీలు శుక్రవారం నష్టాలతో ముగిశాయి. టెక్ దిగ్గజం యాక్సెంచర్ ఆందోళనలు దేశీయ ఐటీ షేర్లను కుదిపేశాయి. దీంతో మార్కెట్లు పతనమయ్యాయి. చివర్లో కాస్త కొనుగోళ్లు జరిగినా.. సూచీల కు నష్టాలు తప్పలేదు. సెన్సెక్స్ 600 పాయింట్లు కోల్పోగా.. నిఫ్టీ 24వేల మార్క్‌ను కష్టంగా నిలబెట్టుకుంది.ఐటీ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో ఆరంభం నుంచే సూచీలు ఢీలా పడ్డాయి. 76,852.86 పాయింట్ల వద్ద మొదలైన సెన్సెక్స్ ఒక దశలో ఏకంగా 940 పాయింట్లు దిగజారి 76,649 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని తాకింది. సెషన్ చివర్లో కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడంతో నష్టం కొంత తగ్గింది. నేటి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 607.08 పాయింట్లు పతనమై 76,802.90 వద్ద ముగిసింది. అటు నిఫ్టీ (ఔతిటబిఎ) కూడా 26,373.20 - 24,047.20 మధ్య కదలాడింది. చివరకు 154.90 పాయింట్లు తగ్గి 24,013.10 వద్ద స్థిరపడింది. డాలర్‌తో పోలిస్తే మన కరెన్సీ రూపాయి మారకం విలువ 7 పైసలు పెరిగి 94.33 వద్ద ముగిసింది.అంతర్జాతీయ టెక్ దిగ్గజం యాక్సెంచర్ తన ఆదాయ వృద్ధి అంచనాలను తగ్గించడంతో పాటు భవిష్యత్తులో డిమాండ్ బలహీనంగా ఉండొచ్చని పేర్కొంది. దీంతో ఈ రంగంపై ఆందోళనలు మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫలితంగా నేటి ట్రేడింగ్‌లో ఐటీ కంపెనీల షేర్లు భారీగా కుదేలయ్యాయి. నిఫ్టీలో ఇన్ఫోసిస్ 6.75శాతం, టీసీఎస్ 3.55 శాతం, టెక్ మహీంద్రా 2.63శాతం, హెచ్‌సీఎల్ టెక్నాలజీ 2.59శాతం మేర కుంగాయి. ఎటర్నల్, భారతీ ఎయిర్‌టెల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, నెస్లే షేర్లు రాణించాయి. అమెరికా మార్కెట్లలో యాక్సెంచర్ షేర్లు గురువారం ఏకంగా 17శాతం మేర కుంగడం గమనార్హం.

# జియో ఏఐ ఏజెంట్..

### కొత్తగా మై జియో.. టెలిఫ్రేమ్.. ఏజీఎంలో కీలక ప్రకటనలు

జియో టెలికాం... జియో ఫైబర్.. జియో ఎయిర్‌ఫైబర్.. ఇలా ఏటా కొత్త ప్రకటనలతో ఆకట్టుకుంటూ వచ్చిన రిలయన్స్ ఏజీఎం.. ఈసారి సరికొత్త ప్రకటనలు చేసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను పౌరులకు మరింత చేరువ చేసేలా రిలయన్స్ జియో కాల్‌లో ఏఐ ఏజెంట్ సదుపాయాన్ని తీసుకొస్తోంది. కొత్తగా జియో ఫ్రేమ్‌ను పరిచయం చేయబోతోంది. మై జియో యాప్‌ను ఏఐ ఏజెంట్‌గా మార్చబోతోంది. ఈ మేరకు జియో ప్లాట్‌ఫామ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆకాశ్ అంబానీ ఏజీఎం వేదికగా కీలక ప్రకటనలు చేశారు. ఆ వివరాలు ఇవీ..




**హే జియో:**రిలయన్స్ జియో కొత్త కాల్ ఏజెంట్‌ను తీసుకురాబో తోంది. ఇందుకోసం జియో నెట్‌వర్క్‌లో ఏఐ అసిస్టెంట్‌ను అనుసంధానం చేయబోతోంది. ఇందుకోసం ప్రత్యేకంగా ఎలాంటి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాల్సిన అవసరం లేదు. ఫోన్ కాల్‌లో ఉన్నప్పుడు 'హే జియో' అంటే చాలు.. జియో కాల్ ఏజెంట్ యాక్టివేట్ అవుతుంది. యూజర్ అనుమతితో కాల్‌లో జాయిన్ అవుతుంది. 10మందితో కాన్ఫరెన్స్‌లో ఉన్నప్పుడు అన్నింటినీ రియల్ టైమ్‌లో గుర్తిస్తుంది. స్థానిక భాషలో ట్రాన్స్‌క్రిప్షన్‌ను అందిస్తుంది. కాల్ అనంతరం సంభాషణల మొత్తాన్ని సమ్మరైజ్ చేస్తుంది. జియో కాల్ ఏజెంట్ యూజర్ తరఫున క్యాబ్ బుక్ చేయడం, ఫుడ్ ఆర్డర్ చేయడం, రెస్టరంట్‌లో టేబుల్ బుక్ చేయడం వంటి పనులూ చేస్తుంది. ఈ ఏడాది చివరికల్లా జియో యూజర్లందరికీ జియో కాల్ ఏజెంట్‌ను అందుబాటులోకి తేనున్నట్లు జియో ప్లాట్‌ఫామ్ ఎండీ ఆకాశ్ అంబానీ ప్రకటించారు.

**మై జియో కొత్తగా :**జియో యూజర్లు వినియోగించే మై జియో యాప్‌ను సమూలంగా మార్పు చేయనున్నారు. మొబైల్ రీఛార్జి, అకౌంట్ బ్యాలెన్స్, సర్వీసులను మేనేజ్ చేయడానికి మాత్రమే ప్రస్తుతం ఉపయోగిస్తున్న ఈ యాప్.. ఇకపై పర్సనల్ ఏఐ అడ్వైజర్, రిలేషన్‌షిప్ మేనేజర్‌గానూ వ్యవహరించనుంది. మెనూల మధ్య నావిగేట్ అవ్వకుండా.. మీకేం కావాలో చెప్తే ఏఐ అసిస్టెంట్ ఆ పని చేసి పెడుతుంది. ఒకవేళ మీ జియో బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్‌ను వేరే చోటుకు మార్చా లనుకుంటే.. ఏఐని అడిగితే అందుకు అవసరమైన పనులు చేసి పెడుతుంది. మీరు విదేశాలకు వెళ్లాలనుకుంటే సూట్ అయ్యే అంతర్జాతీయ రోమింగ్ ప్యాక్‌ను సజెస్ట్ చేస్తుంది. యూజర్ అనుమతితోనే ఈ ఏజెంట్లు పనిచేస్తాయని కంపెనీ పేర్కొంది.

**టెలిఫ్రేమ్.. మీ ఇంట్లో ఏఐ ఏజెంట్**

ఏజీఎంలో భాగంగా జియో టెలిఫ్రేమ్ అనే సరికొత్త పరికరాన్ని ఆవిష్కరించింది. జియో టెలిఫ్రేమ్ మీ ఇంట్లోని వివిధ రకాల ఏఐ ఏజెంట్లకు ఒక కేంద్రంగా పనిచేస్తుంది. రోజువారీ జీవితంలో మీ తరఫున రకరకాల పనులను పూర్తి చేయడానికి ఈ ఏఐ ఏజెంట్లు ఉపయోగపడతాయి. మీ గదిలోనే ఉంటూ మీ అవసరాలను గుర్తించి అవసరమైన సలహాలు సూచనలు చేస్తుంది. డాక్టర్ అపాయింట్‌మెంట్ ఉంటే గుర్తు చేస్తుంది. వర్షం పడేలా ఉంటే గొడుగు తీసుకెళ్లాలని చెబుతుంది. క్రికెట్ మ్యాచ్ సమయంలో జియో హాట్‌స్టార్‌ను ప్లే చేస్తుంది. క్రికెట్ లైవ్ స్కోరునూ డిస్‌ప్లేపై చూపిస్తుంది.

## సెబీకి జియో ముసాయిదా పత్రాలు

మదుపరులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 'జియో ఐపీఓ'కు సంబంధించి కీలక్ అప్‌డేట్ వచ్చేసింది. ఈ ఐపీఓకు సంబంధించిన డ్రాఫ్ట్ పేపర్లను మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి సమర్పించింది. అంతకుముందు జియో ప్లాట్‌ఫామ్స్ బోర్డు డీహెచ్‌ఆర్‌పీకి ఆమోదం తెలిపింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ వార్షిక సాధారణ సమావేశంలో ఐపీఓ పత్రాలను నేడే సమర్పించనున్నట్లు ముకేశ్ అంబానీ వెల్లడించిన కాసేపటికే సెబీకి ఈ పత్రాలు చేరాయి."ఇది నాతో పాటు రిలయన్స్ కుటుంబానికి, కోట్లాది మంది వాటాదారులకు భావోద్వేగభరిత క్షణం. జియో ఐపీఓకు సంబంధించిన డ్రాఫ్ట్ పేపర్లను బోర్డు ఆమోదించింది. ఈ రోజే సెబీకి సమర్పిస్తాం. ఈ ఏడాది రిలయన్స్‌కు జియో ఐపీఓ అత్యంత ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది. ఇది మా వాటాదారులకు గణనీయమైన విలువను అందించడంతో పాటు కొత్త పెట్టుబడిదారులకు ఆకర్షణీయమైన పెట్టుబడి అవకాశాన్ని కల్పిస్తుందని విశ్వసిస్తున్నా. ప్రపంచ స్థాయి సామర్థ్యం కలిగిన సాంకేతిక సంస్థలను భారత్ నిర్మించగలదని జియో లిస్టింగ్ ప్రపంచానికి నిరూపిస్తుంది" అని ముకేశ్ అంబానీ వెల్లడించారు.

**27 కోట్ల షేర్లు:**ఈ ఐపీఓ ద్వారా సుమారు 4 బిలియన్ డాలర్ల (సుమారు రూ.37,700 కోట్లు) నిధులు సేకరించాలని భావిస్తున్నారు. ఈ పబ్లిక్ ఇష్యూలో 27 కోట్ల కొత్త షేర్లను ఇన్వెస్టర్లకు జారీ చేయనున్నారు. ఐపీఓ ద్వారా వచ్చే మొత్తాన్ని కంపెనీ తీసుకున్న అప్పులను తీర్చడానికి ఉపయోగించనున్నారు. మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాల కోసం ఉపయోగిస్తారు. డ్రాఫ్ట్ పేపర్లు దాఖలు చేసే నాటికి.. ప్రమోటర్ సంస్థ అయిన రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు జియో ప్లాట్‌ఫార్మ్‌లో 66.43 శాతం వాటా ఉంది.గతేడాది నిర్వహించిన రిలయన్స్ ఏజీఎం సందర్భంగా జియో ఐపీఓ గురించి ముకేశ్ అంబానీ ప్రకటన చేశారు. 2026కు తొలి అర్ధభాగంలోనే జియో ఐపీఓ ఉంటుందని అప్పట్లో తెలిపారు. అయితే, ఈ ఏడాదిలో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు విలువ క్షీణించడం, పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల రిలయన్స్ ప్రధాన ఆదాయ వనరు అయిన పెట్రోకెమికల్ వ్యాపారంపై ప్రభావం పడడం వంటి పరిణామాలతో ఈ ప్రక్రియ ఆలస్యమైంది.




**గుడ్ల ధరలు**

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్

| ₹ 1,33,700 | ₹ 1,45,860 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,55,000

## మెడికవర్ హాస్పిటల్స్‌లోకి కేకేఆర్?

**హైదరాబాద్:**దేశీయ వైద్యసేవల రంగంలో మరో భారీ పెట్టుబడి చోటుచేసుకుంటోంది. హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న మెడికవర్ హాస్పిటల్స్‌లో అగ్రశ్రేణి ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) పెట్టుబడుల సంస్థ కేకేఆర్ మెజార్టీ వాటా సొంతం చేసుకోనున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం స్వీడన్‌లోని మెడికవర్ హాస్పిటల్స్ మాతృ సంస్థ అయిన మెడికవర్‌తో కేకేఆర్ ప్రతినిధులు సంప్రదింపులు సాగిస్తున్నారు. ఇరుపక్షాల మధ్య చర్యలు సాగుతున్న విషయం వాస్తవమేనని, కానీ ఇంకా తుది ఒప్పందం కుదుర్చుకునే వరకు రాలేదని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి.డాక్టర్ అనిల్ కృష్ణ ఛైర్మన్‌గా ఉన్న మెడికవర్ హాస్పిటల్స్‌లో మెడికవర్‌కు 66.9% వాటా ఉంది. ఈ సంస్థ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రల్లోని వివిధ నగరాల్లో 26 కార్పొరేట్ ఆసుపత్రులు నిర్వహిస్తోంది. వీటన్నింటిలో కలిపి 6,000కు పైగా వైద్య పడకలున్నాయి. తొలుత మ్యాక్స్‌క్యూర్‌గా ఉన్న ఈ హాస్పిటల్ చెయిన్‌లో మెజార్టీ వాటాను కొన్నేళ్ల క్రితం మెడికవర్ కొనుగోలు చేశాక, మెడికవర్ హాస్పిటల్స్‌గా పేరు మారింది. ఛైర్మన్‌గా డాక్టర్ అనిల్ కృష్ణ, సీఈఓగా హరికృష్ణ వ్యవహరిస్తున్నారు. మెడికవర్ భాగస్వామిగా చేరాక మెడికవర్ హాస్పిటల్స్ కార్యకలాపాలు బాగా విస్తరించాయి. తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు వెళ్లేందుకు మెడికవర్ హాస్పిటల్స్ ఏడాది కాలంగా సన్నాహాలు చేస్తోంది. ఇందువల్ల కొందరు ఇన్వెస్టర్లు తమ వాటా విక్రయించేందుకు వీలవుతుంది. భవిష్యత్తు అవసరాల కోసం సంస్థకూ నిధులు సమకూరతాయి. ఈ ఏడాదిలోనే పబ్లిక్ ఇష్యూకు వచ్చేందుకు అనుమతులు కోరుతూ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా పత్రాలను మెడికవర్ హాస్పిటల్స్ దాఖలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో మెడికవర్ నుంచి మెజార్టీ వాటా కొనుగోలు చేయడానికి కేకేఆర్ ఆసక్తి చూపుతోందనే అంశం తెరమీదకు వచ్చింది.

# రూ.1.50లక్షల దిగువకు పసిడి

### తగ్గిన బంగారం, వెండి ధరలు • భారత పసిడి దిగుమతులు 70% తగ్గాయ్

దేశీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు దిగొచ్చాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలు చల్లారడం, చమురు ధరలు పడిపోవడం వంటి పరిణామాలతో ఈ లోహాలకు డిమాండ్ తగ్గింది. దీంతో వీటి ధరలు తగ్గుముఖం పట్టాయి. హైదరాబాద్ మార్కెట్‌లో శుక్రవారం 24 క్యారెట్ల మేలిమి 10 గ్రాముల పుత్తడి ధర రూ.1,49,270గా ఉంది. క్రితం రోజుతో పోలిస్తే దాదాపు రూ.3000కు పైనే తగ్గింది. ఇక, కేజీ వెండి ధర రూ.2.37లక్షలు పలికింది. వెండి ధర ఒక్క రోజే రూ.8,600 తగ్గడం గమనార్హం.అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఈ లోహాల ధరలు దిగొచ్చాయి. ఔన్సు పుత్తడి ధర 4,139 డాలర్లు, ఔన్సు వెండి ధర 63.85 డాలర్లుగా ఉంది. కమొడిటీ ఎక్స్ఛేంజీ మార్కెట్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ ధర రూ. 1.46 లక్షలకు పడిపోయింది. సిల్వర్ ఫ్యూచర్స్ ధర రూ.2.30లక్షలుగా కొనసాగుతోంది.అమెరికా-ఇరాన్ యుద్ధం ముగియడం, ఫెడ్ ప్రకటనతో అంతర్జాతీయ మార్కెట్లు కోలుకున్నాయి. అటు డాలర్‌తో పోలిస్తే మన కరెన్సీ రూపాయి విలువ కూడా బలపడుతోంది. చమురు ధరలు యుద్ధం మునుపటి స్థితికి దిగొస్తున్నాయి. ఈ కారణాలు బంగారం, వెండి ధరలపై ప్రభావం చూపిస్తున్నాయని బులియన్ విశ్లేషకులు చెబుతున్నారు. అటు దేశీయంగానూ కొనుగోళ్లు తగ్గడం కూడా వీటి ధరల పతనానికి కారణమవుతున్నట్లు పేర్కొంటున్నారు.




**భారత పసిడి దిగుమతులు 70% తగ్గాయ్**

దిల్లీ: కస్టమ్స్ సుంకాన్ని పెంచాక, మనదేశంలోకి బంగారం దిగుమతులు సుమారు 70% తగ్గి 25-30 టన్నులకు పరిమితమయ్యాయి. మే 13 నుంచి పసిడి, వెండిపై దిగుమతి సుంకాన్ని 6% నుంచి 15 శాతానికి పెంచిన సంగతి తెలిసిందే. 'దిగుమతి సుంకం పెంపు తర్వాత, నెల రోజుల వ్యవధిలో పసిడి దిగుమతులు 25-30 టన్నులకు తగ్గాయి. అంతకుముందు ఇవి 75-100 టన్నులుగా ఉన్నాయ'ని ఓ అధికారి తెలిపారు. అయితే భారత పసిడి దిగుమతుల విలువ మాత్రం 34% పెరిగి 3.41 బిలియన్ డాలర్లుగా నమోదైంది. బంగారం అధిక ధరలే ఇందుకు కారణం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27) ఏప్రిల్-మేలో పసిడి దిగుమతులు 60.14% పెరిగి 9.04 బిలియన్ డాలర్లకు చేరాయి. 2025-26లో పసిడి దిగుమతులు 24% పెరిగి జీవనకాల గరిష్ఠమైన 71.98 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

## స్విస్ బ్యాంకుల్లో భారతీయుల సొమ్ములు తగ్గాయ్

### 2025లో రూ.36,793 కోట్లకు

దిల్లీ/జ్యూరిచ్: స్విస్ బ్యాంకుల్లో భారతీయుల సొమ్ములు 2025లో 8% తగ్గి 3.25 బిలియన్ స్విస్ ఫ్రాంక్‌ల (దాదాపు రూ.36,793 కోట్ల)కు చేరాయి. స్థానిక శాఖలు, ఇతర ఆర్థిక సంస్థల దగ్గర భారతీయులు ఉంచిన నిధులు తగ్గినట్లు స్విట్జర్లాండ్ సెంట్రల్ బ్యాంక్ గురువారం తెలిపింది. 2024లో స్విస్ బ్యాంకుల్లో భారతీయుల నిధులు, 2023 కంటే 3 రెట్లు పెరిగి 3.5 బిలియన్ స్విస్ ఫ్రాంక్‌లుగా ఉన్నాయి. 2021లో ఈ నిధులు గరిష్ఠంగా 3.83 బిలియన్ స్విస్ ఫ్రాంక్‌లుగా నమోదయ్యాయి. వ్యక్తిగత, సంస్థాగత క్లయింట్‌ల ఖాతాల డిపాజిట్లు మాత్రం 50% పెరిగి 524 మిలియన్ స్విస్ ఫ్రాంక్‌ల (దాదాపు రూ.6,000 కోట్ల)కు చేరాయి. మొత్తం నిధుల్లో ఇవి 16 శాతానికి సమానం. ఇతర బ్యాంకుల ద్వారా ఉన్న నిధుల విలువ 15% తగ్గి 2.6 బిలియన్ స్విస్ ఫ్రాంక్‌లుగా నమోదైంది. బాండ్లు, సెక్యూరిటీల నిధులు 135 మి.స్విస్ ఫ్రాంక్‌ల నుంచి 105 మి.స్విస్ ఫ్రాంక్‌లకు తగ్గాయి. ట్రస్టులు/ఫిడ్యుషియరీల నిధులు 41 మి.స్విస్ ఫ్రాంక్‌ల నుంచి 55% తగ్గి 18.6 మి.స్విస్ ఫ్రాంక్‌లకు పరిమితమయ్యాయి.ఇది నల్లధనం కాదు: స్విస్ బ్యాంకుల్లో భారతీయులు, భారతీయ బ్యాంకులు, కార్పొరేట్ సంస్థలు అధికారికంగా ఉంచిన నిధులు కావడంతో.. ఇవి రాజకీయంగా ఎంతో చర్చనీయాంశంగా ఉన్న నల్లధనం మొత్తాన్ని సూచించవు. ఎన్‌ఆర్‌ఐలు, ఇతర భారతీయులు, థర్డ్ కంట్రీ ఎంటిటీస్ పేర్లతో స్విస్ బ్యాంకుల్లో దాచే నిధులు ఈ లెక్కల్లోకి రావు.

## బ్రిటన్‌లో 90-95% భారతీయ వృత్తి నిపుణులకు మేలే!

### ఇరుదేశాల సామాజిక భద్రతా ఒప్పందం ఫలితమిదీ

**న్యూఢిల్లీ:**భారత్ - బ్రిటన్ మధ్య జులై 15 నుంచి అమల్లోకి రానున్న సామాజిక భద్రత లేదా డబుల్ కంట్రిబ్యూషన్ కన్వెన్షన్ (డీసీసీ), సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సీఈటీఏ) వల్ల మన వృత్తినిపుణులకు మేలు కలగనుంది. బ్రిటన్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న భారతీయ కంపెనీల్లో పనిచేస్తున్న 90-95% మంది వృత్తి నిపుణుల వ్యయాలు సంస్థలకు తగ్గుతాయి. ఫలితంగా బ్రిటిష్ మార్కెట్లోని భారతీయ సర్వీసు ప్రొవైడర్ల పోటీతత్వం పెరగనుందని ఒక అధికారి పేర్కొన్నారు. ఏ కంపెనీలకు ప్రయోజనం..: ప్రధానంగా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), ఇన్ఫోసిస్ వంటి ఐటీ దిగ్గజాలకు ప్రయోజనం కలగనుంది. బ్రిటన్ సామాజిక భద్రత కోసం భారతీయ వృత్తినిపుణులు ఏటా 0.5 బిలియన్ డాలర్లు (రూ.4,750 కోట్లు) చెల్లిస్తున్నారు. డీసీసీ కింద భారత్ నుంచి బ్రిటన్‌కు లేదా బ్రిటన్ నుంచి భారత్‌కు తాత్కాలికంగా బదిలీ అయిన ఉద్యోగులకు, ఆతిథ్య దేశంలో అయిదేళ్ల పాటు సామాజిక భద్రత చెల్లింపుల నుంచి మినహాయింపు లభిస్తుంది. అంటే ఈ వ్యయాలు తగ్గిపోతాయి.బ్రిటన్‌లో 900కు పైగా భారతీయ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. 75,000 మందికి పైగా భారతీయ వృత్తినిపుణులు ఆ దేశంలో పనిచేస్తున్నారు. వారి సగటు వార్షిక వేతనం 40,000-50,000 పౌండ్లు (రూ.50-62.5 లక్షలు)గా ఉండొచ్చని అంచనా. వేతనంలో 15 శాతాన్ని సామాజిక భద్రత కింద చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఇప్పుడు భారత్‌లో ఉద్యోగి సామాజిక భద్రతకు సదరు కంపెనీ చెల్లింపులు చేస్తున్న పక్షంలో, బ్రిటన్‌లో చెల్లింపులు చేయనక్కర్లేదు. 10% సుంకంతోనే 3.78 లక్షల కార్ల దిగుమతి: భారత్, యూకే ఒప్పందం ఫలితంగా, 15 ఏళ్ల వ్యవధిలో యూకే నుంచి 3.78 లక్షల కార్లను తక్కువ సుంకంతో భారత్‌లోకి దిగుమతి చేసుకోవచ్చు. వీటిపై సుంకం 110% నుంచి 10 శాతానికి తగ్గుతుంది. ఇదే సమయంలో మనదేశం నుంచి బ్రిటన్‌కు ఎగుమతి చేసే కార్లపై సుంకాలు 18% నుంచి సున్నాకు చేరతాయి. దేశీయ కంపెనీలకు ఇది మేలు చేయనుంది. ఐటీ సేవలు, కన్సల్టింగ్ కంపెనీ యాక్సెంచర్ మార్చి-మే త్రైమాసికంలో 2.39 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.22,705 కోట్లు) లాభాన్ని పొందింది. ఏడాది కిందట ఇదే త్రైమాసిక లాభం 2.24 బి.డాలర్ల (సుమారు రూ.21,280 కోట్లు) కంటే ఇది అధికమే. ఇదే సమయంలో ఆదాయం 17.7 బి.డాలర్ల నుంచి 18.7 బి.డాలర్లకు పెరిగింది. కొత్త ఆర్డర్లు 19.7 బి.డాలర్ల నుంచి 19.3 బి.డాలర్లకు తగ్గాయి.

## నీట్ రీ టెస్ట్‌కు ఓకే..

జరిపిన న్యాయస్థానం అందుకు నిరాకరించింది. ఈ పిటిషన్లను అత్యవసరంగా విచారణ జరపాలంటూ అభ్యర్థుల తరఫు న్యాయవాదులు కోరగా.. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం దాన్ని తోసిపుచ్చింది. నీట్‌కు సంబంధించిన అన్ని పిటిషన్లను జస్టిస్ పీఎస్. నరసింహ ధర్మాసనం ముందుకువెళ్లాయని.. ఈ పిటిషన్లను కూడా ఆ ధర్మాసనమే విచారిస్తుందని తెలిపింది. అభ్యర్థులు లేవనెత్తిన విషయాల్లో అత్యవసరస్థితి లేదని సీజేఐ పేర్కొన్నారు. ఇక, సామాజిక మాధ్యమాల్లో వస్తోన్న లీకేజీ రూమర్ల కారణంగా దాదాపు 1600 మంది విద్యార్థులు తీవ్ర ఒత్తిడిలో ఉన్నారని న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. జూన్ 21న పరీక్షకు సంబంధించిన అడ్మిట్ కార్డుల డౌన్‌లోడ్‌లో కూడా సమస్యలు ఉన్నాయని వాదించారు. అయితే, ధర్మాసనం వీటన్నింటినీ తోసిపుచ్చింది.

నీట్ రీ-టెస్టు పేపర్ లీక్ ప్రచారం నిజం కాదు

జూన్ 21న జరగనున్న నీట్-యూజీ రీ-ఎగ్జామ్ ప్రశ్నపత్రం లీకైనట్లు ఓ వీడియో సోషల్ మీడియాలో సర్క్యులేట్ అవుతోంది. దీనిపై పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పష్టతనిచ్చింది. ఎలాంటి లీక్ జరగలేదని.. ఈ పరీక్ష షెడ్యూల్ ప్రకారమే జరుగుతుందని పేర్కొంది. పరీక్షకు ముందు ఏ వ్యక్తి, సంస్థకు ప్రశ్నపత్రాలు దక్కే అవకాశం లేదంది. నీట్ రీ-ఎగ్జామ్ ప్రశ్నపత్రం లీక్ అయినట్టుగా కొందరు నకిలీ వార్తలను ప్రచారం చేస్తున్నారని, అలాంటి వాటిని నమ్మొద్దని విద్యార్థులు, తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేసింది. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి ఏవైనా అనుమానాస్పద కంటెంట్ మీ దృష్టికి వస్తే వాట్సప్ నంబర్ +91 8799711259కు గానీ, వెబ్‌సైట్ ద్వారా గానీ తమకు రిపోర్టు చేయాలని కోరింది. 2026 జూన్ 21న జరగనున్న నీట్-యూజీ-2026 రీటెస్టు పశ్నపత్రం ఇన్‌స్టాలో లీక్ అయ్యిందని పేర్కొంటూ ఓ వ్యక్తి సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. అందులో పేపర్-బి అని రాసి ఉన్న బుక్‌లెట్‌ను ఓ వ్యక్తి ఓపెన్ చేస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి.

# వుహాన్ ల్యాబ్‌కు నిధులు సమకూర్చిన బైడెన్ వైద్య సలహాదారు..!

**వాషింగ్టన్:**అమెరికా డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్ తులసీ గబ్బార్డ్ సంచలన విషయాలు బహిర్గతం చేశారు. అతి త్వరలో తన పదవి నుంచి వైదొలగనున్న నేపథ్యంలో తులసి పలు పత్రాలను డీక్లాసిఫై చేశారు. అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ ప్రధాన వైద్య సలహాదారు డాక్టర్ ఆంథోనీ ఫౌచీ చైనాలోని వుహాన్ ల్యాబ్‌లో కొవిడ్ పరిశోధనలకు నిధులు సమకూర్చినట్లు ఆమె వెల్లడించారు. ఫౌచీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అలర్జీ అండ్ ఇన్ఫెక్షియస్ డిసీజెస్ అధిపతిగా పనిచేస్తున్నప్పుడు కొవిడ్ మూలాలపై నిఘా అంచనాలను ప్రభావితం చేశారని, ఈ విషయంలో కాంగ్రెస్‌ను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. వుహాన్ ల్యాబ్ నుంచే కొవిడ్ మహమ్మారి ప్రపంచంలో వ్యాపించిందన్న ఆరోపణల నేపథ్యంలో ఈ పత్రాలు బయటకు రావడం సంచలనంగా మారింది. వుహాన్‌లో కరోనా వైరస్ పరిశోధనలకు నిధులు సమకూర్చడంలో ఫౌచీ ప్రమేయం.. ఈ మహమ్మారి విస్తరించిన సమయంలో చైనా నిఘా అధికారులతో ఆయన జరిపిన సంభాషణల సమాచారం తమ వద్ద ఉందని తులసి గబ్బార్డ్ వెల్లడించారు. అమెరికా పన్ను చెల్లింపుదారుల నుంచి సేకరించిన మిలియన్ల డాలర్లను ఆయన ల్యాబ్‌కు అందించారని పేర్కొన్నారు. ఈ నిజం ప్రపంచానికి తెలియకుండా ఉండేందుకు.. అదే ల్యాబ్ నుంచి వైరస్ వ్యాపించిందనే విషయం బయటకు రాకుండా ఉండేందుకు ఇంటెలిజెన్స్ కమ్యూనిటీలోని పలు రాజకీయ ప్రేరేపిత శక్తులను సైతం ఉపయోగించుకున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని ఫౌచీ నాటి అమెరికా అధ్యక్షుడికి కూడా తెలియనివ్వలేదన్నారు. కొవిడ్ వల్ల అమెరికాలోని లక్షలాది మంది ప్రజలు మృతిచెందారని.. కోట్లాది మంది తమ సన్నిహితులను కోల్పోయారని తులసి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రహస్యాన్ని కొందరు ఏళ్ల తరబడి కప్పిపుచ్చారన్నారు. దేశ ప్రజలు అసలు విషయం తెలుసుకోవాలనే ఆలోచనతో ఈ పత్రాలను ప్రపంచం ముందుకు తీసుకువచ్చినట్లు ఆమె తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలో తాము చేపట్టిన సమీక్షలో ఈ సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయన్నారు. చైనాతో సహా 30కి పైగా దేశాలలో 120కి పైగా జీవ ప్రయోగశాలలకు అమెరికా ప్రభుత్వం దీర్ఘకాలంగా నిధులు సమకూరుస్తున్నట్లు తమ దర్యాప్తులో వెల్లడైందని తెలిపారు. అమెరికా జాతీయ నిఘా సంస్థ డైరెక్టర్ తులసి గబ్బార్డ్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు గత నెలలో ప్రకటించిన విషయం తెలిసిందే. తన భర్త అబ్రహం అనారోగ్య సమస్యల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె తెలిపారు. జూన్ 30నుంచి తాను ఆ బాధ్యతల నుంచి వైదొలుగుతున్నట్లు పేర్కొన్నారు.



## ఫుట్‌పాత్‌పై నడవడం ప్రాథమిక హక్కు

ఉందని సుప్రీం కోర్టు ఈ సందర్భంగా గుర్తు చేసింది. సురక్షితమైన, సౌకర్యవంతమైన కాలిబాటలు లేకపోవడం, ఒకవేళ అవి ఉన్నప్పటికీ వాహనాలు వాటిని ఆక్రమించుకోవడం అనేది ఓ నాగరికత సమస్యగానే మిగిలిపోతోందని ఆందోళన వ్యక్తం చేసింది. సురక్షితంగా నడిచే హక్కు ఉల్లంఘనకు గురైనప్పుడు.. నష్ట పరిహారం కోసం సంబంధిత విభాగాలపై న్యాయపరంగా చర్యలు తీసుకునే హక్కు పౌరులకు ఉందని స్పష్టం చేసింది.కొంతకాలం క్రితం తండ్రితో కలిసి ఓ బాలుడు పాఠశాలకు వెళుతుండగా వెనుక నుంచి ఓ లారీ వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. పాదచారుల మార్గంలో లోపాలున్నాయని, పరిహారం అందించాలని కోరుతూ బాలుడి తండ్రి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. పరిహారం చెల్లింపు అంశం సుప్రీం కోర్టుకు చేరడంతో ఈ కేసును విచారించిన ధర్మాసనం.. పాదచారుల భద్రతపై కీలక తీర్పు ఇచ్చింది. అంతేకాదు, మృతిచెందిన బాలుడి కుటుంబానికి చెల్లించాల్సిన పరిహారాన్ని రూ.11,44,628కి పెంచుతూ.. రెండు నెలల్లోగా ఈ మొత్తాన్ని చెల్లించాలని సంబంధిత వ్యక్తులను ఆదేశించింది.




# అనుమతి 'సున్నా'.. ప్రేమ 'మిన్న'

## కార్పొరేట్ కాలేజీపై 'ఇంటర్' అధికారుల వల్లమాలిన ప్రేమ

- ఐదంతస్తుల భవనం.. ఐనా కనబడదట
- అనధికారిక బ్రాంచ్‌కు 'షోకాజ్' వింత..
- సీజ్ చేయకుండా జాప్యం వెనుక మతలబేంటి?

*ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న ఖమ్మం జిల్లాలో ఇంటర్మీడియట్ అధికారుల 'అపార మేధస్సు' ఇంటర్ విద్యాశాఖ పరువును బజారున పడేసింది. వైరా రోడ్డు పక్కన కళ్లముందే దర్జాగా వెలసిన ఐదంతస్తుల 'నారాయణ' అక్రమ విద్యాసామ్రాజ్యం జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కంటికి కనిపించకపోవడం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. అసలు ప్రభుత్వ అనుమతి లేని, ఉనికిలోనే లేని ఓ అనధికారిక బ్రాంచ్‌ను తక్షణమే సీజ్ చేయాల్సింది పోయి.. సదరు కార్పొరేట్ సంస్థకు కాలయాపన లూప్‌హోల్స్ కల్పిస్తూ 'షోకాజ్' నోటీసులు ఇవ్వడం వెనుక ఉన్న మతలబేంటో చెప్పాలంటూ విద్యార్థి సంఘాలు, ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.*

ఖమ్మం బ్యూరో, (జనంసాక్షి):
ఖమ్మం జిల్లా ఇంటర్మీడియట్ శాఖలో చిత్ర విచిత్రాలు చోటుచేసుకుంటు న్నాయి. నిబంధనల కొరడా ఎప్పుడూ చిన్నోడిపైనే ఝులిపించే అధికారులు.. కార్పొరేట్ తివాచీల ముందు మాత్రం మోకాళ్లపై సాగిలపడుతున్నారు. ఖమ్మం వైరా రోడ్డు పక్కన వెలుగుమట్లలో ఐదు అంతస్తుల భవనంలో దర్జాగా వెలసిన 'నారాయణ' జూనియర్ కళాశాల అక్రమ భాగోతం ఇప్పుడు జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. అసలు పర్మిషనే లేని బ్రాంచ్‌కు షోకాజ్ నోటీసులు ఇవ్వడం ఇక్కడి అధికారుల 'అపార మేధస్సు'కు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది.

**కంటి ముందే కొండ ఉన్నా.. కనబడదు**
జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవిబాబు ప్రతిరోజూ ఇదే వైరా రోడ్డు గుండా జిల్లా కార్యాలయానికి రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు పక్కనే ఐదంతస్తుల భారీ భవనంలో బోర్డులు తగిలించుకుని వందలాది మంది విద్యార్థులతో నడుస్తున్న కార్పొరేట్ కళాశాల సదరు అధికారి కంటికి కనిపించకపోవడం పెద్ద వింత. పత్రికల్లో కథనాలు వచ్చి, రచ్చ జరిగాక గానీ సారుకి 'కనువిప్పు' కలగలేదు. తీరా స్పందించి ఏమి చేశారయ్యా అంటే.. అందరూ ముక్కున వేలేసుకునేలా 'షోకాజ్' నోటీసు ఇచ్చి చేతులు దులుపుకున్నారు.

**అసలు ట్విస్ట్ ఇక్కడే**
చట్టప్రకారం ప్రభుత్వ అనుమతి లేని విద్యాసంస్థలను తక్షణమే సీజ్ చేయాలి. విద్యార్థుల తల్లిదండ్రులను అప్రమత్తం చేయాలి. కానీ ఇక్కడ సీజ్ ఊసే లేదు. అసలు గుర్తింపే లేని, ఉనికిలోనే లేని ఒక అనధికారిక బ్రాంచ్‌కు 'షోకాజ్ నోటీసు' ఇవ్వడం వెనుక ఉన్న అంతరార్థం ఏమిటని విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. "అసలు పర్మిషనే లేనప్పుడు.. వివరణ ఇవ్వమని షోకాజ్ ఎలా ఇస్తారు సార్?" అని ప్రజలు నవ్వుకుంటున్నారు. చర్యల పేరుతో కాలయాపన చేస్తూ, సదరు కార్పొరేట్ సంస్థకు లీగల్‌గా తప్పుకునేందుకు అధికారులు లూప్‌హోల్స్ ఇస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

**మంత్రుల జిల్లాలోనే ఈ బరితెగింపా?**
ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న ఖమ్మం జిల్లాలో, అందులోనూ సీనియర్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నియోజకవర్గంలోనే ఇంతటి నిబంధనల ఉల్లంఘన జరగడం గమనార్హం. బిల్డింగ్ ఓనర్లు సైతం కనీస అనుమతులు ఉన్నాయో లేదో చూసుకోకుండా భవనాలు అద్దెకు ఇచ్చే యడం కూడా ఈ అక్రమాలకు ఊతమిస్తోంది. చిన్న ప్రైవేట్ విద్యాసంస్థల పై సింహస్వప్నంగా మారే ఇంటర్మీడియట్ అధికారులు, కార్పొరేట్ ముందర ఎందుకు పిల్లులవుతున్నారో చెప్పాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించి, ఈ అనధికారిక బ్రాంచ్‌ను తక్షణమే సీజ్ చేయకపోతే వందలాది మంది విద్యార్థుల భవిష్యత్తు నట్టేట మునగడం ఖాయంగా కనిపిస్తోంది.

# ప్రైవేట్ పాఠశాలలపై ఏసీబీ, ఐటీ విచారణ జరపాలి: ఏఐఎస్ఎఫ్

- డీఈఓ అండతోనే ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ పాఠశాలలు
- అక్షరాలతో లక్షల రూపాయల వ్యాపారం చేస్తున్న యాజమాన్యాలు
- డీఈఓ కార్యాలయం ముందు నోట్ల కట్టలు, పుస్తకాలతో ఏఐఎస్ఎఫ్ వినూత్న నిరసన




**కరీంనగర్ టౌన్, జూన్ 19 (జనం సాక్షి) :**
కరీంనగర్ జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు విద్యను వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులను ఆర్థికంగా దోచుకుంటు న్నాయని, అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలల యాజమాన్యాలపై ఏసీబీ, ఐటీ శాఖలతో విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాల ల్లో విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని, విద్యా హక్కు చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని కోరుతూ శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) కార్యాలయం ముందు వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించా రు. ఈ సందర్భంగా తారాజులో నోట్ల కట్టలు, పుస్తకాలను ఉంచి నిరసన తెలుపుతూ ప్రభుత్వ దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా మణికంఠ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని అనేక ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలను ఉల్లంఘిస్తూ అడ్మిషన్ల పేరుతో భారీగా ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. ఎల్‌కేజీ ఫీజులు కూడా కొన్ని చోట్ల బీటెక్ ఫీజులను మించిపోతున్నాయని, అడ్మిషన్ ఫీజుల పేరుతో రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు వసూలు చేస్తున్నారని విమర్శించారు. అధిక ఫీజులు, పుస్తకాలు, యూనిఫాంల విక్రయాల ద్వారా ప్రైవేట్ పాఠశాలలు లక్షల రూపాయల ఆదాయం పొందుతున్నప్పటికీ, వాటిపై జిల్లా విద్యాశాఖ అధికా రులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల ఆవరణలోనే పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అలాగే 'టెక్నో', 'ఈ–టెక్నో', 'ఒలింపియాడ్', 'వరల్డ్' వంటి పేర్లతో తల్లిదండ్రులను ఆకర్షించే విధంగా ప్రచారం చేస్తున్న పాఠశాలలపై కూడా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. జిల్లాలో అనుమతులు లేకుండా నిర్వహణలో ఉన్న పాఠశాలలను గుర్తించి వాటి వివరాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యా లు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నప్పటికీ, జిల్లా విద్యాశాఖ అధికారులు వారికి అండగా నిలుస్తున్నారని ఆరోపించిన మణికంఠ రెడ్డి, కరీంనగర్ డీఈఓ, ఎంఈఓలపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై ఐటీ దాడులు నిర్వహించి అక్రమంగా సంపాదించిన సొమ్మును ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే ప్రైవేట్ పాఠశాలలపై సమగ్ర విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డీఈఓ ఛాంబర్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నునవత్ శ్రీనివాస్ నాయక్, జిల్లా ఆఫీస్ బేరర్ లద్దునూరి విష్ణు, నగర నాయకులు కసిరెడ్డి సందీప్ రెడ్డి, జ్యోష్ణ, అనోష్, బోయినీ విష్ణు, నాగుల జ్ఞానేశ్వర్, నవీన్, నిఖిల్ పాల్గొన్నారు.

# అల్కాపూర్‌లో గ్యాస్ సిలిండర్ పేలుడు.. మహిళకు గాయాలు

రాజేంద్రనగర్, (జనంసాక్షి) నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని అల్కాపూర్ టౌన్‌షిప్, రోడ్ నెం. 9లో ఉన్న ఓ ఇండిపెండెంట్ హౌస్ మూడో అంతస్తులో శుక్రవారం ఎచ్పి గ్యాస్ సిలిండర్ పేలింది. పేలుడు ధాటికి బాల్కనీ గోడ కొంత భాగం కూలిపడి ఇంట్లో నివాసముంటున్న గీత (40) కాళ్లపై శిథిలాలు పడటంతో ఆమెకు గాయాలయ్యాయి. వెంటనే భూమి ఆస్పత్రికి తరలించి చికిత్స అందించగా, ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.
సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఘటనకు గల కారణాలపై అధికారులు విచారణ చేపట్టారు.

# దాచుకున్న సొమ్ముకు అడ్డంకులా..?

- జీపీఎఫ్ అందక ఉద్యోగుల గోస
- మూడు నెలలుగా పనిచేయని ఏజీ వెబ్‌సైట్
- రిటైరైనా అందని ఫైనల్ సెటిల్‌మెంట్లు
- రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆవేదన



**మల్కాజిగిరి జూన్ 19 (జనంసాక్షి) :** తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు తాము దాచుకున్న సొంత జనరల్ ప్రావిడెంట్ ఫండ్ సొమ్మును అత్యవసర అవసరాలకు వాడుకోలేక, కనీసం అకౌంట్ స్టేట్‌మెంట్లు కూడా చూసుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మల్కాజిగిరి ప్రధాన కార్యదర్శి కస్తూరి రవీందర్ ఆరోపించారు. గత మూడు నెలలుగా ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ వెబ్‌సైట్ పనిచేయకపోవడమే దీనికి ప్రధాన కారణమన్నారు. రాష్ట్రంలో నెలకొన్న నిధుల కొరత కారణంగా, ఉద్యోగులు ఎక్కడ లోన్లు లేదా పార్షియల్ విత్‌డ్రాయల్స్ కోసం దరఖాస్తు చేసుకుంటారోననే ఉద్దేశంతో, ప్రభుత్వం కావాలనే వెబ్‌సైట్‌ను బ్లాక్ చేసిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల అత్యవసర వైద్య ఖర్చులు, పిల్లల చదువులు, ఇతర కుటుంబ అవసరాలకు డబ్బు తీసే వీలు లేక ఉద్యోగులు తీవ్ర సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులు రిటైర్ అయ్యి రెండేళ్లు గడుస్తున్నా వారికి రావాల్సిన జీపీఎఫ్ ఫైనల్ సెటిల్‌మెంట్ వంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందడం లేదని కస్తూరి రవీందర్ తెలిపారు. జీవితాంతం ప్రభుత్వానికి సేవలందించి, వృద్ధాప్యంలో ప్రశాంతంగా గడపాల్సిన రిటైర్డ్ ఉద్యోగులు.. ఈ జాప్యం వల్ల తీవ్ర మానసిక, ఆర్థిక వేదన అనుభవిస్తున్నారని మండిపడ్డారు. నిలిచిపోయిన పీఏజీ వెబ్‌సైట్‌ను తక్షణమే పునరుద్ధరించి, ఉద్యోగులు తమ జీపీఎఫ్ షీట్లను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించాలని, రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన జీపీఎఫ్ ఫైనల్ సెటిల్‌మెంట్‌తో పాటు అన్ని రకాల రిటైర్మెంట్ బెనిఫిట్లను ఒకే విడతలో విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా సానుకూలంగా స్పందించి సాంకేతిక, ఆర్థిక అడ్డంకులను తొలగించాలని, ఉద్యోగులు కష్టపడి దాచుకున్న సొమ్మును వారికి సకాలంలో అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

### షాపులో కస్టమర్‌లా వచ్చి
# చోరీకి పాల్పడిన యువకుడు

- 37 గ్రాముల బంగారు మంగళసూత్రం అపహరణ
- సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా నిందితుడి కోసం గాలింపు
- పెరుగుతున్న చైన్‌స్నాచింగ్ ఘటనలపై ప్రజల్లో ఆందోళన



**ఉప్పల్, జూన్ 19 (జనంసాక్షి):** ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామంతపూర్ ప్రాంతంలో పట్టపగలు జరిగిన చైన్‌స్నాచింగ్ ఘటన స్థానికంగా కలకలం రేపింది. కాస్మోటిక్స్ దుకాణానికి కస్టమర్‌లా వచ్చిన ఓ యువకుడు మహిళా ఉద్యోగిని మాటల్లో పెట్టి ఆమె మెడలో ఉన్న బంగారు మంగళసూత్రాన్ని లాక్కొని పరారయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, రామంతపూర్‌లోని ఓ కాస్మోటిక్స్ దుకాణంలో మహిళా ఉద్యోగి విధులు నిర్వహిస్తున్న సమయంలో ఓ యువకుడు షాపులోకి వచ్చాడు. ఫేస్‌వాష్ కావాలని అడిగి వివిధ రకాల ఉత్పత్తుల గురించి ఆరా తీశాడు. తాను నిజమైన కస్టమర్ అనే నమ్మకం కలిగేలా కొంతసేపు మాట్లాడిన అనంతరం, ఉద్యోగి వస్తువులు చూపిస్తున్న సమయంలో ఒక్కసారిగా ఆమె మెడలో ఉన్న సుమారు 37 గ్రాముల బంగారు మంగళసూత్రాన్ని బలవంతంగా లాక్కున్నాడు. అనూహ్యంగా జరిగిన ఈ ఘటనతో మహిళ ఒక్కసారిగా షాక్‌కు గురైంది. ఆమె తేరుకుని కేకలు వేయడంతో స్థానికులు బయటకు వచ్చి దుండగుడిని వెంబడించే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే అతడు అక్కడి నుంచి పారిపోయినట్లు తెలుస్తోంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనాస్థల పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను సేకరించి నిందితుడి కదలికలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ఘటనకు ముందు, తర్వాత అతడు వెళ్లిన మార్గాలపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు సమాచారం. ఈ ఘటనతో రామంతపూర్ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపార సంస్థలు, దుకాణాల వద్ద భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయడంతో పాటు పోలీసు పెట్రోలింగ్‌ను పెంచాలని స్థానికులు కోరుతున్నారు. నిందితుడిని త్వరగా అరెస్టు చేసి చోరీకి గురైన బంగారు మంగళసూత్రాన్ని బాధితురాలికి తిరిగి అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు.

# అక్షరమే జీవితాలను మార్చగలదు

### బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్



**మర్రిగూడ, జూన్ 19:** విద్యకు, విజ్ఞానానికి దూరం కాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ అక్షరాస్యతను అలవర్చుకోవాలని, అక్షరమే జీవితాలను మార్చగల శక్తి కలిగి ఉందని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం మర్రి గూడ మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించాలని అవగాహన కల్పిస్తూ తల్వార్ తాత (కొప్పు సంజీవ్) చేపట్టిన పాదయాత్ర ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌లను ఆదర్శంగా తీసుకుని బహుజనులు విద్యాభివృద్ధి దిశగా ముందుకు సాగాలని సూచించారు. మహిళా విద్య ద్వారానే నిజమైన సాధికారత సాధ్యమవుతుందని జ్యోతిరావు పూలే నిరూపించారని ఆయన పేర్కొన్నారు. ఒకప్పుడు విద్యను అభ్యసించకుండా అనేక ఆంక్షలు ఉండేవని, నేడు శాస్త్రీయ విజ్ఞానాన్ని అందిపుచ్చుకునే స్థాయికి సమాజం ఎదిగిందన్నారు. నీరు, గాలి, భూమి అందరికీ సమానమైనట్లే విద్య కూడా ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు అని స్పష్టం చేశారు. తల్వార్ తాత చేపట్టిన పాదయాత్ర భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని కొనియాడిన ఆయన, విద్యారంగంలో ప్రతి ఒక్కరూ ముందుకు సాగేలా తాను కూడా తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. అనంతరం తల్వార్ తాతతో పాటు జాజుల శ్రీనివాస్ గౌడ్‌ను పలువురు సన్మానించారు. కాగా, గత నెల 28 నుంచి ఈ నెల 19 వరకు సాగిన ఈ పాదయాత్రలో ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు పెంచడం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండడం, హెల్మెట్ ధరించి ప్రయాణించడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడం అభినందనీయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాజాపేట తండా, కొట్టాల గ్రామాల సర్పంచ్‌లు కొడాల వెంకట్ రెడ్డి, కల్లేటి లింగయ్య, బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కుక్కుడపు ముత్యాలు గౌడ్, సింగపంగ జాని, జీడిమడ్ల రాజు, శంకు యాదవ్, దప్పు రమేష్, కురుపాటి కరుణాకర్, నక్క నాగరాజు, తాళ్లపల్లి దివ్య, నాగిళ్ల సుమన్, రేపాక కృష్ణ, ఊరిపక్క సాయికుమార్, సల్వోజు వెంకటాచారి, రాజేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులను కుటుంబ సభ్యులుగా భావించి సేవలందించాలి

### పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి

**పెద్దపల్లి, జూన్ 19(జనంసాక్షి) :** రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు, వార్షిక తనిఖీలలో భాగంగా శుక్రవారం పెద్ద పల్లి జోన్ మహిళా పోలీస్ స్టేషన్‌ను పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మహిళా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న డీసీపీకి స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రమేష్ బాబు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంత రం డీసీపీ పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించారు. ముఖ్యంగా రిసెప్షన్ కేంద్రాన్ని సందర్శించి అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో ఎలా వ్యవహరిస్తున్నారు, వారి సమస్యలను ఎలా స్వీకరిస్తున్నారు, ఫిర్యాదుల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులు పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారికి ఆత్మీయత కలిగేలా, కుటుంబ సభ్యులుగా భావించి మర్యాదపూర్వకంగా సేవలందించాలని సూచించారు. అనంతరం రిసెప్షన్ రికార్డులతో పాటు ఇతర స్టేషన్ రికార్డులను పరిశీలించి, వాటి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఫిర్యాదు నమోదు నుంచి చార్జ్‌షీట్ దాఖలు వరకు ప్రతి అంశాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. నిర్ణీత గడువులోగా దర్యాప్తు పూర్తి చేసి నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరచాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మహిళలకు సంబంధించిన కేసుల వివరాలను తెలుసుకుని, వాటి దర్యాప్తు పురోగతిని సమీక్షించారు.

# తెలంగాణలో మూడు రోజులు రిజిస్ట్రేషన్లు నిలిపివేత

- సర్వర్ అప్‌గ్రేడేషన్‌తో సేవల్లో భారీ మార్పులు!
- జూన్ 26-28 వరకు రిజిస్ట్రేషన్ కార్యాలయాలు బంద్




**నల్లగొండ ,జూన్19 (జనంసాక్షి) :**
తెలంగాణ రాష్ట్రంలో భూములు, ఇళ్లు, స్థలాల కొనుగోలు–అమ్మకాలు, ఇతర ఆస్తుల రిజిస్ట్రేషన్ పనులు నిర్వహించుకునే ప్రజలకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కీలక ప్రకటన చేసింది. రాష్ట్రవ్యాప్తంగా జూన్ 26 నుంచి 28వ తేదీ వరకు మూడు రోజుల పాటు రిజిస్ట్రేషన్ సేవలను పూర్తిగా నిలిపివేయనున్నట్లు వెల్లడించింది. సర్వర్ అప్‌గ్రేడేషన్, సాంకేతిక మార్పులు, డేటా సమీకరణ ప్రక్రియ చేపట్టనున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.
రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ శాఖలో డిజిటల్ సేవలను మరింత వేగవంతంగా, పారదర్శకంగా అందించేందుకు ప్రభుత్వం ఆధునిక సాంకేతికతను అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ప్రస్తుతం ఉపయోగిస్తున్న సాఫ్ట్‌వేర్ వ్యవస్థను అప్‌డేట్ చేయడంతో పాటు సర్వర్ల సామర్థ్యాన్ని పెంచే కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్, పత్రాల నమోదు, ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్లు, మార్కెట్ విలువ వివరాలు వంటి సేవలు తాత్కాలికంగా అందుబాటులో ఉండవు

# సింగరేణి ప్రాంత వనరులు దోచుకుంటున్నారు

- కాంగ్రెస్ పాలనలో కార్మికులు, కర్షకులకు తీవ్ర ఇబ్బందులు
- రైతు భరోసా, యూరియా ఇవ్వడానికి ప్రభుత్వం ఫెయిల్
- కోల్ బెల్ట్ ప్రాంత లీడర్లు ప్రజల సమస్యలు పక్కన పెట్టి ఇసుక, మట్టి, బూడిద దందా చేస్తున్నరు
- రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా మేమే ఎదగబోతున్నాం
- తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**పెద్దపల్లి, జూన్ 19 (జనంసాక్షి) :** గత నాలుగు రోజులుగా తెలంగాణ రక్షణ సేవ పార్టీ వ్యవస్థాపకులు కల్వకుంట్ల కవిత బాయిబాట కార్యక్రమంలో భాగంగా చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల,ఆసిఫాబాద్, కాగజ్ నగర్, రామగుండం, మంథని లోని బొగ్గుబాయిలను సందర్శించిన అనంతరం పెద్దపల్లి లోని బస్టాండ్ ప్రాంతంలో స్థాపించిన జెండాను ఆవిష్కరించారు. తర్వాత ఒగ్గు కళాకారుల నృత్యాలతో అయ్యప్ప టెంపుల్ సమీపంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలవేసి ర్యాలీ అనంతరం ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు మేము అటు బొగ్గుగని కార్మికులు, ఇటు ప్రజల దగ్గరకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకున్నామనీ ఇక్కడ జిల్లా స్థాయిలో శ్రీధర్ బాబు, ప్రేమ్ సాగర్ రావు దోపిడికి పాల్పడుతున్నారనీ రాష్ట్ర స్థాయిలో వీరికి భట్టి విక్రమార్క తోడయ్యారు. ఈ ముగ్గురు ప్రజల సమస్యలను వదిలి అక్రమ సంపాదన మీద పడ్డారు. ఈ కాంగ్రెస్ పార్టీకి మనం ఓటు వేస్తే వాళ్ల ఫ్యామిలీ మనల్ని బోనస్ గా పాలిస్తోందన్నారు. భట్టి విక్రమార్కవాళ్ల కుటుంబ సభ్యులు అధికారులను, కాంట్రాక్టర్లను బెదిరిస్తూ లంచం అడుగుతున్నారనీ బై వన్ గెట్ వన్ అన్నట్లుగా ఈ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే మన పరిస్థితి తయారైందనీ తెలిపారు. ప్రజలను పట్టించుకోకుండా ఇసుక, మట్టి, బూడిద దందా చేస్తున్నారు. రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. మేము వస్తుంటే సంతోష్ అనే యువరైతు తమ వడ్లను సొంతంగా లారీ వేసుకొని మిల్లుకు తీసుకెళ్లాడు. అక్కడ మిల్లర్లు వడ్లు కొనకపోవటంతో ఆత్మహత్యాయత్నం చేశాడన్నారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి చాలా దయనీయంగా మారిందన్నా రు. పైగా కేబినెట్ మీటింగ్‌లో ఏడు రకాల వడ్లకే బోనస్ ఇస్తామని చెబుతున్నారు. ఎన్నికలకు ముందు మాత్రం దొడ్డు, సన్న అన్ని రకాల వడ్లకు బోనస్ ఇస్తామని చెప్పారు. ఇప్పుడు మాత్ర ఏడు రకాల వడ్లకు మాత్రమే అని అంటున్నారు. యాసంగికి రెండు ఎకరాలకే రైతు భరోసా వేశారు. అసలు మీ పాలసీ రెండు ఎకరాలకే ఇస్తారా? అనేది చెప్పాలి? అని ప్రశ్నించారు. ఇక యూరియ యాప్ అని పెట్టి రైతులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నారు. మే లో రావాల్సిన యూరియ రాకపోతే వచ్చే నెల ఢిల్లీకి పోతామని మంత్రి సీతక్కసృష్టికి తీసుకుపోతామన్నారు అంటే రైతుల మీద ఈ ప్రభుత్వానికి ఎంత ప్రేమ ఉందో అర్థమవుతోంది. డిపెండెంట్ ఉద్యోగాలు, రైతు భరోసాను పబ్లిక్ మీటింగ్‌ల కోసం వాడుకుంటున్నారు. ఓపెన్ కాస్ట్ కారణంగా ఎస్సారెస్పీ నుంచి వచ్చే కాలువ పాడైందనీ దానిని మరమ్మత్తులు చేసి అక్కడి రైతులకు నీరు అందించాలని డిమాండ్ చేశారు. రామగుండంలో పొలుష్యన్ ఢిల్లీలో కన్నా భయంకరంగా ఉంది. ఈ ప్రాంతంలో గోదావరి నీళ్లు తాగితే క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని అంటున్నారు. ఈ సమస్యలపై మంత్రి వెంటనే దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో ఎన్టీపీసీ (ఆర్ ఎఫ్ సి ఎల్)సహా కేంద్ర సంస్థలు ఉన్నాయి. కార్మికుల కుటుంబాల కోసం ఈఎస్ఐ హాస్పిటల్ నిర్మించాలని పెద్దపల్లి ఎంపీకృషి చేయాలనీ గుర్తు చేశారు. మొన్నటి మున్సిపల్ ఎన్నికల్లో మేము పార్టీ పెట్టకముందే సింహం గుర్తు మీద పోటీ చేశాం. ఇక్కడి ప్రజలు మమ్మల్ని ఆదరించి అధికార పక్షం తర్వాత అన్ని ఎక్కువ సీట్లు ఇచ్చారనీ ఇక్కడి ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి బోడ జనార్ధన్,( హెచ్ ఎం ఎస్) రాష్ట్ర కార్యదర్శి రియాజ్ అహ్మద్, నియోజకవర్గ ఇన్చార్జ్ సలేంద్ర కొమురయ్య యాదవ్, మాజీ ఎంపీపీ బాలాజీ రావు, నాయకులు వీరేందర్, సీతారాం, పలువురు మహిళా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# హైకోర్టు స్టే ఉన్నా ఖాకీల పహారాలో బలవంతపు భూసేకరణా?!

- ఎన్నికల ముందు 'రద్దు చేస్తాం' అని.. ఇప్పుడు రైతుల గొంతు కోస్తారా?
- రేవంత్ సర్కార్ రాజ్యాంగ ఉల్లంఘనలపై రాహుల్ గాంధీతో చర్చిస్తా
- సుప్రీంకోర్టు లాయర్ ప్రియాంక కక్కర్ ధ్వజం
- యాచారం మండలంలో ఫార్మాసిటీ బాధిత రైతుల కన్నీటి గాథలు ఆలకించిన సుప్రీంకోర్టు న్యాయవాది



**యాచారం, జూన్ 18 (జనం సాక్షి) :** యాచారం మండల పరిధిలోని కురిమిద్ద, నానక్‌నగర్, తాడిపర్తి, మేడిపల్లి గ్రామాల్లో ఫార్మాసిటీ/ఫ్యూచర్ సిటీ ప్రతిపాదిత భూములను, బాధిత రైతులను సుప్రీంకోర్టు లాయర్ ప్రియాంక కక్కర్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా నాలు గు గ్రామాల రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి, తమ భూములను బలవంతం గా లాక్కునేం దుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను, పోలీసులు మరియు అధికారుల వేధింపులను ఆమెకు వివరించి ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల అభిప్రాయాలను తీసుకున్న అనంతరం ప్రియాంక కక్కర్ మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు తీవ్ర విచారకరమ న్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు ధర్నా చౌక్ వేదికగా రేవంత్ రెడ్డి స్వయంగా రైతులకు ఇచ్చిన హామీలను ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. "కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఫార్మాసిటీని రద్దు చేస్తాం.. మీ భూములు ఎవరికీ ఇవ్వకండి.. మన ప్రభుత్వం వచ్చాక మీ భూములను మీకే ఉంచు తాం" అని నాడు నమ్మబలికిన రేవంత్ రెడ్డి, నేడు ముఖ్యమంత్రి అయ్యాక మాట తప్పడం దారుణమన్నారు. హైకోర్టులో స్పష్టమైన స్టే (మధ్యంతర ఉత్తర్వులు) ఉన్నప్పటికీ, రాజ్యాంగాన్ని మరియు చట్టాలను బేఖాతరు చేస్తూ పంట పొలాల్లోకి పోలీసులను పంపి బలవంతంగా భూసేకరణకు పాల్పడటం తీవ్ర అప్రజాస్వామికమని ఆమె మండిపడ్డారు. ఒకవైపు ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా 'రాజ్యాంగాన్ని రక్షిస్తాం' అని నినదిస్తుంటే, ఇక్కడ తెలంగాణలో ఆయన సొంత పార్టీ ప్రభుత్వమే రాజ్యాంగ విరుద్ధంగా రైతుల పొలాలను చదును చేస్తూ, సరిహద్దు రాళ్లను తొలగిస్తూ దౌర్జన్యం చేయడం సిగ్గుచేటన్నారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఈ ఘోర అన్యాయాన్ని, అధికారుల అక్రమాలను తాను నేరుగా రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లి చర్చిస్తానని రైతులకు ప్రియాంక కక్కర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫార్మాసిటీ పోరాట కమిటీ సమన్వయకర్త కవుల సరస్వతి, కమిటీ సభ్యులు కాన మౌని, గణేష్, సందీప్ రెడ్డి, దేవోజి, కొండల్ రెడ్డి, లింగం, మైపాల్ రెడ్డితో పాటు కురిమిద్ద, నానక్‌నగర్, తాడిపర్తి, మేడిపల్లి గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులు, మహిళలు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

# హోటళ్లు, పానీపూరి, చాట్ బండ్లపై ఫుడ్ సేఫ్టీ దాడి

- నాణ్యత లేని ఆహార పదార్థాల విక్రయాలకు బ్రేక్
- తాత్కాలికంగా మూసివేసిన సెంటర్లు
- ప్రజల ఆరోగ్యం కాపాడటమే లక్ష్యం
- జిల్లావ్యాప్తంగా తనిఖీలు కొనసాగించనున్నారు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 19 (జనంసాక్షి):** వేములవాడలో ఫుడ్ సేఫ్టీ శాఖ ఆధ్వర్యంలో పానీపూరి, చాట్ బండ్లు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఫుడ్ సేఫ్టీ అధికారి అనూష, ట్రైనీ కలెక్టర్ నికిత, ఆర్డీవో కె.ఎస్.బి. కుమారి, మున్సిపల్ కమిషనర్ లోకేష్ తో కలిసి స్వయంగా తనిఖీల్లో పాల్గొని నాణ్యతలేని ఆహార పదార్థాల విక్రయాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టారు.

గత మూడు రోజుల క్రితం తంగళ్ళపల్లి మండల కేంద్రంలో పానీపూరి తిని పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన జిల్లా వ్యాప్తంగా ఆందోళన కలిగించిన నేపథ్యంలో అప్రమత్తమైన అధికారులు శుక్రవారం సాయంత్రం వేములవాడలోని పానీపూరి, చాట్ బండ్లు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్ ఫుడ్ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ అధికారి అనూష విలేకరులతో మాట్లాడుతూ వేములవాడలో సుమారు 10 సెంటర్లను తనిఖీ చేయడం జరిగిందని, ఈ తనిఖీల్లో ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, నిల్వ విధానం, తాగునీటి వినియోగం, తయారీ ప్రక్రియలను క్షుణ్ణంగా పరిశీలించారన్నారు.

కొన్ని చోట్ల పరిశుభ్రత ప్రమాణాలు పాటించకపోవడం, నాణ్యత లేని ఆహార పదార్థాలు విక్రయిస్తున్నట్లు గుర్తించి నిర్వాహకులకు హెచ్చరికలు జారీ చేశారు. పలు పానీపూరి, చాట్ బండ్లలో లోపాలు గుర్తించడంతో వాటిని తాత్కాలికంగా మూసివేయించి, నిబంధనలు పాటించిన తర్వాత మాత్రమే వ్యాపారాలు కొనసాగించాలని ఆదేశించారు. ప్రజల ఆరోగ్యంతో రాజీ పడని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు ఉల్లంఘించే హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, ఫుడ్ స్టాళ్లపై జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే లైసెన్సులు రద్దు చేసే చర్యలు చేపడతామని హెచ్చరించారు.

ప్రజలకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించడమే తమ లక్ష్యమన్నారు. జిల్లావ్యాప్తంగా ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, ఆహార నాణ్యతపై ఫిర్యాదులు ఉంటే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని ఆమె ప్రజలకు సూచించారు.

## చదువుతోనే సమాజ అభివృద్ధి

- చెడువ్యాసనాలకి దూరంగ ఉండాలి
- పెద్దపల్లి సిఐ ప్రవీణ్ కుమార్

**పెద్దపల్లి,జూన్ 19(జనంసాక్షి) :** విద్యార్థులు చదువుతో పాటు సమాజ అభివృద్ధికి పాటు పడాలని పెద్దపల్లి సిఐ ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ బాలుర పాఠశాల లో నశా ముక్త్ భారత్ అభియాన్- నశా ముక్త్ భారత్ సప్తః మధ్యపానం మరియు మత్తు పదార్థాల నిర్మూలనలో భాగంగా విద్యార్థులకు అవగాన కార్యక్రమంలో ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. మాధక ద్రవ్యాల నిర్మూలన విద్యార్థుల చేతుల్లో ఉందని దానికి బానిసలు కావొద్దని సూచించారు. పిల్లలకు తల్లిదండ్రులకు స్నేహ పూర్వక వాతావరణం ఉండాలని, మంచి చెడులు మాట్లాడుకుంటేనే పిల్లల భవిష్యత్ చెడు దారి పడకుండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం లో లో హెడ్ మాస్టర్ లక్ష్మణ్, డి-అడిక్షన్ సెంటర్ కో-ఆర్డినేటర్ శ్యామల మరియు టీమ్ సిబ్బంది మరియు (డి డబ్ల్యు ఓ) సిబ్బంది పాల్గొన్నారు.

## మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ ఆత్మహత్య

- గొడ్డలితో తలకు గాయాలు చేసుకుని మృతి చెందిన మహిళ
- కుటుంబ సభ్యులకు ఎలాంటి అనుమానాలు లేవని పోలీసులకు ఫిర్యాదు

**కరీంనగర్ టౌన్, జూన్ 19 (జనం సాక్షి) :** కరీంనగర్ పట్టణంలోని వావిలాల ప్రాంతంలో మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులకు అందిన వివరాల ప్రకారం, వావిలాల ప్రాంతానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు వావిలాల భూపాల్ రెడ్డి కుమార్తె వావిలాల సుధ గత కొంతకాలంగా మానసిక సమస్యలతో బాధపడుతోంది. ఆమెకు గతంలో వైద్య చికిత్సలు అందించగా, ఇటీవల కూడా హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స చేయించి ఇంటికి తీసుకువచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇటీవలి కాలంలో ఆమె ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేయడం, అసహజంగా ప్రవర్తించడం వంటి లక్షణాలు కనిపించాయని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. కొన్ని రోజుల క్రితం గ్యాస్ స్టవ్, కిచెన్ చిమ్నీతో పాటు సెల్‌ఫోన్‌ను కూడా ధ్వంసం చేసినట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం ఇంట్లో ఉన్న సమయంలో సుధ ఇనుప గొడ్డలిని తీసుకుని తనను తాను గాయపరుచుకునేందుకు ప్రయత్నించిందని, అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ వినిపించుకోకుండా తన తలపై పలుమార్లు కొట్టుకున్నట్లు తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. తీవ్ర రక్తస్రావం కావడంతో ఆమె అక్కడికక్కడే కుప్పకూలిందని, అనంతరం మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మృతురాలి మరణంపై కుటుంబ సభ్యులకు ఎలాంటి అనుమానాలు లేవని ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు

## టాస్క్,డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన

**జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రాజశేఖర్**

**పెద్దపల్లి, జూన్ 19 (జనంసాక్షి) :** జిల్లాలోని నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలను కల్పించే లక్ష్యంతో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ టాస్క్, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ, ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ కార్యక్రమం ద్వారా ఎంపికైన అభ్యర్థులకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించడంతో పాటు, ప్రముఖ సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని, అభ్యర్థుల వయస్సు 18 నుండి 28 సంవత్సరాల మధ్య ఉండాలని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు జూన్ 22, ఉదయం 10:00 గంటలకు టాస్క్ ప్రాంతీయ కేంద్రం, పెద్దపల్లి ఆర్టీసీ బస్టాండ్ బస్ డిపో ప్రాంగణం పక్కన హాజరు కావాలని, మరిన్ని వివరాలకు 9154909057, 9959892960 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఊపిరితిత్తులు దెబ్బతిన్న రోగులకు 'ఎక్మో' సంజీవని

- కృత్రిమ గుండె-ఊపిరితిత్తుల వ్యవస్థతో ప్రాణాలు నిలుపుతోంది
- శ్వాసకోశ వైపల్యంలో అత్యాధునిక చికిత్సా విధానం
- లంగ్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు వారం వారాల వరకు భరోసా
- యశోద హాస్పిటల్‌లో అంతర్జాతీయ స్థాయి సదుపాయాలు



**కరీంనగర్ బ్యూరో, జూన్ 19 (జనంసాక్షి):** తీవ్రమైన శ్వాసకోశ సమస్యల లో, ఊపిరితిత్తులు పూర్తిగా దెబ్బతిని ప్రాణాపాయ స్థితికి చేరుకునే రోగులను కాపాడటంలో 'ఎక్మో' (కృత్రిమ గుండె-ఊపిరితిత్తుల పరికరం) విధానం ఒక సంజీవనిలా మారుతోందని హైదరాబాద్ సోమాజిగూడ యశోద హాస్పిటల్ కన్సల్టెంట్ ట్రాన్స్‌ప్లాంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ తపస్వి కృష్ణ కాత్రగడ్డ తెలిపారు. శుక్రవారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ అత్యంత సంక్లిష్టమైన వైద్య విధానం (ఎక్మో సపోర్ట్ విత్ లంగ్ ట్రాన్స్‌ప్లాంటేషన్) విశిష్టతను, మౌలిక సదుపాయాల వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని రోగులకు అంతర్జాతీయ స్థాయి క్రిటికల్ కేర్ వైద్య సదుపాయాలు ఏ విధంగా అందుబాటులోకి వచ్చాయో వివరించడానికి, చివరి దశ ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తుల్లో భరోసా నింపడానికి ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### ప్రాణం నిలిపే 'ఎక్మో' విధానం

చివరి దశ 'ఇంటర్‌స్టిషియల్ లంగ్ డిసీజ్' లేదా శ్వాసకోశ వైపల్యం వల్ల ఊపిరితిత్తులు రక్తానికి ఆక్సిజన్ను అందించే సామర్థ్యాన్ని పూర్తిగా కోల్పోయినప్పుడు ఈ 'వెనో-వినస్ ఎక్మో లైఫ్ సపోర్ట్' విధానాన్ని ఉపయోగిస్తామని డాక్టర్ తపస్వి వివరించారు. ఈ విధానంలో అత్యాధునిక యంత్రం శరీరం వెలుపల ఉంటూ కృత్రిమ ఊపిరితిత్తుల వ్యవస్థలా పనిచేస్తుందన్నారు. ఇది శరీరం నుండి ఆక్సిజన్ లేని చెడు రక్తాన్ని గ్రహించి, దానికి పూర్తి ఆక్సిజన్ను అందించి, కార్బన్ డయాక్సైడ్‌ను తొలగించి మళ్లీ శరీరంలోకి పంపుతుంది.

### ఊపిరితిత్తుల మార్పిడికి భరోసా

ఊపిరితిత్తుల మార్పిడి అవసరమైన రోగులకు దాత దొరికేవరకు ప్రాణాలను నిలిపి ఉంచడానికి ఈ సాంకేతిక విధానం అత్యంత కీలకమైనదని డాక్టర్ తపస్వి వివరించారు. ఈ ఎక్మో విధానంలో ఉన్న రోగులకు ఊపిరితిత్తుల మార్పిడి (డబుల్ లంగ్ ట్రాన్స్‌ప్లాంట్) చేయడం వైద్యశాస్త్రంలోనే అత్యంత సంక్లిష్టమైన ప్రక్రియ అని, రక్తం గడ్డకట్టడం, అధిక రక్తస్రావం వంటి తీవ్రమైన సాంకేతిక ప్రమాదాలను అధిగమిస్తూ గుండె-ఊపిరితిత్తుల నిపుణులు, అనస్థీషియా వైద్యులు, ఐసీయూ నర్సింగ్ బృందం సెకన్ల సమన్వయంతో వ్యవహరించి ఈ సుదీర్ఘ శస్త్రచికిత్స ప్రక్రియను విజయవంతం చేయాల్సి ఉంటుందన్నారు. శస్త్రచికిత్స అనంతరం అందించే ప్రత్యేక అంతర్జాతీయ క్రిటికల్ కేర్ ప్రొటోకాల్స్ ద్వారా రోగులను ఎక్మో యంత్రం, వెంటిలేటర్ల నుండి సురక్షితంగా తొలగించి, కొత్త ఊపిరితిత్తులతో స్వయంగా శ్వాస తీసుకునేలా చేస్తామని, ఆ తర్వాత క్రియాశీల శారీరక వ్యాయామాల ప్రక్రియ ద్వారా రోగులు సాధారణ జీవితాన్ని గడిపేలా ఈ చికిత్సా విధానం తోడ్పడుతుందని డాక్టర్ తపస్వి వివరించారు. ఈ విలేఖరుల సమావేశంలో యశోద హాస్పిటల్ మార్కెటింగ్ విభాగం సీనియర్ మేనేజర్ సుధీర్ రెడ్డి, మేనేజర్ హరీష్ రెడ్డి, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆలయ ఉద్యోగులు వర్సెస్ వ్యాపారి

- ఒకరిపై ఒకరు పోలీస్ స్టేషన్లో పరస్పర ఫిర్యాదులు
- వ్యాపారి ముత్యం బెదిరింపులకు పాల్పడ్డాడంటూ ఉద్యోగుల ఫిర్యాదు
- కులం పేరుతో ఉద్యోగులు దూషించారని వ్యాపారి ముత్యం ఫిర్యాదు





**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూన్ 19 (జనంసాక్షి) :** వేములవాడ భీమేశ్వర స్వామి ఆలయం ముందు కొబ్బరికాయలు అమ్ముకుంటూ జీవనోపాధి పొందుతున్న వ్యాపారి మరియు ఆలయ ఉద్యోగులు ఒకరిపై ఒకరు పరస్పరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసుకున్న సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. భీమేశ్వర స్వామి ఆలయం ముందు ఓ షెటరు అద్దెకి తీసుకొని వేములవాడకు చెందిన కొండ్లేపు ముత్యం కొబ్బరికాయలు విక్రయిస్తున్నాడు. దీంతోపాటు మున్సిపల్ రోడ్డుపై దేవుడి ఫోటోలు ఇతర సామాగ్రి పెట్టి విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో ఆలయ ఈవో రమాదేవి ఆదేశాలతో సుమారు 20 మంది ఆలయ ఉద్యోగులు,ఎస్పీఎఫ్ సిబ్బంది తన దుకాణాల్లోకి వచ్చి కులం పేరుతో దూషించారని బాధితుడు ముత్యం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా ముత్యం దేవస్థానం ఆవరణలో అక్రమంగా మూడు షెడ్లు, నిర్మాణాలు చేపట్టడాని వీటిని తొలగించాలని వెళ్ళిన ఆలయ ఉద్యోగులతో దురుసుగా ప్రవర్తించాడని ఆలయ ఉద్యోగులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వర్గాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవడము వేములవాడలో చర్చనీయాంశంగా మారింది.

# చెంచు కుటుంబాల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు

- సంక్షేమ పథకాలన్నీ అందేలా అధికారులకు కలెక్టర్ ఆదేశం
- పారుపల్లి చెంచు గూడెంలో గృహాలు, జీవన పరిస్థితుల పరిశీలన
- పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణం జూలై 31లోగా పూర్తి చేయాలని ఆదేశం
- ముత్తారం తహసీల్దార్ కార్యాలయ భవన పనులు వేగవంతం చేయాలని సూచన



**పెద్దపల్లి, జూన్ 19(జనంసాక్షి) :** సంచార జీవులైన చెంచు కుటుంబాలకు అవసరమైన అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి తెలిపారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం లిముత్తారం మండలంలోని పారుపల్లి గ్రామంలో చెంచుల నివాస గృహాలను, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను, ముత్తారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ నిర్మాణ పనులను, ధర్యాపూర్ మోడల్ స్కూల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పారుపల్లి గ్రామంలోని సంచార జీవులైన 15 చెంచు కుటుంబాల వారికి అవసరమైన ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు, అర్హులైన వారికి పెన్షన్లు ఇటీవల కలెక్టర్ చెరువతో అధికారులు అందించారు. పారుపల్లి మండల పరిషత్ ప్రైమరీ స్కూల్లో కలెక్టర్ చేతుల మీదుగా విద్యార్థులకు అడ్మిషన్లు అందించారు, అర్హులైన చెంచు కుటుంబాలకు కలెక్టర్ ప్రత్యేక నిధుల ద్వారా షెడ్ల నిర్మాణం పూర్తి చేశారు. చెంచు కుటుంబాల కోసం ఇప్పటికే నిర్మించిన 10 గృహాలను పరిశీలించిన కలెక్టర్, వారి జీవన ప్రమాణాల మెరుగుదలకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చేపడుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేసి జూలై 31 నాటికి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముత్తారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ధర్యాపూర్ మోడల్ స్కూల్‌ను సందర్శించిన కలెక్టర్, పాఠశాల ఎదురుగా ఉన్న ప్రభుత్వ భూమిని లెవెలింగ్ చేసి విద్యా అవసరాలకు అనుగుణంగా వినియోగించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ముత్తారం తహసిల్దార్ మధుసూదన్ రెడ్డి, ఎంపీడీవో సురేష్, ఏఈలు, డిఇలు, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# దేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి, ప్రజలపై భారం వేస్తున్న మోడీ ప్రభుత్వం

- ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసేందుకు కేంద్రం కుట్ర
- ప్రభుత్వం వెంటనే మొక్కజొన్న ధాన్యం డబ్బులను చెల్లించాలి
- సిపిఐ నిర్మాణాన్ని పెంచి, ప్రజాసంఘాలను బలోపేతం చేయాలి
- సిపిఐ సీనియర్ నేత మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి



**చిగురుమామిడి జూన్ 19(జనంసాక్షి):** భారత దేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్టివేయడానికి ప్రధాని నరేంద్ర మోడీ కారణమని,అప్పుల భారాన్ని,ధరల భారాన్ని మోడీ ప్రజలపై వేస్తున్నాడని సిపిఐ సీనియర్ నాయకులు,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడిలో సిపిఐ మండల కౌన్సిల్ సేవ్స్ సమావేశం తమ్మిశెట్టి రవీందర్ అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సామాన్య ప్రజలపై రోజు రోజుకు పెనుభారం మోపుతుందని,కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి దేశానికి 55లక్షల కోట్లకు పైగా అప్పులు ఉంటే 12సంవత్సరాలలో దానికి నాలుగింతలు పెరిగి దాదాపుగా 214లక్షల కోట్లకు పైగా అప్పులు చేసిన మోడీ ప్రభుత్వం ప్రజలపై అడ్డగోలుగా పన్నుల భారం వేస్తుందని,రాష్ట్రంలోని బీజేపీ ఎంపీలు ధరల పెరుగుదలను చూస్తూ ఉన్నారే తప్పా చేసిందేమీ లేదని,డబుల్ ఇంజన్ సర్కార్ వస్తాదని కళలు కంటున్న బీజేపీ 12ఏళ్లలో వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు డబుల్ చేసిందని, ఇంకా పెరుగుతాయని సంకేతాలు ఇవ్వడం సిగ్గుచేటన్నారు.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతుందని,కూలీల పొట్టలు కొడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల వద్ద కొనుగోలు చేసిన మొక్కజొన్న ధాన్యానికి డబ్బులు వెంటనే చెల్లించాలని వెంకటరెడ్డి కోరారు. మండలంలో పార్టీ,ప్రజా సంఘాల నిర్మాణాన్ని బలోపేతం చేయడం కోసం శ్రేణులు పనిచేయాలని, సమస్యలపై ఉద్యమాలు నిర్వహించాలని చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందె స్వామి,మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి,జిల్లా కౌన్సిల్ సభ్యులు అందె చిన్న స్వామి,బూడిద సదాశివ,మావురపు రాజు,తేరాల సత్యనారా యణ, ముల్కనూర్ ఉప సర్పంచ్ పైడిపల్లి వెంకటేష్,వార్డు సభ్యురాలు రాకం అంజవ్వ ,మహిళా సమాఖ్య నాయకురాలు కయ్యం సుజాత,వివిధ గ్రామాల శాఖ కార్యదర్శులు,కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మేఘమా..నీ జాడేక్కడ..?

- ముఖం చాటేసిన వరుణుడు
- రైతుల చూపు ఆకాశం వైపు

**జాడ లేని రుతుపవనాలు.. ఆందోళనలో రైతులు**

**సదాశివనగర్, జూన్19 (జనంసాక్షి) :** వర్షాకాలం ప్రారంభమై దాదాపు పది రోజులు దాటుతున్నా



వర్షాలు కురవకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ప్రతి ఏడాది ఈ సమయానికి రుతుపవనాలతో వర్షాలు పడి పొలాల్లో విత్తనాలు వేసే పనులు ఊపందుకున్నాయి. అయితే ఈసారి రుతుపవనాలు ముఖం చాటేయడంతో మండలంలోని రైతులు ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. మండలంలోని గ్రామాల్లో రైతులు ఇప్పటికే దుక్కులు దున్ని, విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకుని వాన కోసం ఎదురుచూస్తున్నారు. కొందరు రైతులు అప్పులు చేసి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేశారు. కానీ వర్షాలు లేకపోవడంతో సాగు పనులు ముందుకు సాగక, తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం పొలాలు దున్ని సిద్ధంగా ఉన్నప్పటికీ వాన జాడ కనిపించకపోవడంతో రైతుల్లో నిరాశ పెరుగుతోంది. మరోవైపు వర్షాలు ఆలస్యమైతే పంటల సాగు కాలం దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వరి, మొక్కజొన్న, పత్తి పంటలు సాగు చేసే రైతులు వర్షాభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రుతుపవనాలు ఆలస్యమవుతుండటంతో భూగర్భ జలాలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని వ్యవసాయ నిపుణులు పేర్కొంటున్నారు. వర్షాలు లేకపోతే పశువులకు మేత కొరత ఏర్పడటంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా వరుణుడు కరుణించి వర్షాలు కురిపించాలని, తమ పంటల ఆశలను నిలబెట్టాలని వేడుకుంటున్నారు.

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు





- దేశ సమగ్రత, ప్రజా సమస్యలకు రాహుల్ పోరాటం
- బీజేపీ వ్యతిరేక పోరాటం కొనసాగించాలి
- కరీంనగర్, వేములవాడలో సంబరాలు

**కరీంనగర్ బ్యూరో / రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 19 (జనంసాక్షి):** శుక్రవారం ఇందిరా చౌక్ వద్ద లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చొప్పదండి ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ, దేశ సమగ్రత కోసం, ప్రజల సాధకబాధకాలు తెలుసుకునేందుకు కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు భారత్ జోడో యాత్ర చేసి, భారతదేశ ప్రజల కష్టసుఖాలను తెలుసుకున్నారని అన్నారు. బీసీలకు కులగణన చేయాలని, 'జిత్నీ ఆబాదీ ఉత్నా హక్' అనే నినాదంతో దేశవ్యాప్తంగా పోరాడుతూ, తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దేశ ప్రజల కోసం పనిచేస్తున్నారని తెలిపారు. ఉన్నత చదువులు చదువుకున్న మహానాయకుడు మన రాహుల్ గాంధీ అని, రాబోయే రోజుల్లో దేశ ప్రజలు ఆయనను గౌరవప్రదమైన ప్రధానమంత్రిగా చూడాలని ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.

అదే సమయంలో వేములవాడలోని తెలంగాణ చౌక్‌లో కూడా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు, ప్రజలకు స్వీట్లు పంపిణీ చేసిన అనంతరం ప్రభుత్వ విప్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ దేశ ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న నాయకుడన్నారు. దేశంలో ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ఆయన చేస్తున్న కృషి ఆదర్శనీయమన్నారు. దేశంలో ఉన్న అసమానతలను రూపుమాపాలని రాహుల్ గాంధీ సంకల్పించారని, అందులో భాగంగా కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, మణిపూర్ నుంచి ముంబై వరకు పాదయాత్ర చేశారని గుర్తు చేశారు.

పాదయాత్ర చేస్తున్న సమయంలో పేద ప్రజల స్థితిగతులను తెలుసుకొని వారికి న్యాయం చేసే దిశగా అడుగులు వేస్తున్నారన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీపై రాజీ లేని పోరాటం చేస్తున్నారని, ప్రతి కాంగ్రెస్ కార్యకర్త రాహుల్ గాంధీని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి కార్యకర్త ఒక సైనికుడు లాగా పనిచేసి రాహుల్ గాంధీని ప్రధాని చేసే దిశగా కృషి చేయాలన్నారు.

ఈ కార్యక్రమాల్లో మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, ఆర్టీవో నెంబర్ పడాల రాహుల్, జిల్లా కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్ రెడ్డి, అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు కర్ర రాజశేఖర్, రజిత రెడ్డి, మహాలక్ష్మి, జ్యోతి రెడ్డి, స్వప్న, మాదా శీను, దుండిగళ్ళ మధు, పులి ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ తూము మధు, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ రాకేష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## విద్యా ప్రమాణాల పెంపులో రాష్ట్రంలో అగ్రగామిగా నిలిచిన పెద్దపల్లి జిల్లాకు రాష్ట్ర స్థాయి గుర్తింపు

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు విశిష్ట సన్మానం**

**పెద్దపల్లి,జూన్ 19(జనంసాక్షి) :** విద్యా ప్రమాణాల పెంపులో పెద్దపల్లి జిల్లాను రాష్ట్రంలో అగ్రగామిగా నిలిపినందుకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా విద్యాశాఖ అధికారులకు విశిష్ట గౌరవం లభించింది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్.బి. స్టేడియంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గౌరవ గవర్నర్,ముఖ్యమంత్రి చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ను సన్మానించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. విద్యా రంగంలో నాణ్యతాభివృద్ధి, విద్యార్థుల అభ్యాస ఫలితాల మెరుగుదల, పాఠశాలల సమర్థ నిర్వహణలో పెద్దపల్లి జిల్లాను రాష్ట్రంలో ముందంజలో నిలిపినందుకు ఈ గుర్తింపు లభించింది. వేలాది మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది సమక్షంలో ఈ సత్కార కార్యక్రమం ఘనంగా జరిగింది. జిల్లా విద్యా వ్యవస్థ అభివృద్ధికి కృషి చేసిన జిల్లా విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యా రంగ భాగస్వాములు మరియు సిబ్బంది అందరికీ జిల్లా యంత్రాంగం అభినందనలు తెలియజేసింది. జిల్లా విద్యా రంగ అభివృద్ధికి అందరూ సమష్టిగా కృషి చేయడం వల్లే ఈ గౌరవం సాధ్యమైందని,భవిష్యత్తులో కూడా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు.

# వనజ మృతి ఘటనపై ప్రభుత్వం సీరియస్

- ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాలతో తక్షణ విచారణ
- విధులకు గైర్హాజరైన మెడికల్ ఆఫీసర్ సస్పెండ్
- వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం చేసిన మరో ముగ్గురిపై చర్యలు



హైదరాబాద్ (జనంసాక్షి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని శంభునిగూడెం గ్రామానికి చెందిన గర్భిణి కుంజా వనజ మృతి ఘటనను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణించింది. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు ఘటనపై వెంటనే సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేయడంతో పాటు, బాధ్యులపై కఠిన చర్యలు ప్రారంభించింది. కుంజా వనజ గుండాల పీహెచ్‌సీలో గర్భిణిగా నమోదు చేసుకుని మాతా–శిశు ఆరోగ్య మార్గదర్శకాల ప్రకారం క్రమం తప్పకుండా గర్భధారణ పరీక్షలు చేయించుకున్నారు. జూన్ 13న పురిటి నొప్పులతో, అత్యంత క్లిష్ట పరిస్థితిలో పీహెచ్‌సీకి చేరుకున్న ఆమె మృత శిశువుకు జన్మనిచ్చారు. అనంతరం తీవ్రమైన రక్తస్రావం జరగడంతో వెంటనే ప్రాథమిక చికిత్స అందించి ఎల్లందు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు, అక్కడి నుంచి ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు అన్ని విధాలుగా చికిత్స అందించినప్పటికీ, తీవ్రమైన రక్తస్రావం కారణంగా హీమరేజిక్ షాక్, అనంతరం కార్డియాక్ అరెస్ట్ తో ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆరోగ్య శాఖ మంత్రి ఆదేశాల మేరకు జూన్ 17న భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారితో ప్రాథమిక విచారణ నిర్వహించగా, సమాచార వ్యవస్థ, కేసు నిర్వహణ, రిఫరల్ ప్రక్రియలో కొన్ని లోపాలు ఉన్నట్లు గుర్తించారు. తీవ్రమైన రక్తహీనత (హిమోగ్లోబిన్ సుమారు 3 గ్రాములు) ఉన్న గర్భిణిని ముందుగానే గుర్తించి వైద్యాధికారికి సమాచారం అందించడంలో, సకాలంలో రిఫర్ చేయడంలో విఫలమైన ఆశా కార్యకర్త శ్రీమతి మొకల్ల లక్ష్మి, ఎ ఎన్ ఎం పి. ధనమ్మపై శాఖాపరమైన చర్యలు ప్రారంభించారు. ఘటన జరిగిన సమయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధుల్లో ఉన్న ఏఎన్ఎం ఈ. జ్ఞానేశ్వరి వైద్యాధికారిని సంప్రదించకుండా ప్రసవం నిర్వహించడం, తీవ్ర రక్తస్రావం ఉన్నప్పటికీ రోగితో పాటు ఆరోగ్య సిబ్బందిని పంపించకపోవడం వంటి అంశాలను కూడా తీవ్రంగా పరిగణిస్తూ ఆమెపై శాఖాపరమైన చర్యలు చేపట్టారు. ఘటన జరిగిన కీలక సమయంలో విధులకు గైర్హాజరైన గుండాల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చి. సుదీప్‌ను పూర్తి స్థాయి విచారణ పూర్తయ్యే వరకు సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిజానిజాలు వెలికితీసేందుకు ఉన్నతస్థాయి కమిటీతో సమగ్ర విచారణ కొనసాగుతోంది.

ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర విచారణ జరిపి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు సూచించేందుకు పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్, జాయింట్ డైరెక్టర్ (మాతా–శిశు ఆరోగ్యం) డాక్టర్ సుధీర, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ రాథోడ్ తుకారామ్ , ఐజనూ డాక్టర్ జి. రవిబాబు సభ్యులుగా ఉన్న ఉన్నత స్థాయి బృందాన్ని ప్రభుత్వం నియమించింది. ఈ బృందం పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన మాతా శిశు ఆరోగ్య సేవలు అందించడం రాష్ట్ర ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యత అని, విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అదే సమయంలో పూర్తి విచారణ నివేదిక వెలువడకముందే వాస్తవాలను వక్రీకరించి ప్రభుత్వ వైద్య వ్యవస్థపై ప్రజల్లో అపోహలు కలిగించే విధంగా ప్రచారం చేయడం సమంజసం కాదని ఆరోగ్య శాఖ పేర్కొంది.

## జిమ్‌లపై పోలీసుల దాడులు

- శరీరాకృతి కోసం స్టెరాయిడ్స్ వినియోగం



హైదరాబాద్, జూన్19 (జనంసాక్షి) : నగరంలోని పలు జిమ్‌లపై ఏసీపీ ఆకస్మిక తనిఖీలు కొనసాగుతున్నాయి. ఇటీవల జిమ్‌లలో వరుసగా యువకులు ప్రాణాలు కోల్పోతున్న ఘటనల నేపథ్యంలో పోలీసులు రంగంలోకి దిగారు. శరీరాకృతి కోసం స్టెరాయిడ్లను విచక్షణారహితంగా వాడటం వల్ల తీవ్రమైన గుండె జబ్బులు, కిడ్నీ సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. దీంతో వెంటనే అప్రమత్తమైన పోలీసులు హైదరాబాద్‌లోని పలు జిమ్‌లలో వరుసగా తనిఖీలు చేస్తున్నారు. శుక్రవారం కుల్సుంపురా, టప్పాచబుత్ర, గుడిమల్కాపూర్ ప్రాంతాల్లోని జిమ్‌లలో పోలీసుల ముమ్మరంగా సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో శరీరాకృతి కోసం యువత యధేచ్ఛగా స్టెరాయిడ్ ఇంజెక్షన్లు, మాత్రలు వాడుతున్నట్లు గుర్తించారు. జిమ్‌లలో యువకులను కలిసిన ఏసీపీ.. స్టెరాయిడ్ల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. షార్ట్‌కట్ పద్ధతులను వదిలి, సహజ పద్ధతుల్లోనే ఫిట్‌నెస్ సాధించాలని యువతకు పోలీసులు సూచనలు చేస్తున్నారు.

## హైదరాబాద్‌లో కొనసాగుతున్న ఫుడ్ సేఫ్టీ దాడులు

- ప్రముఖ హోటళ్లలో కుళ్లిన చికెన్ గుర్తింపు
- పలు రెస్టారెంట్లకు నోటీసులు జారీ



హైదరాబాద్, జూన్19 (జనంసాక్షి) : నగరంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల స్పెషల్ డ్రైవ్ కొనసాగుతోంది. హోటల్స్, రెస్టారెంట్లలో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 45 ప్రముఖ ఫుడ్ లే అవుట్లు, 8 పన్నీర్ తయారీ కేంద్రాలపై దాడులు చేశారు. మరో రెండు రోజులపాటు ఫుడ్ సేఫ్టీ, టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులు కొనసాగనున్నాయి. ఈ దాడుల్లో రెస్టారెంట్లు, హోటల్స్ కిచెన్స్‌లో అధ్వానమైన పరిస్థితులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. జూబ్లీహిల్స్, మాదాపూర్‌లోని ప్రముఖ రెస్టారెంట్లలో రోజుల తరబడి కుళ్లిన చికెన్, పన్నీర్ ఉన్నట్లు సోదాల్లో బయటపడింది. దీంతో దాదాపు 20 రెస్టారెంట్లకు అధికారులు పెనాల్టీలు, నోటీసులు జారీ చేశారు. బేగంబజార్, కాటేదాన్ ప్రాంతాల్లో పన్నీర్ తయారీ కేంద్రాలపై దాడులు చేయగా.. అక్కడి వాతావరణం చూసి అధికారులే షాక్‌కు గురయ్యారు. గంజి పొడి, జంతువుల కొవ్వు ఉపయోగించి పన్నీర్ తయారు చేస్తున్నట్లు గుర్తించారు. ఫుడ్ సేఫ్టీ, టాస్క్‌ఫోర్స్ అధికారుల నేతృత్వంలో తనిఖీలు కొనసాగుతున్నాయి. పాతబస్తీలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లపై హెచ్ ఫాస్ట్ దాడులు నిర్వహించింది. వాడిన ఆయిల్‌ను పదేపదే వినియోగిస్తున్నట్లు గుర్తించారు. అత్యంత ప్రమాదకర రసాయనాలతో సాస్ తయారుచేసి విక్రయాలు జరుపుతున్నట్లు తేలింది. కుళ్లిన కూరగాయలతో సమోసాలు, ప్రమాదకర స్థితిలో ఫ్రైడ్ చికెన్ తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఫాస్ట్‌ఫుడ్ తయారీ గోదామును పోలీసులు మూసివేశారు.

## మెకెదాటు డ్యామ్ నిర్మాణం కుదరదు

- కావేరి డెల్టా రైతులకు తీరని నష్టం
- కర్నాటక తీరుకు నిరసనగా తమిళ అసెంబ్లీలో తీర్మానం



చెన్నై, జూన్ 19 (జనంసాక్షి) : కర్ణాటక ప్రభుత్వం కావేరీ నదిపై మేకెదాటు వద్ద డ్యామ్ నిర్మాణానికి చేస్తున్న ప్రయత్నాలను తమిళనాడు ప్రభుత్వం వ్యతిరేకించింది. మేకెదాటు డ్యామ్ నిర్మాణాన్ని తమిళనాడు ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. డ్యామ్ నిర్మాణంతో కావేరి డెల్టా రైతులకు తీవ్రనష్టం కలుగుతుందని తమిళనాడు ప్రభుత్వం ఆరోపిస్తోంది. గత నెలలో తమిళనాడు ముఖ్యమంత్రి జోసఫ్ విజయ్ ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన సందర్భంగా మేకెదాటు వద్ద డ్యామ్ నిర్మాణాన్ని అడ్డుకోవాలని వినతి పత్రం సమర్పించారు. కావేరి నిర్వాహక మండలిలో సభ్యులుగా ఉన్న రాష్ట్రాల ఆమోదం లేకుండా మేకెదాటు ప్రాజెక్టును చేపట్టడానికి వీలులేదని, ఈ విషయమై కేంద్ర జలశక్తి శాఖకు, కేంద్ర నీటి వనరులకు శాఖకు ఆదేశాలివ్వాలని మోదీని కోరారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల మధ్య వివాదానికి దారి తీసిన మేకెదాటు ప్రాజెక్ట్‌పై తమిళనాడు అసెంబ్లీలో కీలక తీర్మానం జరిగింది. మేకెదాటు డ్యామ్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం ఉదయం ముఖ్యమంత్రి విజయ్ అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. కర్ణాటక ప్రతిపాదిస్తున్న ఈ ప్రాజెక్ట్ కావేరి నదీ జలాల వివాదాల ట్రిబ్యునల్ తుది అవార్డుతో పాటు.. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులను పూర్తిగా ఉల్లంఘిస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పర్యావరణ, సాంకేతిక అనుమతులు సహా ప్రాజెక్టుకు సంబంధించిన ఎలాంటి అనుమతులూ ఇవ్వొద్దని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన ఈ తీర్మానానికి కాంగ్రెస్, వీసీకే, ఇతర పార్టీలు మద్దతు తెలిపాయి.

## అనుమానం పెను భూతమై..

- పసికందును బలి తీసుకున్న తండ్రి
- భార్యపై అనుమానంతో చిన్నారి హత్య



నిజామాబాద్, జూన్19 (జనంసాక్షి) : నిజామాబాద్ పట్టణంలో దారుణ ఘటన వెలుగు చూసింది. రెండు నెలల చిన్నారిని కన్నతండ్రే అత్యంత దారుణంగా నరికి చంపడం కలకలం రేపింది. భార్యపై అనుమానంతో పిల్లాడు తనకు పుట్టలేదన్న అనుమానంతో నిందితుడు ఈ ఘాతుకానికి పాల్పడటం కలకలం రేపుతోంది. మహారాష్ట్రలోని నయాగావ్‌కు చెందిన యువరాజ్, నిజామాబాద్‌లోని అశోక్‌నగర్ కాలనీకి చెందిన ప్రియాంక ఏడాది కిందట వివాహం చేసుకున్నారు. కొన్ని నెలలపాటు వారి బంధం అన్యోన్యంగా సాగింది. ఆ తర్వాత ప్రియాంకపై యువరాజ్ అనుమానం పెంచుకోవడం ప్రారంభించాడు. ప్రియాంకను అనుమానిస్తూ ప్రతిరోజూ వేధించడం మొదలుపెట్టాడు. మరోవైపు ఆమె గర్భం దాల్చడంతో వేధింపులు మరింత పెరిగాయి. ఇటీవల పుట్టింటికి వచ్చిన బాధిత తల్లి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అయితే, చిన్నారి తనకు పుట్టలేదంటూ ప్రియాంక కుటుంబ సభ్యులతో పలుమార్లు యువరాజ్ గొడవకు దిగాడు. ఈ నేపథ్యంలోనే జూన్ 17న బుధవారం చిన్నారిని ఇంటి నుంచి తీసుకెళ్లిపోయాడు. అనంతరం నిర్మానుష్య ప్రదేశంలో బాలుడిని కత్తితో పలుమార్లు నరికి హత్య చేశాడు. ఆ తర్వాత మృతదేహాన్ని రైల్వే పట్టాల పక్కన పడేసి పరారయ్యాడు. సాయంత్రం అయినా భర్త, కుమారుడు ఇంటికి రాకపోవడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడు కోసం గాలింపు చర్యలు చేపట్టి శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. అనంతరం చిన్నారి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. బాలుడి మృతితో ప్రియాంక, ఆమె కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాం నింపింది. యువరాజ్ కిరాతక చర్యపై పట్టణవాసులు తీవ్రంగా నిరసించారు. కఠినంగా శిక్షించాలని కోరారు.

## వర్షాకాలంలో థర్మల్ కేంద్రాలకు సరిపడా బొగ్గు సరఫరా

- సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి




హైదరాబాద్ (జనంసాక్షి) : వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తికి కొంత ఆటంకం కలుగుతుందని, అయినప్పటికీ రాష్ట్ర విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గును అందిస్తామని సింగరేణి ఛైర్మన్, ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి పేర్కొన్నారు. హైదరాబాద్ సింగరేణి భవన్ లో శుక్రవారం తెలంగాణ జెన్ కో ఛైర్మన్ డాక్టర్ హరీష్ సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతిని కలిశారు. థర్మల్ కేంద్రాలకు బొగ్గు సరఫరాపై చర్చించారు. వర్షాకాలంలో యాదాద్రి సహా అన్ని థర్మల్ కేంద్రాల్లోనూ విద్యుత్ ఉత్పత్తికి విఘాతం కలగకుండా నాణ్యమైన బొగ్గును తగినంతగా సరఫరాపై చర్చించారు. దీనిపై సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి స్పందిస్తూ.. సింగరేణి సంస్థ ఉత్పత్తి చేసే బొగ్గులో దాదాపు 93 శాతం బొగ్గు ఓపెన్ కాస్ట్ గనుల నుంచే వస్తుందని, భారీ వర్షాలు కురిసినప్పుడు ఓపెన్ కాస్ట్ గనుల్లో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర ఆటంకం ఏర్పడుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర విద్యుత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని థర్మల్ కేంద్రాలకు తగినంత బొగ్గు సరఫరా కోసం ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. వర్ష ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకొని ఇప్పటికే అన్ని ఓపెన్ కాస్ట్ గనులలో అనేక ముందస్తు చర్యలు చేపట్టామని వెల్లడించారు. ఈ నేపథ్యంలో వర్షాకాలంలో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేయాల్సి ఉన్న బొగ్గు పరిమాణం గురించి స్టాక్ గురించి కూలంకషంగా చర్చించారు. సింగరేణి సంస్థ రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు ఏడాదికి దాదాపు 28 మిలియన్ టన్నుల బొగ్గును సరఫరా చేస్తుంది. రోజుకు 60 నుంచి 70 వేల టన్నుల బొగ్గును సరఫరా చేస్తున్నట్లు సింగరేణి డైరెక్టర్లు వివరించారు. తెలంగాణ విద్యుత్ అవసరాలకు విఘాతం కలగకుండా చూడాలని సీఎండీ స్పష్టం చేశారు. బొగ్గు నాణ్యత విషయంలోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు. సమావేశంలో సింగరేణి డైరెక్టర్లు ఎల్ వి. సూర్యనారాయణ(ఆపరేషన్స్), డైరెక్టర్ కె. వెంకటేశ్వర్లు (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్), జనరల్ మేనేజర్ (కో ఆర్డినేషన్ అండ్ మార్కెటింగ్) తాడబోయిన శ్రీనివాస్, తెలంగాణ జెన్‌కో ఈడీ నగ్యా, డైరెక్టర్ రాజశేఖర్, సీఈ లక్ష్మయ్య తదితరులుఅధికారులు పాల్గొన్నారు.




## ఫాల్కన్ ఇన్వాయిస్ కేసులో కీలక పరిణామం

- మరో నిందితుడిని అరెస్ట్ చేసిన తెలంగాణ సిఐడి

హైదరాబాద్, జూన్19 (జనంసాక్షి) : ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కొంటింగ్ స్కామ్ కేసులో మరో కీలక నిందితుడిని తెలంగాణ సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. ముంబైకి చెందిన వరల్డ్‌లైన్ ఈ–పేమెంట్ గేట్‌వే ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ షేక్ మొహిదీన్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కొంటింగ్ పేరుతో రూ.792 కోట్ల మోసానికి పాల్పడిన కేసులో అతడిని అరెస్టు చేశారు. ఈ కేసులో ఇప్పటికే ఫాల్కన్ గ్రూప్ ఎండీ అమర్‌దీప్ కుమార్‌తో పాటు పలువురు కీలక నిందితులు అరెస్టయ్యారు. తాజాగా ముంబైకి చెందిన ఈ కీలక నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులు ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కొంటింగ్ అప్లికేషన్, వెబ్‌సైట్ ద్వారా దేశవ్యాప్తంగా 7,056 మంది నుంచి పెట్టుబడుల రూపంలో నగదు సేకరించినట్లు సీఐడీ అధికారులు గుర్తించారు. అధిక లాభాల ఆశ చూపి డిపాజిటర్ల నుంచి ఏకంగా రూ.4,215 కోట్లు తీసుకున్నట్లు తేల్చారు. వీరిలో 4,065 మందిని క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా రూ.792 కోట్ల మేర మోసం చేసినట్లు తెలిపారు. కాగా, అమర్‌దీప్ కుమార్‌తో షేక్ మొహిదీన్ కుమ్మక్కై పేమెంట్ గేట్‌వే సేవల ద్వారా డిపాజిట్లు సేకరించేందుకు సహకరించినట్లు సీఐడీ అధికారులు తేల్చారు. దీంతో ఈ కంపెనీతో సుమారు రూ.7.5 కోట్ల లావాదేవీలు జరిగినట్లు సీఐడీ అధికారులు గుర్తించారు. షేక్ మొహిదీన్‌ను అరెస్టు చేసిన సీఐడీ అధికారులు రిమాండ్‌కు తరలించారు.

## సింగరేణిపై బీజేపీ చిల్లర రాజకీయాలు

- అక్కడ పర్యటించే హక్కు ఆ నేతలకు లేదు
- ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ విమర్శలు



హైదరాబాద్, జూన్19 (జనంసాక్షి) : సింగరేణిపై బీజేపీ ఇకనైనా చిల్లర రాజకీయాలు మానుకోవాలని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ అన్నారు. సింగరేణి సంస్థపై మాట్లాడే నైతిక అర్హత గానీ, అక్కడ పర్యటించే హక్కు గానీ బీజేపీకి ఎంతమాత్రం లేదని ఆయన స్పష్టం చేశారు. బొగ్గు బ్లాకులను ప్రైవేటుపరం చేయాలని నిర్ణయించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నాయకత్వంలో పనిచేస్తున్న బీజేపీ నాయకులు.. ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని సింగరేణికి వెళ్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఈ చర్యల ద్వారా బీజేపీ ఎంతటి దౌర్భాగ్య స్థితిలో ఉందో స్పష్టంగా అర్థమవుతోందని ఎద్దేవా చేశారు. సింగరేణి సంస్థను దెబ్బతీసేందుకు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కలిసి కుట్రలు పన్నుతున్నాయని అద్దంకి దయాకర్ ఆరోపించారు. పైకి మాత్రం వేర్వేరుగా నటిస్తున్నప్పటికీ.. ఈ రెండు పార్టీలు రాజకీయ మిత్రులని విమర్శించారు. సింగరేణిని చుట్టుముట్టి ఇరు పార్టీలు చేస్తున్నవి కేవలం రాజకీయాలేనని మండిపడ్డారు. దేశంలో బొగ్గు గనులను ప్రైవేటీకరిస్తున్న విధానంపై, సింగరేణిని ప్రైవేటుపరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపై కిషన్ రెడ్డి తక్షణమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బొగ్గు గనులను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్న బీజేపీకి, బొగ్గు నిల్వలపై మాట్లాడే అర్హత ఎక్కడిదని నిలదీశారు. సింగరేణి సంస్థను ప్రైవేటీకరణ ముప్పు నుంచి కాపాడింది, నిరంతరం ఆదుకుంటున్నది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని అద్దంకి దయాకర్ స్పష్టం చేశారు.

## కేంద్రానిది అప్పుడూ, ఇప్పుడూ మొండివైఖరే

- కేసీఆర్ రైతులకు అండగా ధాన్యం కొనుగోళ్లు
- 12 వేల కోట్లు ధాన్యం కొనుగోళ్లకు కేటాయించారు
- మాజీమంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

నిజామాబాద్, జూన్ 19 (జనంసాక్షి) : ధాన్యం కొనుగోళ్లలో బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా కేంద్రం కక్షపూరితంగా వ్యవహరించిందని, అయినా ఆనాటి సిఎం కెసిఆర్ ఏనాడూ రైతులకు అన్యాయం చేయలేదని, మాజీమంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. రైతులకు అండగా నిలిచి ఊరూరా కొనుగోలు కేంద్రాలతో పంటలు కొనుగోలు చేయించిన ఘనత కెసిఆర్‌దని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఉత్పత్తి అయిన మొత్తం ధాన్యంలో 3వ వంతు, ఇతర పంటల్లో 25శాతం కొనుగోలు చేయడం ఇప్పుడే అమలుచేసిన కొత్త విధానం కాదు. నాడు బీఆర్ఎస్ సర్కార్ హయాంలోనూ కేంద్ర ప్రభుత్వం ఇదే వైఖరిని అవలంబించింది. రాష్ట్రంలో రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయబోమని అనేక ఇబ్బందులకు గురిచేసింది. ఒక దశలో అప్పటి సీఎం కేసీఆర్ ఏకంగా కేంద్ర ప్రభుత్వంపై తెలంగాణ రైతుల తరఫున పెద్ద పోరాటమే చేశారు. అయినప్పటికీ కేంద్రం తెలంగాణ రైతుల పట్ల తన వివక్షను వీడలేదని గుర్తు చేశారు. ఉత్పత్తి అయిన మొత్తం పంటను కేంద్రమే కొనుగోలు చేయాలని తామూ పోరాడామని అన్నారు. కేంద్రం నిరాకరించినా రాష్ట్రం ముందుకు వచ్చి ధాన్యం సేకించిందని వేముల అన్నారు.కానీ ప్రస్తు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదని చెబుతున్నది. ప్రతిపక్షంలో ఉండగా పంటల కొనుగోళ్లపై కాంగ్రెస్ పార్టీ చేసిన రాద్ధాంతం అంతాఇంతా కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం పంటలు కొనుగోలు చేయకపోతే రాష్ట్రం ప్రభుత్వం ఏం చేస్తుందని, రైతుల పంటలు కొనుగోలు చేసేందుకు కూడా పైసలు లేవా? అంటూ నాటి పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి ప్రశ్నించిన విషయం గుర్తు చేశారు. తాము అధికారంలోకి వస్తే ప్రతి పంటనూ మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని, అంతేకాదు.. మద్దతు ధరకు అదనంగా బోనస్ కూడా చెల్లిస్తామని ప్రకటించారు. తీరా అధికారంలోకి వచ్చిన రెండున్నరేండ్లలోనే పంటల కొనుగోళ్లపై చేతులెత్తేసిందని మండిపడ్డారు. నాడు పదేండ్ల పాటు రైతులకు ఇబ్బందుల్లేకుండా కేసీఆర్ పంటలు కొనుగోలు చేస్తే.. ఇప్పుడు రేవంత్ సర్కార్ రెండున్నరేండ్లకే తమ వల్ల కాదని చేతులెత్తేసిందని అన్నారు. ఉత్పత్తి చేసిన మొత్తం పంటలను కొనుగోలు చేయాలని, లేకుంటే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చిరించారు.

## కేబీఆర్ పార్క్ చుట్టూ మరోసారి వన్‌వే

- ఆదివారం ట్రయల్ రన్ నిర్వహించనున్న పోలీసులు



హైదరాబాద్, జూన్19 (జనంసాక్షి) : నగరవాసులకు ట్రాఫిక్ పోలీసులు అలర్ట్ జారీ చేశారు. ఆదివారం కేబీఆర్ పార్క్ చుట్టూ మరోసారి వన్‌వే ట్రయల్ రన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డెవిస్ వివరాలు వెల్లడించారు. ట్రయల్ రన్ విజయవంతమైతే వారం తర్వాత వన్‌వేను పూర్తి స్థాయిలో అమలు చేస్తామని ఆయన పేర్కొన్నారు. పార్క్ చుట్టూ ఏడు ఫ్లైఓవర్లు, ఏడు అండర్‌పాస్‌ల నిర్మాణాలు జరుగుతున్నాయని, పనులు జరిగే రోజుల్లో వన్‌వే విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు జాయింట్ సీపీ చెప్పారు. గతంలో ఒకసారి ట్రయల్ రన్ నిర్వహించామని, ఈ సందర్భంగా పలు జంక్షన్లలో ట్రాఫిక్ ఇబ్బందులను గుర్తించామని జోయల్ డెవిస్ తెలిపారు. 45 జంక్షన్ వద్ద పీక్ అవర్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు ఉన్నాయని, వాటిని పరిష్కరిస్తామన్నారు. అలాగే డ్రోన్ విజువల్స్‌ను పరిశీలించామని, ప్రయాణికులు, నిపుణుల అభిప్రాయాలను తీసుకున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం మరోసారి ట్రయల్ రన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ 21న ఉదయం నుంచి రాత్రి వరకు ఈ ట్రయల్ రన్ ఉంటుందని వెల్లడించారు. ఈ ట్రయల్ రన్‌లో 150 మంది సిబ్బంది పాల్గొంటున్నట్లు చెప్పుకొచ్చారు. నగరవాసులు ట్రాఫిక్ అలర్ట్‌ను గమనించాలని జోయల్ డెవిస్ పేర్కొన్నారు. నగర ప్రజల ట్రాఫిక్ కష్టాలు తీర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ మేరకు కేబీఆర్ పార్క్ చుట్టూ ఏడు ఫ్లైఓవర్లు, ఏడు అండర్‌పాస్‌ల నిర్మాణాలను చేపట్టింది. ఇవి పూర్తయితే నగరవాసులకు ట్రాఫిక్ కష్టాలు తీరే అవకాశం ఉంటుంది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370